
శ్రీమతి ఆశా ప్రభాత్

బీహారీ నవల

# నేను అతను!



సత్యేన్ భార్య ముక్త ఇద్దరు పిల్లల తల్లి. ఎదురు ఫ్లాట్‌లో అద్దెకు దిగిన బ్యాంక్ మేనేజర్ శామ్యూల్ చొరవగా ఆమె ఇంటికి రావడం ప్రారంభించాడు. తొలిదశలో అతడిని అసహ్యించుకున్న ముక్త - రోజులు గడిచేకొద్దీ శామ్యూల్ రాక కోసం ఎదురు చూసే పరిస్థితికి చేరుకుంది. ముక్తను శామ్యూల్ ఎలా ఆకట్టుకున్నాడు? స్త్రీ స్వేచ్ఛ నేపథ్యంగా స్త్రీ పురుష సంబంధాల్ని విశ్లేషణాత్మకంగా చిత్రించిన శ్రీమతి ఆశాప్రభాత్ బీహారీ నవల మై ఔర్ వహ్‌కు కర్నాటి నాగభూషణం తెలుగు అనువాదం నేను - అతను ఈనెల చతుర కానుక!

అనువాదం :

**కర్నాటి నాగభూషణం**



"మమ్మీ.. మమ్మీ.. మనకి ఎదురు వైపుగా ఉన్న ఫ్లాట్‌లోకి ఎవరో అద్దెకు దిగారు. వాళ్లకి పిల్లలు కూడా ఉండొచ్చు. ఎంచక్కా వాళ్లతో ఆడుకుంటాం" నా ఇద్దరు కూతుళ్లూ ఒకేసారి ఉత్సాహంగా చెప్పారు.

అయితే మర్నాడు పొద్దుటివరకు ఏ పిల్లలూ ఆ ఫ్లాట్‌లోంచి బయటికి రాకపోవడంతో యిద్దరూ నిరుత్సాహానికి గురయ్యారు. స్కూలుకు వెళ్తూ వెళ్తూ నాకు ఆర్డరు వేసి వెళ్ళారు. "ఆ కొత్తగొచ్చినవాళ్ల పిల్లల గురించి తెలుసుకో మమ్మీ. ఎంత మంది పిల్లలు? ఎక్కడుంటారు? సుమీ తాంటీలా వాళ్ల పిల్లల్ని కూడా హాస్టల్లోనే ఉంచారేమో అడుగు.."

రితు, మోనూల మాటలు ముద్దుగా అనిపించాయి. ఏ వయసువాళ్లు ఆ వయసువారి స్నేహంకోసం పరితపించడం సహజం. లోగడ అద్దెకున్నవాళ్ల పిల్లలు తాన్య, దినేష్ ఉన్నన్ని రోజులు వారితో బాగా కలిసి ఆడుకునేవారు. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేవారు. అందరు కలిసే హోంవర్క్ చేసుకుంటూ చదువుకునేవారు.

నా భర్త సత్యేన్ సేల్స్ రెప్రజెంటేటివ్ అవడంతో ఆయన ఎక్కువ రోజులు పర్యటనల్లోనే ఉంటారు. ఆయన ఇంటి దగ్గర ఉన్నారంటే స్నేహితులతో బాతాఖానీ కొట్టడం, పిల్లలతో కాలక్షేపం చేయడంతో ఇల్లు సందడిగా ఉంటుంది. సత్యేన్ క్యాంపుకు వెళ్ళిపోగానే ఇల్లు నిశ్శబ్దమయిపోతుంది. పిల్లలు బడికి వెళ్లిపోతారు. ఒంటరి ఇల్లు, ఒంటరితనం వేధిస్తుంది. అసలే అది అపార్టుమెంట్. ఎవరి గురించి ఎవరూ పట్టించుకోరు. ఏదైనా పని ఉండి పిలిస్తేగానీ పలకరు. అన్ని తలుపులు మూసే ఉంటాయి.

కాలక్షేపానికి నేను స్వెట్టర్లు అల్లడం అలవాటు చేసుకున్నాను. చలికాలంలో కొంతవరకు ఆ పనితో సమయం సులువుగానే గడిచిపోతుంది. వేసవిలో ఆ పని లేనప్పుడు ఏదైన నవలో, పత్రికో చదువుతూ పొద్దు గడుపుతాను. అడపాదడపా మనస్సు ప్రేరేపించినప్పుడు కవితలో, వ్యాసాలో వ్రాస్తుంటాను. ఎప్పుడన్నా తీరిక వేళల్లో మా పొరుగింటి సుమీత వస్తే ఆ కవితల్ని ఆమెకు చదివి వినిపిస్తాను.

అప్పుడే పూర్తయిన ఒక స్వెట్టర్‌ను చక్కగా మడతపెట్టి ప్లాస్టిక్ కవరులోకి దోపాను. అంతలోనే తలుపు తట్టిన ధ్వని వినిపించింది. తలుపుతెరిచే ఉండడంతో తలెత్తి చూడగానే గుమ్మంలో నిల్చున్న వ్యక్తి కనిపించాడు.

ఆరడుగుల ఎత్తు, మంచి తెలుపుతో, గుండ్రటి ముఖంలో సూదిలా మొనదేలిన ముక్కు, చాలా అరుదుగా ఉండే గులాబీ రంగుతో పల్చటి పెదవులు, దట్టమైన కనుబొమలతో, తేలికపాటి నీలికనులతో అందంగా ఉన్నాడు. ముప్ఫయి ఐదేళ్లు దాటిన వ్యక్తిలా ఉన్నా, ఆకర్షణీయంగానే ఉన్నాడు. అతను తొడుక్కుని ఉన్న స్వెట్టర్‌ను అంతగా అనుభవంలేని వ్యక్తి అల్లినట్టు ఉంది. అది అతనికి సరిగ్గా నప్పలేదు. గొంతుకు బిగుసుకుపోయినట్టుగా, ఏవేవో మిగిలిపోయిన ఉన్ని దారాలతో అల్లిన అతుకుల బొంతలా ఉంది. అందులో అతన్ని చూడగానే నాకు 'అయ్యో పాపం!' అనిపించింది.

నేను వెంటనే తేరుకుని అడిగాను- "చెప్పండి ఏం కావాలి? "

"ఇక్కడ చేతితో స్వెట్టర్ అల్లుతారా? మెయిన్‌గేట్ దగ్గర రాసి ఉంది"

"అవును. రండి లోపలకి"

"నా పేరు శామ్యూల్. ఇక్కడికి కొత్తగా వచ్చాను. ఒక స్వెట్టర్ అల్లించుకోవాలి"

"అల్లుతాను"

"ఇదిగోండి ఉన్ని" అతను కొద్దిగా లోపలికి వచ్చి ఉన్ని ప్యాకెట్ టేబుల్‌పైన పెట్టి, వెంటనే బయటికి వెళ్లిపోయాడు. నేనేమి వివరాలు అడిగి తెలుసుకోకముందే అతను హడావుడిగా వెళ్ళడంతో నేను బిత్తరపోయాను. కనీసం స్వెట్టర్ ఎవరికోసం అల్లాలి? సైజేమిటి? స్వెట్టర్ హాఫా, ఫుల్లా? ఇంత తొందరపాటు మనిష లాగున్నాడేమిటి? పైగా ఎక్కడుంటాడో కూడా చెప్పలేదు.

నా ఆలోచన తరంగాలు మిసెస్ భాస్కర్ ఆకస్మిక రాకతో ఆగిపోయాయి.

"ముక్తాగారూ! స్వెట్టర్ పూర్తయిందా?" వచ్చినంత వేగంగానే అడిగేసిందామె.

"ఓ.. ఎప్పుడో పూర్తయింది. చెప్పిన టైంకు ఇవ్వడం నా స్పెషాలిటీ" నవ్వుతూ అన్నాను.

ఆమె స్వెట్టర్‌ను ప్యాక్ చేస్తూ, ఏదో యధాలాపంగా అడిగాను, "ఎలా ఉన్నారు? ఇంట్లో అంతా కుశలమేగా?"

ఆ మాత్రానికే ఆమె ఫట్‌మని పగిలిన బుగ్గలా విరుచుకు పడింది- "ఏం కుశలమో, ఈ ఎన్నికల ప్రచారాలతో చెవులు దద్దరిల్లి పోతున్నాయి. మీకు ఈ అపార్టుమెంటులోకి ఏ గోలలు వినపడవు. మా వీధుల్లో ఆ ఊరేగింపులు, రణగొణధ్వనులతో చెవులు చిల్లులు పడిపోతున్నాయి. అడ్డమైనవాళ్లంతా వచ్చి వీళ్లకు ఓటు వేయాలి, వాళ్లకి ఓటు వేయాలని ఒకటే నస.." ఎవరిమీద అక్కసో నా మీద ఒలకబోస్తూ లొడలొడా వాగేస్తూనే ఉంది.

ఆమె గోల వినబడనట్టే, సైజుకోసం ఇచ్చిన పాత స్వెట్టరు వెతికి గబగబా ప్యాక్‌చేసి ఆమె చేతికిచ్చాను.

మిసెస్ భాస్కర్ వెళ్లిపోగానే పెద్ద తుపాను వచ్చి పోయినట్టయింది. ఇవాళ పనిలో మనసు నిమగ్నమయ్యేలా లేదు. మిసెస్ భాస్కర్ వాగుడికి తల బరువెక్కిపోయింది. శామ్యూల్ ఇచ్చిపోయిన ఉన్ని బండిల్‌ను డ్రాయింగ్‌రూంలోని సెంటర్ టేబుల్‌పైన పెట్టాను. అప్పటికి మా పని మనిషి సుమీరన్ ఇంకా ఇంట్లోనే ఉండడంతో, టీ కాచమని చెప్పి బయటి వరండాలోకి వచ్చాను. వరుసగా ఉన్న ఎదురు ఫ్లాట్ వరండాలో ఒకవ్యక్తి కుర్చీలో కూచుని పుస్తకం చదువుతూ కంటబడ్డాడు. అతని రూపురేఖలు అచ్చం శామ్యూల్‌కు మల్లేనే ఉన్నాయి. అయితే కొత్తగా అద్దెకు దిగింది శామ్యూలేనా? ఇంత చేరువలో ఉండి కూడా అంత కొంప లంటుకుపోతున్నట్టు తిరిగెళ్లిపోయాడేమిటీ? ఇరుగు పొరుగుతో పరిచయం చేసుకోవాలని కూడా అనిపించదా ఇతనికి? నాకు మాత్రం అతను ఎక్కడ్నుంచి వచ్చాడో, అతని కుటుంబ వివరాలు తెలుసుకోవాలని కుతూహలం కలిగింది. ముఖ్యంగా వారి పిల్లల గురించి అడగాలని ఉంది.. మళ్లీ నాకే సంకోచం కలిగింది. అనవసరంగా అతని గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నాననిపించింది.

అంతలోనే సుమీరన్ టీ కప్పు తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టి, కూరగాయలు ఏమేమి తేవాలని అడిగి, బజారుకు వెళ్లింది. టీ తాగుతూ మధ్యలో అతను ఇచ్చి వెళ్ళిన ఉన్ని పాకెట్‌ను తెరిచాను. తేలికపాటి గోధుమరంగు ఉన్ని బండిల్, గోతాళ్లా ఉంది. లేబుల్ చదివాను. నాకు కొద్దిగా నవ్వు వచ్చింది. బహుశా అతనికి మంచి కంపెనీల క్రేజ్ ఉన్నట్టుంది. రంగు ఏదైనా నాణ్యత బావుండాలి. అది రేమండ్ ఉన్ని. తరచూ రకరకాల రంగుల ఉన్ని చూస్తుంటాను. కొందరు నాసిరకాల రంగులు తెచ్చినా అల్లక తప్పదు.

మొన్నీమధ్యే రంగుల విషయంలో నేను మావారితో చర్చించాను. అయిష్టతను వ్యక్తం చేస్తూ, "జనం ఇష్టాయిష్టాలు

ఎలాగుంటాయో చూడండి! చిక్కటి ఆకు పచ్చ, కళ్లకు కొట్టొచ్చినట్టు కనిపించే నారింజ రంగు, ఎర్రగా మెరిసిపోయే ఎరుపు ఎక్కువమంది ఇష్టపడుతున్నారు”

నా మాటలు విని సత్యేన్ నవ్వేస్తూ అన్నారు, “దట్టమైన రంగులు తొందరగా వెలిసిపోవని ఎక్కువగా చిక్కటి రంగులు ఎంచుకుంటారు. అయినా అందరి ఇష్టాలు, అలోచనలు ఒకేలా ఉండవు. ప్రతి మనిషికి ‘తన ఇష్టం’, ‘తన ఆలోచన’ ఉంటుంది. విభిన్న రంగులతోనే ప్రకృతి అందం ఇమిడి ఉంటుంది. జీవితం కూడా ఒకే మూసలో సాగదు. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం- ఈ దశలు కూడా ఒక విధంగా రంగుల వంటివే. ఎప్పటికైనా వెలిసిపోయేవే” మావారి వేదాంతంతో నా నోరు మూతబడింది. ఆయన మాటలు కూడా నిజమే. అందరికీ ఒకే రంగు నచ్చితే జీవితంలోని ఆనందాన్ని చవిచూడలేరు. ప్రకృతి శోభాయమానంగా తోచదు. అంతటితో చర్చ ఆగిపోయింది.



2

ప్రతి బుధవారం పిల్లలు చాలా ఉత్సాహంగా చిత్రహార్ కోసం ఎదురు చూస్తుంటారు. ఇవాళ కూడా బుధవారం. రాత్రి ఎనిమిది కావస్తోంది. టీవీలో చిత్రహార్ సమయం అవుతోంది. పిల్లలు బలవంతంగా నన్ను కూడా టీవీ ముందు కూచోబెట్టారు. నాకు చిత్రహార్ చూడాలని లేదు. ‘అనామకుడు’ అనే నవల చదువుతున్నాను. చాలా ఆసక్తిగా ఉంది. రెండో ప్రపంచయుద్ధంలో తలెత్తిన ఆందోళన, వ్యాకులత, నిరాశ, అశ్రద్ధలతో గడిచిపోతున్న యూరోపియన్‌ల మానసిక దౌర్బల్యం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. అందులో వ్యక్తమైన మానవీయ ఆకాంక్షలు, ఆలోచనలు ఆత్మను సైతం వణికించేస్తున్నాయి. ఆ నవలను పక్కనబెట్టి రాబుద్ధి కావడంలేదు. కానీ పిల్లలు పట్టుబట్టారు.

చిత్రహార్ మొదలయింది. పాతసినిమా పాటలు, శ్రోతలు కోరుకున్నవి.. పసందైన పాటలే వస్తున్నాయి. ఒకసారి విందాంలే అనుకుని వచ్చి టీవీ ముందు కూచున్నాను. అప్పుడే కాలింగ్‌బెల్ మోగింది. ఈవేళప్పుడు ఎవరు? ఇంత చలిలో బహుశా సత్యేనా? లేచివెళ్లి తలుపు తెరిచాను. గుమ్మంలో శామ్యూల్ నిల్చున్నాడు. అతన్ని చూసి విస్తుపోయాను.

“క్షమించండి, డిస్టర్బ్ చేసినట్టున్నాను. కాసేపు వార్తలు విని వెళ్తాను” అంటూ నా అంగీకారం కోసం ఎదురుచూడకుండానే ఇంట్లోకి దూరేశాడు. అతను దూసుకురావడం చూసి నేను బిత్తరపోయాను. వెంటనే ఏమనాలో నాకు తోచలేదు. స్వెట్టర్ అల్లమని చెప్పడానికి వచ్చినప్పుడు నిమిషం కూడా నిలబడనివ్వని బిడియం ఇప్పుడతనిలో మచ్చుకయినా కనబడ్డం లేదు. అతను హాల్లో నిలబడి నిశ్చింతగా చుట్టూ కలియజూశాడు. నేను మౌనంగా ఉండిపోయాను.

“ఏమండీ, కూర్చోవచ్చా? ” అని అడగ్గానే నేను తేరుకున్నాను.

“ఆc.. ఆc... కూర్చోండి. దానిదేముంది? ” సోఫాకేసి చూపాను.

అతను కూర్చున్నాడు. చిత్రహార్‌లో చివరి పాట వస్తోంది. దాని తర్వాత వార్తలు మొదలవుతాయి. నేను లోపలికి వెళ్లిపోయాను.

వార్తలు మొదలు కాకమునుపే, ఒక ప్లేటులో ఉప్పు బిస్కెట్లు, పండ్ల ముక్కలు, టీ, నీళ్లు తీసుకొచ్చాను. ట్రే టీపాయ్ పైన పెట్టి నీళ్లబాటిల్ అతనికిచ్చాను. అతను తలెత్తి నా వంక చూసాడు. అతని చూపుల్లో ఇంత త్వరగా ఆతిథ్య సత్కారం అందడం పట్ల ఆశ్చర్యపూరిత కృతజ్ఞతా భావం స్ఫురించింది. నేను బిస్కెట్లు వగైరా ఏమైనా తీసుకొమ్మని చెప్పాను. అతను ఒక యాపిల్ ముక్కను తీసుకొని మెల్లమెల్లగా కొరకసాగాడు. అతని చేతి వేళ్లు చాలా పల్చగా, నాజూగ్గా ఉన్నాయి. ఏదో శిల్పాన్ని చెక్కే శిల్పి వేళ్లలా సున్నితంగా ఉన్నాయి. అతన్ని చూస్తుంటే, ఏదైనా కళాకారుడేమో అనిపించింది.

వార్తలు ముగిశాయి. ఇంకా అతను కూచునే ఉన్నాడు. మా మధ్య మౌనం రాజ్యమేలుతోంది. అతను ఏం ఆలోచిస్తున్నాడో నాకు తెలియదు. నాకు మాత్రం అతను వెళ్లిపోతే, మామూలు స్థితికి చేరుకోవచ్చని ఉంది. అతను వెళ్లడంలేదు. ఏం మాట్లాడ్డం లేదు. బహుశా అతను కూడా నాకు మల్లేనే పరిచయం పెంచుకోవడానికి తటపటాయిస్తున్నాడేమో? విసుగుకు బదులు నవ్వు ఉత్పన్నమయింది లోలోపలే. ఒకే స్వభావం గల వ్యక్తుల్లో బహుశా అందుకేనేమో చొరవ ఉండదు. ఇలాంటప్పుడు ఎంతకాలమైనా అనామకులుగానే ఉండిపోతారు. ఒకోసారి నా స్వభావానికి ఉడుక్కుంటూ సత్యేన్ ఆగ్రహం వ్యక్తం చేస్తారు.. 'ఒకే రైలుపెట్టెలో కూచుని, మొత్తం భారతదేశమంతా పర్యటించినా నువ్వు ఎవరితోను పరిచయం పెంచుకోవు. ఇలాంటి స్వభావం మంచిదికాదు. కలుపుగోలుగా ఉండాలి' అంటారు.

అయితే ఇప్పుడు నేను రైల్లో లేను. నా ఇంట్లో ఉన్నాను. ఇది నా ఇల్లు. అతను నా ఇంటికి వచ్చిన అతిథి. ఇంటికి వచ్చిన వ్యక్తిని పలకరించడం నా బాధ్యత. అయితే పిలవని పేరంటానికొచ్చిన అతిథిని ఏమని పలకరించాలి? అందులోనూ అపరిచితుడు, అనామకుడు. అయినా ఏదో ఒకటి అడగాలనిపించింది.

"మీరు ఎక్కడ్నుంచి వచ్చారు? "

"జోగ్బనీ నుండి"

"నేపాల్ సరిహద్దు ప్రాంతం కదూ, అదీ? "

"అవును" తలూపాడతను.

అతని వృత్తి, ఉద్యోగం గురించి అడగాలని ఉన్నా అడగలేకపోయాను. ఒకరి వ్యక్తిగత విషయాలు అడగడం నాకు ఇష్టం ఉండదు. అయితే స్వెట్టర్ అల్లిక గురించి అడగాల్సింది ఉంది. ఒకవేళ ఆఫీసర్ అయితే స్వెట్టర్ మెడ కొంచెం విశాలంగా ఉండేలా అల్లాల్సి వస్తుంది. టై కట్టుకోవడానికి అనువుగా స్వెట్టర్ మెడ పెద్దగా ఉండాలి. ధైర్యం చేసి అడిగాను.

"మీరు ఏం చేస్తూ ఉంటారు? "

"సెంట్రల్ బ్యాంకులో బ్రాంచీ మేనేజర్ని"

అతను చిన్నగా చెప్పాడు.

"ఫ్యామిలీని వెంట తీసుకురాలేదా? "

"పిల్లల చదువుల కారణంగా వాళ్లు పాట్నాలోనే ఉంటున్నారు"

"ఎందరు పిల్లలు? "

"ఇద్దరు అబ్బాయిలు" అతను తన గురించి చెప్పాడేగానీ నా గురించి, నా భర్త, పిల్లల గురించి అడగలేదు. నాకు అదోలా అనిపించింది. అతను మరీ అంత అమర్యాదస్తుడిలానూ కనిపించడం లేదు. ఈ కొద్దిపాటి తెగువతోనే పూర్తిగా దూసుకుపోవడం సబబుకాదని గ్రహించి మిన్న

కుండి పోయుంటాడు. నిజానికి ఇప్పుడు అతను చేసిన తెగువే చాలా ఎక్కువ. పిల వకుండానే పరాయి ఇంట్లోకి రావడం తెగువే కాదు, సాహసం కూడా అని అతను గ్రహించే ఉండాలి. అందుకే మితి మీరి ప్రవర్తించడం లేదు. నాక్కూడా ఇంకా ఏమి అడగాలనిపించలేదు. నేను లేచి లోపలికి వెళ్లిపోయాను.

సుమీరన్ పిల్లలకు భోజనాలు వడ్డి స్తోంది. మళ్లీ డ్రాయింగ్ రూంలోకి తిరిగొ చ్చాను. ఏ అతిథినైనా ఒంటరిగా వదిలేసి వెళ్ళడం సంస్కారం కాదు. నేను తిరిగిరా గానే అతను లేచి నిలబడ్డాడు, వెళ్లడానికి. నేను గుమ్మందాక సాగనంపడానికి వెళ్ళాను. గుమ్మం దాటాక అతను అకస్మా త్తుగా ఆగిపోయాడు. వెనుదిరిగి చూసి, చిన్నగా నవ్వాడు. తర్వాత వెళ్లిపోయాడు. నేను అవాక్కయి ఆలోచనలో పడ్డాను. ఇంతకీ ఆ చిరునవ్వు ఎందుకు? ఇక్కడికి వచ్చి కూచొని, టీ ఫలహారం పుచ్చుకున్నం దుకు కృతజ్ఞతగా అయితే నోటితోనే చెప్పొ చ్చుగా? ఈ నగర సంస్కృతిలో కొద్దిపాటి ఆదరణకయినా విధేయతను వ్యక్తం చేయడం సభ్యతే అయినా ఇప్పుడతను నవ్వుతో వ్యక్తం చేసిన కృతజ్ఞతాభావం ఎలాంటిది? అర్థం కావడం లేదు. అతను నవ్విన ఆ చిన్న నవ్వు పదేపదే నా మస్తి ష్కాన్ని తొలిచేస్తోంది. నాకయితే అతను మితభాషిలాగే అనిపిస్తున్నాడు. పూర్తిగా ముభావి.

మర్నాడు సాయంత్రం నేను సుమీత వాళ్ల డ్రాయింగ్‌రూంలో కూచున్నప్పుడు, బాతాఖానీ మధ్యలో అతని ప్రస్తావన వచ్చింది. సుమీతే అతని ఊసెత్తింది. "వింత మనిషిలా ఉన్నాడే, ఈ కొత్త కిరా యిదారు. దెయ్యం పట్టినవాడిలా ఎప్పుడు ఒకేవైపు చూస్తూ ఉంటాడు. కొంపదీసి అతనికేమైనా స్క్రూ లూజా ఏమిటీ? "

"ఒకే వైపంటే, కొంపదీసి నీకేసే చూస్తు న్నాడా ఏమిటీ? జాగ్రత్తగా ఉండు. ఏదైనా హిప్నాటిజం తెలుసేమో. మీ కిటికీ సరిగ్గా అతని తలుపుకు ఎదురుగా ఉంది" అని, ఇద్దరం పగలబడి నవ్వు కున్నాం. అంత ముభావికి, అదేం దురల వాటో నాకర్థం కాలేదు. నేను మా ఇంట్లోకి తిరిగెళ్ళిపోయి, తలుపు గడియ పెట్టేస్తూ, నా మదిలో మెదిలే తలపులను కూడా కట్టేయాలనుకున్నాను.




**కి**చెన్ కిటికీ తెరిచాను. ఆకాశం నిర్మ లంగా ఉంది. మేఘాలు మెల్లి మెల్లిగా కది లిపోతున్నాయి. ఎదురుగా ఉన్న యూకలి ప్టస్ చెట్లమీది గూటిలోంచి రెండు పిచ్చు కలు మేఘాలకేసి నిరాశగా చూస్తు న్నాయి. అదే సమయంలో డ్రాయింగ్ హాలు కిటికీ దగ్గర నుంచి అతను వెళ్ళాడు. నావంక చూసి చిన్నగా నవ్వాడు.

అది పలకరింపో, పరిహాసమో నాకు అర్థం కాలేదు. నేను అదే మీమాంసలో ఉండగా, సత్యేన్ అటాచీలో బట్టలు సర్దు కుంటూ చెప్పారు.

"సాయంత్రం బండికి నేను కోల్‌కతా వెళ్తున్నాను"

"మీరు ఎన్ని రోజులకి తిరిగొస్తారు? " అడిగాను.

ఆయన వెళ్తాననేసరికి నా మనస్సు చివుక్కుమంది.

"నాలుగైదు రోజులు పట్టొచ్చు, రావడానికి. నువ్వు ఇవాళ రితూని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లు. దానికి దగ్గు తగ్గడమేలేదు. అలాగే సుమీరన్‌తో నిమ్మకాయలు, అల్లం, పచ్చి మిరపకాయలు వగైరా తెప్పించు"

"అవన్నీ జరుగుతాయి గానీ, మీరు నాలుగయిదు రోజుల్లో కచ్చితంగా తిరిగొచ్చేస్తారుగా? "

"అరె.. ఇప్పుడు నువ్వు ఖాళీగా ఏమీ ఉండడం లేదుగా. చేతినిండా అల్లికల పని ఉండనే ఉంది. ఇంకా నా కోసం ఎదురు చూసే తీరిక ఎక్కడిది నీకు? " సత్యేన్ నవ్వుతూ అంటూ నన్ను దగ్గరకు లాక్కుని నుదుటిపై ముద్దుపెట్టారు. ఆయన ఆత్మీయ స్పర్శకి మనస్సు ఇంకా చిన్నబోయింది.

సత్యేన్ క్యాంపుకి వెళ్లిపోయారు. ఆయన వెళ్లిపోతూనే తరచు నేను నిరుత్సాహపడిపోతాను. ఏపని చేయాలన్నా ఆసక్తి ఉండదు. సుమీరన్ ఎలా వండినా, ఏం చేసినా పెద్దగా పట్టించుకోను. పిల్లలు స్కూళ్ళకి వెళ్తారు. డైనింగ్ టేబుల్‌పైన ఎన్ని వంటకాలు ఉన్నా ఒంటరిగా తినాలంటే మనస్కరించదు. అలాంటి స్థితిలో ఏదైనా పుస్తకం చదివి, మనస్సు కుదుట పరుచుకుంటాను. ఎంతో కొంత తినక తప్పదు. పగలు ఎలాగోలా గడిచిపోతుంది. కానీ చలిరాత్రులే భర్త వియోగంతో భారంగా గడుస్తాయి.

సుమీరన్ బజారునుండి అల్లం, నిమ్మకాయలు, పచ్చిమిరపకాయలు వగైరా తీసుకొచ్చింది. చలికాలంలో నిమ్మరసం పిండిన, అల్లం, మిరప పచ్చడి అంటే సత్యేన్‌కు చాలా ఇష్టం. క్యారెట్ హల్వా కూడా. నేను తిరిగొచ్చేసరికి పచ్చడి సిద్ధంగా ఉండాలని చెప్పివెళ్ళారు.

పిల్లలు భోంచేసి పడుకున్నారు. టేబుల్ మీద అన్నం, కూరలు సిద్ధంగా అమర్చి, సుమీరన్ పడుకోవడానికి వెళ్ళింది. ఎటూ ఉబుసుపోక, శాలువాని భుజాల చుట్టూరా నిండుగా కప్పుకొని వరండాలోకి వచ్చాను. బయటంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ బయటనుంచి కుక్క ఏడుపు ధ్వని వినిపిస్తోంది. వరుసగా ఇరువైపులా ఉన్న ఫ్లాట్ల తలుపులన్నీ మూసివున్నాయి. అయితే కొత్తగా అద్దెకు దిగిన, శామ్యూల్ ఫ్లాట్ కిటికీ అద్దంలోంచి లైటు వెలుగు కనిపిస్తోంది. బహుశా అతను ఇంకా మేల్కొనయినా ఉండాలి. లేదా లైటు వెలుగులో పడుకునే అలవాటైనా ఉండాలి. ఏదో సమ్మోహన శక్తి లాగుతున్నట్లుగా నేను అటుకేసి నడిచాను. ఒకరి కిటికీలోంచి వచ్చే వెలుగువైపుకి చూడ్డం తప్పని తెలిసికూడా మెల్లిమెల్లిగా అటువైపుకు అడుగులు వేశాను. ఒక కిటికీ తలుపు కొంత తెరిచేవుంది. కిటికీ తలుపు సందులోంచి లోపల వైపుకి చూశాను. అద్దం అవతలివైపు దృశ్యం కొంత స్పష్టంగానే కనిపిస్తుంది.

శామ్యూల్ మేల్కొనే ఉన్నాడు. గది మధ్యలో ఉన్న మంచంపై ప్రింటెడ్ సిల్క్ దుప్పటి కప్పుకుని దిండుకి ఆనుకుని కూర్చుని చదువుకుంటున్నాడు. మంచం

దగ్గర నిలబడ్డ నౌకరు నిదానంగా ఒరిగి అతని కాళ్లు పడుతున్నాడు. కుడిచేతి వేళ్లల్లో సిగరెట్ కాలుతోంది. పక్కనే ఉన్న టేబుల్ మీద నల్లగా మెరుస్తున్న అందమైన రాతి ఆష్ ట్రే ఉంది. ఎదురుగా గోడవారగా ఇనుప ర్యాకుల్లో బోలెడన్ని లావుపాటి పుస్తకాలు వరుసగా పేర్చబడి ఉన్నాయి. ఆష్ ట్రేలో సిగరెట్ బూడిదని దులుపుతూ అతను నౌకరును ప్రశ్నించాడు.

"సత్యేన్ సార్ ఎక్కడికైనా బయటికి వెళ్లారా? " మా వారి పేరు విని నేను ఉలిక్కిపడ్డాను. అతను మావారి పట్ల ఎందుకంతగా ఆసక్తి కనపరుస్తున్నాడని ఆశ్చర్యపడ్డాను. ఇంకేం అడుగుతాడో వినాలనిపించి చెవులు మరింత రిక్కించాను.

"అవును, ఆయన కోల్‌కతా వెళ్లారు. వాళ్ల పనిమనిషి సాయంత్రం మార్కెట్‌లో కలిసినప్పుడు చెప్పింది. నౌకరు చెప్పగానే నేను మరింత విస్తుపోయాను. ఇతను నా కుటుంబం గురించి ఆరా తీస్తున్నాడేమిటి? మా గురించి ఎందుకు ఇంతగా పట్టించుకుంటున్నాడు? సత్యేన్ గురించి ఎందుకు అడుగుతున్నాడు? ఏం తెలుసుకోవాలనుకుంటున్నాడు? వెంటనే నా మస్తిష్కంలో అతని మొదటి ఆగమనం మెదిలింది. ఇప్పుడు అర్థమైంది. ప్రత్యక్షంగా నాతో నా కుటుంబ వివరాలేమీ ఎందుకు అడగలేదో! మా గురించి అన్నీ తెలుసేమో?

"అవునా!" నౌకరుమాటకి నిట్టూర్చి మళ్లీ చదవడంలో లీనమయ్యాడు.

నేను కూడా వెనుదిరిగి నా ఇంట్లోకి వచ్చేశాను. అన్యమనస్కంగా అటుఇటు హాల్లోనే పచార్లు చేశాను. ఏం తోచక పిల్లల గదిలోకి వెళ్లాను. కప్పుకున్న దుప్పటి తన్నేసి మరీ గాఢనిద్రలో ఉన్నారు పిల్లలు. వారి దుప్పటి సరిచేసి చిన్నగా వాళ్ల నుదుళ్లను ముద్దాడి, తిరిగి నా గదిలోకి వచ్చి, మంచమ్మీద వాలిపోయాను. బలవంతంగా కనురెప్పలు మూసుకుని నిద్రకుపక్రమించాను.




కొద్దిరోజులుగా చీకటి పడుతూనే శామ్యూల్ మా డ్రాయింగ్ రూంలో వాలిపోతున్నాడు. మావారితో పరిచయం పెంచుకుంటూ గంటల తరబడి బాతాఖానీలో మునిగిపోతున్నాడు. మావారిని మచ్చిక చేసుకోవడంతో నాక్కూడా అతనికి అతిథి సత్కారాలు చేయక తప్పడం లేదు. ఒట్టి టీ కాకుండా అప్పుడప్పుడు పకోడి, చేగోడీలు, ఏదో ఒక పిండి వంటకం చేసి పెట్టాల్సివస్తుంది. మా వారికి ముచ్చట్లలో మునిగిపోవడం ముందునుంచే ఉన్న అలవాటు. ఏ స్నేహితులు వచ్చినా కబుర్లలో కాలం మరచిపోతారు. శామ్యూల్ మాత్రం టీవీలో వార్తలు ముగియగానే వెళ్లిపోతాడు. కానీ మావారు ఊళ్లో లేనప్పుడు కూడా క్రమం తప్పకుండా వస్తూండటంతో నాకు ఇబ్బందిగా అనిపించసాగింది. ఇంతకూ అతను ఇంతగా ఇక్కడికి ఎందుకు వస్తున్నట్లు? అతను ఉన్నంతసేపు ఇంట్లో నేను స్వేచ్ఛగా, హాయిగా ఉండలేకపోతున్నాను. అతని పద్ధతి నాకు నచ్చడం లేదు.

ఇవాళ పొద్దుట్నుంచే ఈ పద్ధతిని ఎలా

నివారించాలని ఆలోచిస్తున్నాను. అతను వస్తే తలుపే తెరవకూడదని, ఎంత తలుపు తట్టినా, కాలింగ్‌బెల్ నొక్కినా,ససేమిరా తలుపు తెరవవద్దని నిశ్చయించుకున్నాను. రోజూ ఇంట్లోకి రావడం, సోఫాలో కాలుమీద కాలేసుకుని దర్జాగా కూచోవడంతో నాకు ఇబ్బందిగా అనిపిస్తోంది. పరాయివ్యక్తి ఇంట్లో కూచొని ఉండగా టీవీ ఆన్‌లో ఉంచి, తలుపు తెరిచి పెట్టి, ఇంట్లో ఏ మూలనో ఉండి ఏ పనీ నిశ్చింతగా చేయలేకపోతున్నాను. ఇదంతా అతనికి ఎందుకు అర్థం కాదు? అంత మూర్ఖుడికి మల్లె కూడా లేడు. ఏమైనా సరే, తలుపు తెరిచేది లేదు. ఆతిథ్యం ఇచ్చేది లేదు. మనసు గట్టిచేసుకున్నాను.

అయితే రాత్రి గడిచినకొద్దీ నేను వద్దనుకున్న మనిషి నిజంగానే రాకపోయేసరికి మళ్లీ నాలోనే ఆందోళన మొదలైంది. ఎందుకు రాలేదు? ఏమైవుంటుంది? అతని రాకపోకలు నా మనసుకు అలవాటు అయిపోయినట్లు, నాకే ఏదో వెలితిగా అనిపించసాగింది. అనుమానాలు తలెత్తసాగాయి. అతనికి ఒంట్లో బాగోలేదా ఏమిటి? ఒంటరివాడు. జబ్బుపడితే అతని బాగోగులు ఎవరు చూస్తారు? ఎలా తెలుస్తుంది, అతని పరిస్థితి? ఒక విచిత్రమైన ఆందోళనతో అతని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి అంతరంగంలో మెదలసాగింది. తెల్లవారాక ఆరా తీస్తే, శామ్యూల్ తన సొంతింటికి వెళ్లాడని తెలిసింది.

తిరిగొచ్చాక, అతని స్వెట్టర్ పూర్తయిందని చెప్పి ఇచ్చాను. స్వెట్టర్‌ను చూసి సంతోషిస్తూ దాన్ని అటు ఇటూ తిప్పి చూసి అన్నాడు, "ఇంకా కొద్దిరోజుల తర్వాత మీరు స్వెట్టర్ ఇచ్చుంటే మళ్లీ చలికాలమే ఉపయోగపడేది"

"చేత్తో అల్లడంతో టైం పడుతుంది.. తొడుక్కుని చూడండి. సరిగ్గా సరిపోతుందో.. లేదో చూద్దాం.."

అతను స్వెట్టర్ తొడుక్కుంటుండగా నేను టీ తీసుకురావడానికి కిచెన్‌లోకి వెళ్లాను. పది రోజుల తర్వాత అతన్ని చూడ్డంతో ఏదో తెలియని ఆనందానుభూతి కలుగుతోంది నాకు. ఏదో పోగొట్టుకున్న వస్తువు తిరిగి దొరికినట్లుగా అనిపిస్తోంది. ఎందుకో? అసలు ఇంట్లోకే రానివ్వొద్దనుకున్న మనిషి పది రోజులు కనిపించకుండా పోయేసరికి, ఆ ఎడం అతని పట్ల ఏదో తెలియని ఆకర్షణని కలిగించింది. అతన్ని చూస్తుంటే నా మనస్సు ఉప్పొంగిపోతుంటే, ముఖంలో కన్పించే ఆ ఆనందాన్ని అతను చూడకుండా ఉండాలనే వంట గదిలోకి వచ్చేశాను. కొంత సమయం గడిస్తే నన్ను నేనే తమాయించుకోగలుగుతాను.

స్వెట్టర్‌లో అతను చాలా స్మార్ట్‌గా కనిపించాడు. ఆ డిజైన్ బాగా నచ్చింది అతనికి. ఉన్ని రంగు ఏదైనా గాఢమైంది అయ్యుంటే ఇంకా బాగా కొట్టొచ్చినట్టు కనబడేది.

"మీ చేతివేళ్ల స్పర్శ ఈ నిర్జీవ ఉన్నికి ప్రాణం పోసింది. నిజంగా మీలో చాలా నేర్పు, ఓర్పు ఉన్నాయి" టీ తాగుతూ అతను మెచ్చుకున్నాడు.

"ఇదేమంత గొప్ప డిజైన్ కాదులేండి!" అతని ప్రశంసకి అడ్డుకట్ట వేస్తూ వారించాను. ఎవరైనా అతిగా ప్రశంసించినా, సానుభూతి కురిపించినా నాకు భారంగా అనిపిస్తుంది. అయినా అతను ప్రశంసించడం ఆపలేదు.

"అయ్యో, ఇది గొప్ప డిజైన్ కాదంటారేమిటీ? మీ పనితనం మీకు గొప్పగా అనిపించకపోవచ్చు. గొంతు దగ్గర కూడా బాగా కుదిరింది, చక్కటి 'వి' షేప్‌లో భుజాలు కూడా ఫ్రీగా అమిరాయి" అతను

నిదానంగా స్వెట్టర్ మీద నిమరడం చూస్తే, అది స్వెట్టర్‌కాదు కుందేలు... సుతిమెత్తని కుందేలేమో అనిపించేలా నిమురుతున్నాడు.

"ఏ స్వెట్టరయినా ఇలాగే తయారవుతుంది"

"కాదు, ఇది చాలా బాగా తయారయింది" అతను ఏదో తెలియని తన్మయత్వానికి గురవుతున్నట్టు పొంగిపోతుంటే, అతని చంచలత్వానికి నేను విస్మయం చెందాను. అతను ఇలాగే మధురంగా మాట్లాడుతుంటాడు. మా వారితో సంభాషించేటప్పుడు కూడా అతను బాగా రాటుదేరిన వక్తలా మృదు మధురంగా మాట్లాడ్డం విన్నాను. సంభాషణ దేశ సమకాలీన పరిస్థితుల మీద, రాజకీయ ఎత్తుగడల మీద, పురాణేతిహాసాల వైవిధ్యాల మీద గంటల తరబడి కొనసాగిస్తూ ఉంటాడు. ఇవాళ కూడా అదే ధోరణిలో చెప్పుకు పోతున్నాడు. నేను మౌనంగా వింటున్నాను.

"మీరు ఒక పరిపూర్ణమైన స్త్రీ..." టీకప్పు టేబుల్‌పై పెడుతూ అనగానే, నేను ఉలిక్కిపడి అతనికేసి తీక్షణంగా చూసాను. ఈసారి అతను విప్ఫారిత నేత్రాలతో, కొంత మౌనంగా కనిపించాడు. నేను ఆశ్చర్యపోతూ అతని మాటల్లోని ఆంతర్యం పట్ల ఆలోచించసాగాను.. ఏమిటీ, ఇతను నన్ను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నాడా? లేక సాటి మనిషిగా ప్రశంసిస్తున్నాడా? ఏమైతేనేం, అతని ఆంతర్యాన్ని ఆరా తీయడానికి గానీ, అతన్ని వారించడానికి గానీ నేను ప్రయత్నించలేదు. అతని కంటిచూపు, నవ్వు ఆయుధంలా నా మనసులోకి దిగిపోయాయి.

కాలం ఇప్పుడు దొంగలా పరుగులు తీస్తూనే ఉంది. ఎప్పుడు పొద్దు వాలుతుందా అని నా మనస్సు ఉవ్విళ్లూరుతుంటుంది. ఎందుకంటే చీకటి పడుతూనే అతను నా ముందు వాలిపోతాడు. మేం కలిసి టీ, ఫలహారాలు తీసుకుంటాం. వాటితోపాటు పిచ్చాపాటి కబుర్లు, వాదోపవాదాలు, తియ్యటి మాటలు కొనసాగుతాయి. నిన్ననే పొరుగింటి సుమీతా హెచ్చరించింది. "ఏమిటీ రాను రాను పూర్తిగా శామ్యూల్ హిప్నొటిజంలో పడ్డట్లున్నావు? కబుర్లు ఎక్కువైపోయాయి? "

"పిచ్చిదానా, అతను కేవలం వార్తలు వినడానికే వస్తుంటాడు. అంతమాత్రానికే అనుమానిస్తే ఎలా? " అన్నాను. అయితే అది అబద్ధమనే అనిపిస్తోంది ఇప్పుడు. నిజంగానే ఏదో హిప్నొటిజం ప్రభావం పడుతోంది నా మీద. నా వయస్సు కొన్నేళ్లు వెనక్కి పరుగెడుతున్నట్లు అనిపిస్తుంది. అదే యవ్వనపు అలజడి, అదే ఉత్సాహం తిరిగి ఉప్పొంగుతున్నట్లు, రంగు రంగు కలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నట్లు అనిపిస్తుంది. ఆ ఊహాతరంగాలలో సుమీతా హెచ్చరికలు మబ్బు తెరల్లా తొలగిపోతున్నాయి. ఇదంతా అతని సాన్నిధ్య ప్రభావమా?

ఇవాళ కూడా అతను ఇక్కడ సాయంత్రం నుంచే వాలిపోయి ఉన్నాడు. వార్తా ప్రసారం ముగిసింది. అతని కబుర్లు వినడంలో పూర్తిగా నిమగ్నమైపోయాను.

అసలు సమయం గుర్తుకు రావడం లేదు. మావారి ఆగమనం కూడా గమనించలేదు.

"సుమీరన్... ఎక్కడ చచ్చావ్? " మా వారి బిగ్గరి గొంతు చెవిలో పడుతూనే, నేను ఉలిక్కిపడి తేరుకున్నాను. గభాల్న లేచివెళ్లి ఆయన చేతిలోని బ్రీఫ్‌కేసు అందుకున్నాను. ఆనక ఆయన మొహంకేసి చూసాను. అక్కడేదో అనామక రూపం ప్రతిబింబించింది కఠినంగా, క్రోధంగా.. ఇంతకు ముందెప్పుడూ గుమ్మంలో అడుగు పెట్టగానే ఆయన పెదవులపై చిరునవ్వు, ముఖంలో దరహాసం వ్యాపించి ఉండేది. ఇవాళ ఆ ముఖంలో మరో ఉగ్రరూపం తాండవిస్తోంది. సత్యేన్ తీక్షణ ధ్వనికి అతను కూడా భయపడి, మెల్లిగా పక్క నుండి జారుకున్నాడు. ఆ క్షణంలో మా ఇంట వింతయిన తేలికపాటి మబ్బుతెర వ్యాపించింది.

సత్యేన్ కోసం అన్నం వండుతున్నాను. మా వారు క్యాంపునుండి ఇంటికి వచ్చినప్పుడల్లా నేను ఆయనకి ఇష్టమైన వంటకాలు చేస్తుంటాను. సుమీరన్ అప్పుడు మిగతా పనులు చేస్తుంటుంది. ఇప్పుడు చాలా రాత్రయి పోవడంతో, గుత్తి వంకాయ కూర ముందుగానే వండి ఉండడంతో, జొన్న రొట్టెలు చేయసాగాను. సుమీరన్ పడుకోవడానికి పిల్లల బెడ్ రూంకి వెళ్లిపోయింది. ఆమె నిష్క్రమించగానే, కిచెన్ డోర్‌కి రెండు చేతులు ఆనించి, గడప బయటే నిలబడి మావారు తీక్షణ స్వరంతో అడిగారు- "ఈ మనిషి రోజూ వస్తాడా ఇక్కడికి? " అగ్నికణంలా ఆయన ధ్వని దూసుకొచ్చి నా కర్ణపుటలోకి చొచ్చుకుపోగానే, నేను నిలువెల్ల వణికిపోయాను. మొట్టమొదటిసారిగా ఆయన ఉగ్రరూపం చూసి నేను బిత్తరపోయాను.

"దాదాపు వస్తూనే ఉంటాడు" అయిష్టంగానే అయినా నిజం నానోటి వెంట జారింది.

"ఎందుకు వస్తాడు, అతనిక్కడికి? "

"వార్తలు వినడానికి"

"మరి ఇప్పటిదాకా ఎందుకు కూచున్నాడు? "

"ఏవో కబుర్లు చెబుతూ, అలాగే ఉండిపోయాడు"


"ఇదేమైనా ధర్మసత్రమా, కబుర్లకి? "

సత్యేన్ గద్దించి అడిగినా, నేను మిన్నకుండిపోయాను. ఏడుపు తన్నుకొస్తోంది. కళ్లు నీళ్లతో నిండాయి. ఆయన గద్దింపుకో, నా మూర్ఖత్వానికో.. కట్టలు తెంచుకువస్తున్న దుఃఖాన్ని ఎంత అదిమిపట్టినా, వెక్కిళ్లరూపంలో కన్నీళ్లు తన్నుకొచ్చేశాయి.

"చూడు ముక్తా! ఇక ముందెప్పుడు నేను ఇంటిపట్టున లేనప్పుడు, అతను ఇక్కడికి రావడానికి వీల్లేదు. ఇది నా ఇల్లు. ఏదో ధర్మసత్రం కాదు. అర్థమైందా? " సత్యేన్ గద్దిస్తూ హెచ్చరించారు. నా పెదవులు బిగుసుకుపోయాయి. హఠాత్తుగా మా వారు ఇంతగా మండిపడ్డారేమిటీ? నేను ఇంతకుముందెప్పుడు ఆయనలో ఇంత కోపం చూడలేదు. ఆయన మండిపాటుకు నేను బెంబేలుపడిపోయాను. ఎదురు మాట్లాడలేదు.

సత్యేన్ ఇంటిపట్టున ఉన్నన్ని రోజులు, అతను టీవీ చూడ్డానికి రాలేదు. నేను కూడా పనిలోపడి అన్నీ మరిచిపోయాను. రాత్రింబవళ్లు మావారి సాన్నిధ్యంలో ప్రశాంతంగా గడిచిపోతున్నాయి. అప్పుడప్పుడు అనిపిస్తోంది- మనిషి సాధారణంగా ఎంతో శాంతియుతంగానే ఉంటాడు. అనాలోచిత ఆకర్షణకు లోనయినప్పుడే అనవసరమైన ఆందోళనకు గురై అయోమయం పాలవుతాం. సంస్కార పరిధిలో చిక్కుకొని ఉన్నా మనస్సు, మస్తిష్కం విరోధిగా మారుతాయి.

ఇవాళ సత్యేన్ క్యాంపుకు వెళ్లారు.



ఆయన ప్రశాంత సాన్నిధ్యపు రోజులు కనుమరుగయ్యాయి. ఆయన వెళ్లగానే ఒంటరితనంతో ఇల్లు, వరండా, తలుపులు, గోడలంతా నిశ్శబ్దంగా మారాయి. ఉదాసీనత నన్ను కబళించసాగింది. నిర్మానుష్యత ఎగతాళి చేస్తోంది. వీటన్నిటికి దడుసుకుని నేను తరచు సుమీత దగ్గరకు పరుగుతీయసాగాను. ముఖ్యంగా వార్తల సమయంలో. లోగడ సుమీత చాలాసార్లు దెప్పిపొడిచేది.. 'నువ్వు అస్సలు మా

ఇంట్లోకి రావేమిటి?' అంటుండేది. ఇప్పుడు ఆ ఫిర్యాదు రూపుమాపినట్ట యింది.

సుమీత ఇంట్లో కూర్చున్నప్పుడు, అతను మా ఫ్లాట్ ముందుకొచ్చి నిరాశగా తిరిగి వెళ్తుంటే నేను గమనిస్తూనే ఉన్నాను. ఇలా అతన్ని తప్పించుకునే ప్రయత్నంలో సఫలీకృతమవసాగాను. అలా దాగుడు మూతలతో మరో ఇరవైరోజులు గడి చాయి. ఈమధ్యలో మావారు ఒకసారి ఇంటికి వచ్చి వెళ్లారు. ఆయన సంతృప్తిగా ఉన్నట్టు అనిపించింది. దాంతో మా ప్రశాంత సంసారంలో పరాయి ఛాయ పడకుండా జాగ్రత్త పడుతున్నట్టు అనిపిం చింది.

చాలారకాల ఇంటిపనులు పేరుకుపో యాయి. సత్యేన్ ఇంటిపట్టున ఉన్నప్పుడు ఏ పని ఓ పట్టాన తెమలదు. ఎప్పుడు ఆయన పనులతోనే సరిపోతుంది. ఆయన క్యాంపునకు వెళ్తూనే ఒక్కోపని తిన్నగా చేసుకుపోతాను. పక్కబట్టలు మురికి వా సన వస్తుండటంతో వాటిని ఉతికి డాబా పైన ఎండకు ఆరేయాలని బయల్దేరాను. ఉతికిన దుప్పట్లను ఒక బాల్చీలో వేసు కుని, మెల్లమెల్లగా మేడమెట్లు ఎక్కసా గాను. హఠాత్తుగా వెనకనుంచి మరో పాదాల సవ్వడి వినిపించింది. అడుగుల చప్పుడు కాకుండా వెనకాల ఎవరో మెట్లు ఎక్కుతున్నారు. మెట్లమలుపులో బాల్చీ కిందపెట్టి వెనుదిరిగి చూడాలనుకున్నం తలో, నా దేహం ఎవరి బాహుబం ధంలోనో బిగుసుకుపోయింది. చెవి దగ్గర సన్నటి మూల్గు వినబడింది. 'ఐ లవ్ యూ!' వెనువెంటనే అదేవైపు చెంపమీద వేడి పెదవుల ముద్దు పడింది. క్షణం పాటు నేను బిగుసుకుపోయాను. వెంటనే ఆ కౌగిలి పట్టుని ఒక్కసారిగా విదిలిం చాను. నా దేహం బంధవిముక్తి చెందగానే మళ్లీ బాల్చీ అందుకుని, గబగబా మెట్లెక్కి డాబాపైకి చేరుకున్నాను. ఆ పరుగుతో వచ్చిన ఆయాసాన్ని తమాయించుకుంటూ, కోపంతో చిందులు తొక్కాను- 'ఏం సిగ్గు మాలిన మనిషి ఇతను! ఏ ధైర్యంతో నా శరీరాన్ని తాకాడు.. ఏమిటీ అనుచితం? ఇంత సాహసం?'

ఇంత నిర్భయంగా, ఇంత విచ్చలవిడిగా ప్రవర్తిస్తే, అక్కడే నేనెందుకు తిరగబడ లేదు. ఈడ్చి చెంప వాయగొట్టలేదెం దుకు? తిట్టలేదెందుకు? ఎందుకంతగా నేనే అధైర్యపడ్డాను?

పొద్దువాలింది. చీకటి పడింది. రాత్రి గడుస్తోంది. నిద్ర మాత్రం పట్టడం లేదు. అతని తెగింపు కళ్లల్లో మెదులుతోంది. శరీరం వణుకుతోంది. అతని ఆలింగనం, వేడి పెదవుల స్పర్శ.. పదేపదే గుర్తుకొ స్తుంది. చల్లటి గదిలో వెచ్చదనం సోకి నట్టు, నా పెదవులపై వింత నవ్వు విరి సింది. కనురెప్పలు మత్తుగా, భారంగా మూసుకుపోయాయి. అన్ని కలల్ని, అన్ని వాదనల్ని పక్కకి నెట్టుతూ..




**ఇ**దే అంతర్మథనం, ఒకే సమయంలో రెండు విభిన్న ఆలోచనలు తలెత్తుతు న్నాయి. రెండేసి అనుభూతుల మధ్య ఈ స్పర్శ పట్ల కలుగుతున్న మధురానుభూతి పైచెయ్యిగా తోస్తుంది. ఒకవైపు ఆత్మసమ

ర్షణకు మొగ్గుతుంటే, మరోవైపు అపరాధ భావం వెనక్కి లాగుతోంది.

అప్పుడప్పుడు నా అంతరంగంలో ఎక్కడో ఓ మూల అతనిపట్ల ఆదరణ చోటు చేసుకుని ఉన్నట్టు అనిపిస్తోంది. అతన్ని సదా సమీపంగా చూడాలన్న కుతూహలం, గంటలతరబడి బాతాఖానీ పెట్టాలన్న ఆకాంక్ష కలుగుతూ ఉన్నా, మరోవైపు అదే అనుబంధమని కూడా ఒప్పుకోలేకపోతున్నాను. ఇది సంభవమా? ఎటూ పాలుపోని స్థితిలో ఉండగా అతని మాటలు మరింత తికమకపెట్టాయి. నిన్ననే ఏదో సందర్భంలో అతను నవ్వుతూ అడిగాడు-

"మై డియర్, ఏదైనా ఆధ్యాత్మిక ప్రేమ ఉండదా? "

"ఎందుకుండదు, ఉంటుంది" నేను కాస్త బిగ్గరగానే అన్నాను. నా మాటలు విని అతను ఉల్లాసంగానే నవ్వి అడిగాడు.

"ఏదైనా ఉదాహరణ ఇవ్వగలవా? "

"ఒకటేమిటి? ఎన్నో ఉదాహరణలున్నాయి"

"ఎలాంటివి? "

"అదే కృష్ణుడిపట్ల మీరాకి ఉన్న ప్రేమ. రాధకి కృష్ణుడిపై, ద్రౌపదికి కృష్ణుడితో.."

"ద్రౌపదికి కృష్ణుడితో ప్రేమనా? ఇదెక్కడ విన్నావు నువ్వు? "

"ద్రౌపదిది ప్రేమ కాకపోతే మరేమిటీ? ఐదుగురు భర్తలు ఉండగా, ఆమె కృష్ణుడ్ని నమ్ముకుంది. తనను ఆపద సమయంలో ఆయనే ఆదుకోగలడని విశ్వసించింది. ఆ విశ్వాసమే ప్రేమ.."

"చాలు, చాలు, ఆ యుగపు ఉపమానాలు" అతను మధ్యలోనే అడ్డుకున్నాడు. బహుశా నా మాటలు అతనికి తమాషాగా తోచుంటాయి. అప్పుడు నాకు ఆడదాని భావాలు, మగవాడి భావాలు వేర్వేరుగా ఉంటాయి గాబోలు అనిపించింది. నాకు దుఃఖం వచ్చింది.

"ఎందుకు విచారంగా ఉన్నావు? " ఆశ్చర్యపోతూ అడిగాడు. అతని ఆశ్చర్యం నా ఆలోచనకి ఊతమిచ్చింది. నిజంగానే అతను నా ఉద్దేశాన్ని, మర్మాన్ని గ్రహించలేకపోయాడు. ఒకవేళ గ్రహించగలిగితే ఆడదాని మౌనం వెనక దాగిన ఆత్మసమర్పణలోని నిస్సహాయతని గుర్తించేవాడే.

"మనం కేవలం స్నేహితులం కాలేమా? " నేను నా అభీష్టాన్ని వ్యక్తం చేసాను.

"ఎందుకు కాలేం!" అతను వెంటనే ఒప్పుకున్నాడు. ఆజ్ఞ శిరసావహించే పిల్లాడిలా అతని పెదవులపై అమాయకపు నవ్వు విప్పారింది. అతని ఆ అమాయకపు నవ్వు నా కళ్లల్లో ఇమిడిపోయింది. మరింత వేగంగా అతని పట్ల నా మనసులో మరేదో ఆసక్తి చిగురిస్తున్న అనుభూతి కలిగింది.. అయితే ఈ అనుకోని ఆకర్షణ పట్ల నాకు నేనే ఆందోళనకి గురయ్యాను.

ఇప్పుడతను నాకు అనామకుడిలా కాదు, పూర్తిగా ఆత్మీయుడిలా అనిపిస్తున్నాడు. అతని సాన్నిధ్యంలో ఎలాంటి భయం కలగడంలేదు. విశ్వాసపు రెక్కలపై ఇప్పుడు నేనతని ఫ్లాట్‌లోకి కూడా వెళ్లసాగాను. గంటలతరబడి అక్కడే కూచుని బాతాఖానీ పెట్టసాగాను. అదీనూ, అతని నౌకరు ఇంట్లో లేని సమయాల్లో సైతం నిర్భయంగా అక్కడే గడుపుతున్నాను. అది ఎక్కువ రోజులు దాగలేదు. నేను అక్కడ్నుంచి బయటపడుతుండగా సుమీతా చూసేసింది. తన ఇంట్లోకి పిలిచి ఉపోద్ఘాతమంటూ ఏమీ లేకుండా ఏకంగా హెచ్చరించేసింది.

"ఇప్పుడు అతని ఇంట్లోకే వెళ్లడం మొదలుపెట్టావా, అదీనూ ఒంటరిగా? " ఆమె గుస్సురుముతూ అడిగేసరికి నేను తటప

టాయించాను. అయినా వెంటనే నన్ను నేను సంబాళించుకుని చెప్పాను.

"ఇవాళే వెళ్లాను. ఒక పుస్తకం తీసుకోవాల్సి ఉంది, అందుకు వెళ్లాను" ఏదో వంక తడబడకుండా చెప్పేశాను.

"ఒంటరిగా పరాయి పురుషుడి దగ్గరకి వెళ్లడం మంచిది కాదు. ఒంటరితనంలో తండ్రి, సోదరుల చెంత ఉండడం కూడా సబబుకాదని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. నీకు తెలీదా? "

"నా మీద నాకు నమ్మకం ఉంది. నా ఇష్టానికి విరుద్ధంగా నా వేలుని కూడా ఎవరూ పట్టుకోలేరు" కటువుగా అన్నాను.

"ఇంత గర్వం పనికిరాదు ముక్తా. మితిమీరిన నమ్మకం ఒక్కోసారి పతనానికి కూడా కారణం కావచ్చు" ఆమె మండిపడుతూ అంది.

"హూ..." అంటూ హూంకరిస్తూ ఆమె మాటల్ని కొట్టిపారేశాను. ఆమె అలా ఉపదేశం ఇవ్వడం నాకు నచ్చలేదు. ఆమెకు అనుమానం ఎక్కువ. ఎందుకో మరి తెలీదు. ఒకరోజు ఇలాగే మాటల్లో నా నోట వచ్చేసింది.

"ఇప్పుడు ఎందుకో ప్రతిదీ చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తోంది" నా మాటలకి ఉలిక్కిపడి ఆమె నా వంక చూసింది. ఆమె కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. ఎక్స్‌రే యంత్రంలా ఆమె చూపులు మొదట నా పాదాల చెంత నిలిచాయి. మళ్లీ పైకెత్తుతూ మెల్లిమెల్లిగా నఖశిఖపర్యంతం పరిశీలిస్తూ తల దగ్గర నిలిచాయి.

"ఏం, నీకేమయినా పిచ్చిపట్టిందా.. ఈ బిగుసుకుపోయే చలి, తుపాను వాతావరణం నీకు ఆహ్లాదభరితంగా ఉందా? ఏదైనా మైకంలో పడ్డావా ఏమిటీ? " సుమీతా అడిగింది అనుమానంగా.

"అలాంటిదేమిలేదు, నువ్వు ఊహిస్తున్నట్టుగా. నా తల, కాళ్లూచేతులు.. అన్నీ బేషుగ్గా ఉన్నాయి. కేవలం ఈ వాతావరణంలోనే ఏదో మార్పు అనిపిస్తుంది" నవ్వుతూ అన్నాను.

"ఈ మార్పుల మలుపులు చాలా ప్రమాకరమైనవి. సమయం మించిపోకముందే జాగ్రత్తపడు ముక్తా. లేకుంటే చాలా నష్టపోతావు. ఏ వయస్సు మలుపులో నువ్విప్పుడున్నావో, అక్కడే మనిషి ఒకదారి ఎంచుకుంటాడు. పదేపదే దారిమళ్లడం జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. ఒక్కసారి సుడిగుండంలో చిక్కుకున్నాక స్వచ్ఛమైన ప్రశాంత జీవితం తిరిగి దొరకదు..." ఆమె గంభీరంగా హెచ్చరించడంతో, ఒక నిమిషంపాటు ఆమె మాటలు నన్ను కలవరపెట్టాయి. ఆమె నా ఉద్దేశాన్ని గ్రహించినట్టుగా అనిపించింది. అయినా మరుక్షణమే నన్ను నేను సంబాళించుకుని, నవ్వేస్తూ ఆమెను మరింత ఉడికించడానికి అన్నాను.

"మనిషి ఒక్కోసారి నియమాన్ని ఉల్లంఘించి, ఇతరత్రా అనుభూతుల్ని కూడా చవిచూడాలేమో? "

"నువ్వు అంతక్కూడా తెగించగలవా? " అడిగిందామె. ఆమె గొంతులో ఆశ్చర్యం, గద్గద భావం స్ఫురించింది.

"అయ్యో, నువ్వు నిజంగానే అపార్థం చేసుకున్నట్టున్నావు. నేను వేళాకోళం చేసాను. అలాంటి వెరైటీ మనుషులు ఉండకపోతారా అని.." అంటూ వెంటనే అక్కడ్నుంచి లేచి వచ్చేశాను, ఆమెను మరింత అయోమయానికి గురిచేసి.

★ ★ ★

ఆ సాయంత్రంవేళ ఆహ్లాదకరంగా, ఉత్సాహంగా ఉంది. చల్లగాలికి బాల్కనీలో పచార్లు కొడుతూ గడిచిన వారం రోజుల ఘట్టాలని గుర్తుకు తెచ్చుకోసాగాను. ఆ రోజులు ఎలా వైవిధ్యంగా, విచారంగా గడిచాయో, నా అంతరాత్మకే తెలుసు. హోలీ

సెలవులకి అతను ఇంటికి వెళ్లాడు. హోళీ పండుగ మావారి సానిధ్యంలో ఎప్పటిలా ఉల్లాసంగానే గడిచింది. అయినా అంత రంగంలో దాగిన ఆరాటం ప్రతీ క్షణం మనస్సును తొలిచేస్తూనే ఉంది. ఒకవేళ అతను కూడా ఈ పర్వదినాన నా సమక్షంలో ఉండివుంటే, ఆ హోళీ ఇంకా ఉత్సాహంగా గడిచేది అనిపించింది.

వారం క్రితం అతను ఇంటికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా, అతను అర్థం చేసుకుని ఆగిపోతాడేమోనని ఓ అభిప్రాయం కూడా వ్యక్తం చేసాను.

"ఒకవిధంగా మనం సంతోషించాలి. మనం ఒకరి పండుగలకు ఒకరం కలిసే ఉండగలుగుతాం"

"అదెలా? " ఆశ్చర్యంగా అడిగాడతను.

"మా పండుగ ఉన్న రోజున మీ పండుగ ఉండదు. మరి మీ పండుగ జరిగే రోజున మా పండుగ ఉండదు. ఇలా మా పండుగలన్నిటికి నువ్వు మా సమక్షంలోనే ఉండగలుగుతావు? " అని నేను అనగానే అతను నవ్వాడు.

అతను క్రైస్తవుడు. నా తపన గ్రహించి ఈ పండగ సెలవుకి ఇంటికి వెళ్లడనుకున్నాను. అందరం కలిసే హోళీ పర్వం జరుపుకుంటామనుకున్నాను. కానీ అతను వూరెళ్లిపోయాడు. నేను ఆపలేదు కూడా అతన్ని. ఒకవేళ నేను ఆపితే, బహుశా ఆగిపోయేవాడేమో. తనే స్వయంగా ఉండిపోతాడనుకున్నాను.

మనస్సు ఆ అధికారాన్ని వదులుకోదలచడంలేదు. నోరుని విప్పనివ్వనూ లేదు.

"ముక్తా ఎక్కడున్నావు? " మావారి పిలుపు విని, దిగ్గున తేరుకుని, ఇంట్లోకి వచ్చేశాను.

"ఏమిటండీ? "

"నా సామాను సర్దేసెయ్. రేపు పొద్దున్నే ఊరెళ్ళాలి"

"రేపేనా? " విస్తుపోతూ అడిగాను.

"అవునూ"

"మరో రెండు రోజులు ఆగొచ్చుగా? "

"ఎవరికి ఉండదు నిశ్చింతగా ఇంటిపట్టున ఉండాలని. కానీ ఏం చేస్తాం, ఉద్యోగమే అలాంటిది" అంటూ ఆయన బయటికి వెళ్లారు. ఇక నేను ఆయన సామాను సర్దడం మొదలుపెట్టాను. రేపట్నుంచి పిల్లల స్కూళ్ళు కూడా తెరుస్తారు. వాళ్ల యూనిఫాంలు వగైరా కూడా సిద్ధం చేయాలి. సత్యేన్ క్యాంపుకు వెళ్లిపోతారు. పిల్లలు స్కూలుకి వెళ్తారు. అతను ఇక్కడికి వచ్చేస్తాడు. ఇంట్లో చాలా పనులు పేరుకుపోయాయి. అన్నీ గబగబా పూర్తిచేయాలి. అతను వచ్చాక నిశ్చింతగా కాసేపయినా గడపొచ్చు. మా

సుమీరన్ కూడా నాలుగు రోజుల్లో తిరిగొస్తానని చెప్పి ఆరురోజులయినా రాలేదు. రంగుల్తో తడిసిన బట్టలన్నీ అలాగే అట్టిపెట్టాను. ఆమె వచ్చాకే ఇద్దరం కలిసి ఉతుక్కోవాలి.

అప్పుడే మోనూ దగ్గరకు వచ్చి అడిగింది, "మమ్మీ, నాకు ఇంకో పెరుగువడ ఇవ్వవా? "

"పెరుగు వడా.. ఈ సమయంలోనా? జలుబు చేస్తుంది తల్లీ!" అమ్మాయిని సముదాయించాను. పొద్దున్నే సత్యేన్ చెబితే పెరుగువడలు చేశాను. అయితే రాత్రిపూట పెరుగువడలు తింటే దగ్గు, జలుబు చేస్తుందని భయం.

"ఒక్కటి ఇవ్వు మమ్మీ, జలుబు చేసింది వడ తిన్నానని డాడీకి చెప్పను" మోనూ అమాయకంగా అడిగేసరికి కాదనలేకపోయాను.

"సరే, రితుని కూడా పిలువు. దానిక్కూడా తీసి ఉంచుతాను" ఫ్రిజ్ తెరుస్తూ మోనూకి చెప్పాను.

"రితుకి వడ ఇవ్వద్దు మమ్మీ. అది ఇప్పటికే బాగా దగ్గుతోంది. డాడీ దానికి అసలు పెరుగువడ తినొద్దని చెప్పారు" మోనూ అలా అనగానే దాని చతురతకి నవ్వు వచ్చింది. ఈ కాలం పిల్లలకి వయస్సుకి మించిన తెలివితేటలు వస్తున్నాయి.

సత్యేన్ అప్పుడే బజారు నుంచి తిరిగొచ్చారు. పిల్లలతో ఆడుతూ, వాళ్లు గంతులేస్తూ నవ్వుతోంటే, ఆయన కూడా నవ్వుతున్నారు. ఆయనకు పిల్లలంటే ఎంతో ప్రేమ. ఆయన ఇంటిపట్టున లేనన్ని రోజులూ ఆ ప్రేమనంతా రాగానే వాళ్ల మీద కుమ్మరించేస్తారు. ఆయన ఇంట్లో ఉన్నన్ని రోజులు పిల్లల విషయంలో నేను నిశ్చింతంగా ఉంటాను. తండ్రి ఇంట్లో ఉన్నన్ని రోజులు వాళ్లు భోజనాలప్పుడే నన్ను వెతుకుతారు. మిగతా సమయమంతా తండ్రి చుట్టూనే పరిభ్రమిస్తారు. రకరకాల కథలు, తన ప్రయాణంలో ఎదురయిన వింత సంఘటనలు, విడ్డూరాలు చెప్పి వాళ్లని నవ్విస్తారు.

సత్యేన్ పొద్దున్నే వెళ్లిపోయారు. ఆ తర్వాత పిల్లలు బడికి వెళ్లారు. అందరూ వెళ్లగానే మళ్లీ ఇల్లంతా ఉదాసీనంగా మారిపోయింది. పగలు భయంకర భూతంలా జడలు విప్పుకుని భయపెడుతోంది. సాయంత్రం వచ్చే రైలు సమయం కూడా దాటింది. శామ్యూల్ ఇవ్వాళ రావల్సి ఉండింది. ఇంకా రాలేదు. ఐదారుసార్లు వరండాలోకి వెళ్లి నిరాశతో తిరిగొచ్చాను. అతని తలుపుకి తాళం వేలాడుతూనే ఉంది. మనసు ఉదాసీనంగా, ఉద్విగ్నంగా మారింది. ఎందుకు రాలేదు అతను? కారణం ఏమైవుంటుంది రాకపోవడానికి? ఏదైనా జబ్బు చేసి ఉంటుందా? ఎదురు చూపుల ఘడియలు అతికష్టంగా దొర్లుతున్నాయి. రాత్రి పగటి కంటే ఎక్కువ భయంగా, ఉదాసీనంగా మారింది. ఎటూ ఉబుసుపోక పిల్లల పక్కనే పడుకుని అటూ ఇటూ దొర్లసాగాను. రెండు మూడు గంటలప్పుడు నిద్ర పట్టింది. పిల్లలతో మనిషి ఆడుకోవచ్చు, నవ్వుకోవచ్చు. కానీ వాళ్లతో తన ఆలోచనల్ని, ఆందోళ

నల్ని పంచుకోలేంగదా? అంతర్మథనం చెప్పుకోలేంగదా, ఎవరైనా?

తెల్లవారింది. పగలు గడిచింది. చీకటి పరుచుకోబోతుంది. హఠాత్తుగా కాలింగ్ బెల్ మోగింది. వెంటనే వెళ్లి తలుపు తెరిచాను. ఎదురుగా శామ్యూల్ నిలబడి ఉన్నాడు. అతన్ని చూడగానే నాకు ప్రాణం లేచొచ్చినట్టయింది. మనస్సు పురివిప్పింది. అయినా ముఖంమీద నవ్వును కనబడనివ్వలేదు. ఏం పలకరించకుండానే వెనుదిరిగాను. అతను కూడా వెనకాలే డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు. బిస్కెట్ రంగు సఫారీ సూట్‌లో అతను చాలా అందంగా కనిపిస్తున్నాడు. అతని చేతిలో స్వీట్‌బాక్స్ ఉంది. స్వీట్‌పాకెట్‌ను టీపాయ్‌మీద పెట్టి సోఫాలో కూచుండిపోయాడు. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. అతను ఏం చెబుతాడోనని ఎదురు చూస్తున్నాను. ఇన్నాళ్ల ఎడబాటుతో విరహవేదనతో నాలో నేను ఎంతగా నలిగిపోయాననేది ఎలా వ్యక్తం చేయాలని తడబడుతున్నాను. నాలాగా అతను కూడా మథనపడుతున్నాడేమోననుకున్నాను. ఒకవేళ మథనపడివుంటే అతని మాటల్లో ద్యోతకమవ్వకపోదు.

అదే మీమాంసతో సమయం గడిచిపోతుంది. గడియారం టిక్‌టిక్‌మంటుంటే నాలో ఉద్విగ్నత పెరుగుతోంది. అతనేం మాట్లాడడేమిటి? వచ్చినప్పట్నుంచి ముభావంగా గోడ గడియారంకేసి, మరోసారి నా మొహంకేసి చూస్తూ ఉండిపోతున్నాడు. అతని ముభావ ధోర

ణికి నాలో కలవరం మొదలయి, నేనే లేచి వంటగదిలోకి వెళ్లాను.

నీళ్ల గ్లాసులతోపాటు, టీకప్పుల ట్రే తీసుకొచ్చి టీపాయ్‌మీద పెట్టి, టీ తాగమని సైగ చేశాను. అతను టీ కప్పు అందుకుని గుటకలు వేయసాగాడు. అప్పటికీ ఏం మాట్లాడకపోయేసరికి నాకు ఒళ్లుమండి, ఉండబట్టలేక నేనే అడిగేశాను,

"ఏమిటీ ఇవాళ మౌనవ్రతమా లేక మాట్లాడకూడదని కంకణం కట్టుకున్నావా? "

"ఏం మౌనవ్రతం లేదు. ఎక్కడ్నుంచి మొదలుపెట్టాలని ఆలోచిస్తున్నాను" అని మళ్లీ ఆగిపోయాడు.

"ఎక్కడ్నుంచయినా మొదలుపెట్టు.. ఏదో ఒకటి చెప్పడం మొదలుపెడితే అన్నీ అవే గుర్తుకొస్తాయి" నేను విసుగ్గా అనేసరికి, అతని పెదవులపై చిరునవ్వు విరిసింది.

"ముందు నువ్వే చెప్పు. లేదంటే ఏదైనా అడుగు"

"సరే, నీ ఆదేశాన్ని పాటిస్తాను" అంటూ నవ్వాను. అతను మాత్రం నవ్వలేదు. పెదవులు బిగుసుకుని నావంక తీక్షణంగా చూశాడు.

"అంతా కుశలమేగా అక్కడ? " అనుమానంగా అడిగాను.

"ఆ!"

"మరి ఈ మౌనం దేనికి? "

"నేను ఆ గడియారం ముల్లు ఎందుకు పరుగెడుతుందాని చూస్తున్నాను" గోడ గడియారం కేసి సంజ్ఞ చేస్తూ గంభీరంగా చెప్పాడు.

"గడియారం ముల్లు ఎక్కడ పరుగెడుతుంది? దాని లెక్క ప్రకారమే తిరుగుతోంది" గడియారంకేసి ఆశ్చర్యంగా చూస్తూ అన్నాను నేను.

"నా ఉద్దేశం అదికాదు"

"మరేమిటీ ఉద్దేశం? "

"నీ దగ్గర సమయం ఇట్టే గడిచిపోతుంది. వేరేచోట ఓ పట్టాన పొద్దే పోదు. క్షణక్షణం లెక్కబెడుతూ గడపాల్సి వస్తుంది. అలా ఎందుకవుతుందో నీకు తెలుసా? "

"నాకేం తెలుసు? "

"నీకు మన గురించి ఏమీ తెలియదు. మరి నిజంగా నువ్వు అమాయకురాలివో, నిర్లక్ష్యపరురాలివో లేక.."

"లేక నిర్లక్ష్యపరురాలిగా కనబడుతావో.. అదేగా నువ్వు అనదలుచుకున్నావు? " కోపంగా అడిగాను.

"నువ్వు అపార్థం చేసుకున్నట్టున్నావు"

"నా ఉద్దేశం అదికాదు. నేను ఇన్నాళ్లుగా ఇక్కడికి వస్తున్నాను. నీ దగ్గర సమయం ఎలా గడిచిపోతుందో అంతే పట్టదు" అతను నిదానంగా చెప్పుకుపోయాడు.

"ఎందుకు అంతు పట్టదు? " నేను వెంటనే అందుకుని, "నువ్వు ఇక్కడికి ఆరుగంటలకు వచ్చావు. ఇప్పుడు తొమ్మిది అవుతోంది. గడియారం సమయం సరిగ్గానే చూపుతోంది"

నా వివరణ విని అతను చిన్నగా నవ్వాడు.

"నీకు తెలుసా ముక్తా.. వృత్తిరీత్యా ఎందరో స్త్రీలతో చేరువగా మాట్లాడే అవకాశం లభించింది నాకు. కానీ ఏ విశేషం నీలో చూసానో, అది ఇంకెవరిలోనూ కనిపించలేదు నాకు" నన్ను పొగడడం చూసి సంకోచానికి గురయ్యాను. ఏమీ మాట్లాడకుండా, కేవలం చిన్నగా నవ్వి ఊరుకున్నాను. అడగాలన్న జిజ్ఞాసయితే కలిగింది, ఎలాంటి విశేషమని? కానీ అడగలేకపోయాను. అతనే చెబుతాడు. తనకు కనిపించిన ప్రత్యేకత ఏమిటో?

"తెలుసుకోవాలని లేదా నీ ప్రత్యేకత? " అడిగాడతను.

"చెప్పాలనుంటే చెప్పు? "

"గంటల తరబడి ఇక్కడే కూచుని, ఎంతసేపు మాట్లాడినా నీనోట నేనెప్పుడూ ఎవరిమీద చాడీలుగానీ, ఫిర్యాదుగానీ వినలేదు. ఇంటి పనులపట్ల విసుగుగానీ, ఒకరిని దెప్పిపొడవడంగానీ వినలేదు. నీకు ఎప్పుడు ఎవరిమీదా ఎలాంటి కోపంగానీ, ఫిర్యాదుగానీ ఉండదా? ఇదెలా సాధ్యం? " అతను అడుగుతుంటే నాక్కూడా ఆశ్చర్యం వేసింది. ఈ తరహాలో ఆలోచించే అవకాశం ఎప్పుడూ రాలేదు. అతను వ్యక్తం చేసిన అభిప్రాయం ఎంతవరకు కరెక్ట్ అని ఆలోచనలో పడ్డాను. ఒకవేళ నా వద్ద లభిస్తున్న సాన్నిహిత్యమే అతనికాభావన కలిగిస్తుండొచ్చు.

"తెలుసా నీకు, ఇలాంటి ప్రవర్తనే నన్ను అమితంగా నీ పట్ల ప్రభావితం చేస్తుంది. ఎప్పుడు ఏ విషయంలో మాట్లాడుతూ, ఉంటామో, అందులోనే లీనమయిపోతావు. నీ సాదాసీదా తత్వమే నన్ను తన్మయత్వానికి గురిచేస్తుంది" అంటూ దీర్ఘంగా ఊపిరి పీల్చుకున్నాడు.

నేను మౌనంగానే ఉండిపోయి ఆలోచించాను. నా సాదాసీదా స్వభావం, నిర్లక్ష్య వైఖరి కూడా ఎవరినైనా ఇంతగా ప్రభావితం చేయగలుగుతాయా?

అతను స్వీట్ బాక్సు విప్పాడు. ఒక ముక్క తీసి నాకు తినిపించాడు. నేను సగం కొరికి వదిలిన ముక్కను అతను తిన్నాడు. అతను నా ఎంగిలిని నిస్సంకోచంగా తన నోట్లో వేసుకునేసరికి అవాక్కయిపోయాను. కట్టుకున్న భర్త కూడా ఇంత నిస్సంకోచంగా ఎప్పుడూ నా ఎంగిలి నోట్లో వేసుకోలేదు. అతని చొరవకి నా మనస్సు పరవశించిపోయింది.

ఎవరంటారు జీవితపు ఘడియలు దుర్లభమయినవని? చాలా తేలికయినవి, ఇప్పటిలా పురివిప్పిన నెమలిలా వసంతపు రుతువులా పరిమళ భరితమైనవి. అతని చనువుకి నా అంతరాత్మ పులకించింది.




సముద్రం ఒకవేళ ప్రశాంతంగా ఉంటే, ప్రతివైపూ కనిపించే దృశ్యాలని ఆహ్లాదభరితంగా తిలకించవచ్చు. సముద్రపులోతు కొలిచే ప్రయత్నం చేయొచ్చు. కానీ సముద్రంలో ఒకవేళ తుపాను చెలరేగితే, అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుంటే ఏదీ సరిగ్గా కనిపించదు..

అతను చాలా సేపట్నుంచి నా వెనకాల నిల్చున్నాడు. పూర్తిగా మౌనం వహించాడు. అయినా అతని వేడి ఊపిరి సెగల్లా నన్ను తాకుతుంది. ఆ చేరువ పసిగట్టనిదానిలా మిన్నకుండిపోయి, అతని పలకరింపుకోసం నిరీక్షిస్తున్నాను. ఎప్పుడు అతనే పలకరించాలని ఉంటుంది నాకు. అడిగినదానికి జవాబు చెప్పడమే తేలిక. ఒకవేళ జవాబు చెప్పలేని ప్రశ్న ఎదురయినప్పుడు మౌనంగా ఉండిపోయి, ఏదో వంకతో దాటేయొచ్చు.

సమయం గడుస్తోంది. మౌనం కూడా విసుగు పుట్టిస్తోంది. అతను కూడా నన్ను పరీక్షిస్తున్నట్టుగా ఉంది. బాల్కనీ ప్రాంతమంతా చీకటిగా ఉంది. రాత్రి కూడా చిక్కబడుతోంది. చుట్టూర నిశ్శబ్దం ఆవరించుకుని ఉంది.

"తాకకుండా మనం పరస్పర సాన్నిధ్యం ఎలా అనుభూతి చెందగలం? " మౌనాన్ని ఛేదిస్తూ అతని కంఠధ్వని నా చెవులకి సోకింది. నేను ముందుకు మళ్లాను. అతని అభిప్రాయం పట్ల ఆశ్చర్యం కలి గింది. అతని ముఖకవళికల్లోని భావుకతని చూడాలనిపించింది. కానీ దట్టమైన చీక టిలో ఏమి కనిపించలేదు. నేను గుర్తు చేయాలనుకున్నాను.. 'నువ్వు మరిచిపోతు నట్టున్నావు, లోగడే మనం కేవలం స్నేహ పరిధిలోనే పరిమితమవ్వాలని అను కున్నాం. మరి హఠాత్తుగా ఈ ఆశేమిటీ? ' అని.

అయితే అది గుర్తు చేయకుండా మరోలా అన్నాను, "మనం తాకకుండానే గాలిస్పర్శ, పూల వాసనని అనుభవించడం లేదా? దాని సౌందర్యాన్ని పరికించటం లేదా? "

నా మాటల్ని అతను తోసిపుచ్చాడు.

"ప్రేమ ఏదో గాలి కాదు, కేవలం దాని స్పర్శతోనే ఆనందించడానికి. దేహరహితం అనేది అసంపూర్ణమే.." అతని అభి ప్రాయం నన్ను అబ్బురపరిచింది. అయితే ఆడదాని కోరికకు, మగవాడి కోరికకు వ్యత్యాసం ఉంటుందా? రకరకాల ఆలోచ నలు మెదడును తొలిచేస్తున్నాయి. మాన సిక సంఘర్షణతో కొట్టుమిట్టాడుతుండ గానే, హఠాత్తుగా అతను తన బాహువుల్లో నన్ను బంధించేశాడు. అతని మృదు, మధుర స్పర్శకి నా అణువణువు వణికింది, తొణికింది. ప్రతిఘటించాలనుకున్నాను. ప్రతిఘటించలేకపోయాను. కొద్దిక్షణాలు నిశ్చేష్టురాలినై ఉండిపోయాను. కింకర్తవ్య విమూఢురాలినయి, నాలో నేనే గాబరాప డిపోయాను. ఎప్పుడైనా జీవితంలో ఇలాంటి బలహీన క్షణాలు కూడా వస్తా యని ఊహించలేదు. ఉద్వేగాల హాహాకా రాలు, ఉవ్వెత్తున లేచిన సాగర కెరటాలు, విలువల్ని, గౌరవాల్ని నిలువునా ముంచే స్థాయని అనిపించలేదు ఆ క్షణాన. ఎంత సులువుగా చేరిపోయాడు నా దేహాన్ని. ఉక్కిరి బిక్కిరి అయ్యాను. ఊగిసలాడాను. అతని కౌగిలి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసాను. అతని బాహుబంధం మరింతగా బిగుసుకుపోయింది. నేను పెనుగులాడుతుండగా నా దేహాన్ని వది లాడు. వెంటనే తన మోచేతుల్లోకి నన్ను పువ్వులా ఎత్తుకున్నాడు. అవలీలగా బెడ్ రూంలోకి ఎత్తుకొచ్చాడు. మెత్తటి డబుల్ కాట్ బెడ్‌మీద మెల్లిగా నన్ను పడేసాడు. అతని చర్యలకి దట్టమైన చీకటి, ఏకాంతం, నా మౌనం అన్నీ తోడయ్యాయి.

అతని చేతివేళ్లు బాగా రాటుదేలిన శిల్పిలా నా దేహాన్ని సున్నితంగా నిమురు తున్నాయి. నా అణువణువును అతని పెదవులు స్పృశిస్తుంటే మంచులా కరిగి పోతున్నాను. ఉరుకులు, పరుగులతో వచ్చే నదీ ప్రవాహాన్ని తనతో కలిపేసుకోవడం కోసం కెరటాలతో కేరింతలు కొట్టే సాగ రంలా అతను తన నైపుణ్యాన్నంతా ప్రద ర్శిస్తున్నాడు.

మొదట తన వేడి పెదవుల్ని ముద్దగా చేసి నా నుదుటిపై గాఢంగా ముద్దు పెట్టాడు. ఆ ముద్దుకి నా మెదడు నరా లన్ని ప్రకంపించి నా తనువులోని అణువ ణువూ పులకించింది. ఆ తర్వాత ముక్కు చివర సున్నితంగా కొరికాడు. నా గుండె ఝల్లుమంది. ఆ వెంటనే చెంపమీద ముద్దు పెట్టాడు. ఏ చెంపను వదల్లేదు. అదే ఊపులో తన పెదవులతో నా పెద వులపై దాడి చేసాడు. అదే తడి పెదవు లతో నా మెడని స్పృశించి, తిన్నగా కాసింత కిందకు జరిగి, నా అధరాల రమ్య తను ఆస్వాదిస్తూ తన చేతులకు పని చెప్పాడు. అతని కాలి బొటన వేలుతో నా అరికాలి మధ్య సుతారంగా రుద్దుతుంటే,

నా కాలి మునివేళ్లు మొదలుకొని, నుదుటి మీది కండరాల వరకు చిరచిరలాడాయి. ఉద్రేకంతో ఆ తియ్యటి బాధ నరనరాన ప్రకంపించగా దృఢమైన అతని శరీరాన్ని ఆర్తిగా, ఆనందంగా అల్లుకుపోయాను. దాంతో అతను కూడా ఉప్పొంగే ఉద్రేకంతో నా మెత్తని భుజాల్ని చుట్టాడు. ఆ చిమ్మచీకట్లో, వేరేవ్వరూ రాని ఏకాంతంలో, దివ్యకాంత ఒడిలో అమర సుఖాలు చవిచూస్తున్న మన్మథుడిలా నా శరీరపు సర్వసామ్రాజ్యాన్ని ఆక్రమించుకుంటున్నాడు. అప్పుడు మా కంటికి, ఒంటికి మరో ధ్యాస లేదు. గౌరవ మర్యాదలు, పాపపుణ్యాలు, భూమి, ఆకాశం ఏదీ గుర్తుకు లేదు. ఆ క్షణాన నేను, నేను కాదు, అతను అతను కాదు. కేవలం రెండు శరీరాల వాంఛ, అవాంఛిత కాంక్షే రాజ్యమేలింది. అన్ని అనుబంధాల వారధుల్ని కూల్చేసింది. మరిపించింది, మురిపించింది.

ఆహా, నాలోని ఆడతనం ఇప్పుడు, పూర్తి పరిపక్వం చెందింది!

ఎన్ని క్షణాలు, ఘడియలు పట్టిందో తేరుకోవడానికి, స్పృహలోకి రావడానికి. ఇప్పుడు అంతులేని వింతస్థితి. ఇద్దరం మౌనంగా ఉండిపోయాం. జరిగిందానికి ఎవర్నీ నిందించే పనిలేదు. ఇద్దరి దోషం ఉంది. ఇద్దరి తృష్ణ తీరింది. ఏళ్ల తరబడిగా పదిలపరిచిన సొమ్ము దొంగిలించబడ్డట్టు, కమ్ముకున్న మత్తు దిగిపోగానే కళ్ల ముందు నగ్నసత్యం కదలాడసాగింది. పశ్చాత్తాపం పడగవిప్పి కాటేసింది. క్షణిక సుఖం పాము కుబుసంలా వదిలిపోయింది.

"చింతిస్తున్నావా? " శామ్యూల్ దీన స్వరం, నా ఆత్మని ఓదార్చినట్లు ఔదార్యాన్ని వ్యక్తం చేసింది. నా తప్పటడుగు క్షణికావేశమని కూడా అనిపించడంలేదు. అతను కంట పడ్డప్పటి నుంచే నాలో ఏదో బలహీనత, ఆందోళన మొదలై ఏదో వెలితిని పూడ్చుకోవాలన్నా తపన నా అంతరంగంలో గూడు కట్టుకుని ఉండటంతోనే అంత అవలీలగా అతనికి లొంగిపోయాను.

మంచమ్మీద ఓ పక్కన పడున్న తన ప్యాంటు జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి అందులోంచి ఒక సిగరెట్ వెలిగించుకున్నాడు. గట్టిగా సిగరెట్ దమ్ములాగి, పొగ గాల్లోకి వదులుతూ నా తలను తన గుండెలకి ఆనించుకుని, నా తల వెంట్రుకల్ని సుతారంగా నిమురుతూ చెప్పాడు.

"ఇప్పుడు గడిచిన క్షణాలే నిజమైనవి ముక్తా! ఇదే సత్యం, పరిపూర్ణ సత్యం. ఆత్మతృప్తికి నిదర్శనం" చాకచక్యం గల గూఢచరిలా అతను నా మనోభావాల్ని గ్రహించడానికి, నమ్మకాన్ని కలిగిస్తూ ఓదార్చాడు. నేను చిన్నపిల్లను కాదు. మూడున్నర పదుల పరిపక్వ ప్రౌఢను. ఇప్పుడు నా స్వభావం పట్ల కంగారు, కట్టుబాట్ల పట్ల ఆందోళన కృంగదీస్తున్నాయి. ఒకే కర్మను అనుభవించినా ఒకవైపు సహజత్వం, మరోవైపు పశ్చాత్తాప భావం..

"నీకు ఏదైనా అపరాధ భావం కలుగుతోందా ఏమిటీ? " అడిగాడతను.

నేను మౌనంగా ఉండిపోయాను.

"టీ తాగుతావా? ఈరోజు నేను కాచి తీసుకొస్తాను" అతను మళ్లీ అడిగాడు. అతని కోమల స్వరం నన్ను మరింత లొంగదీసింది. చెదిరిపోయిన దుస్తుల్ని సర్దుకుని లేచి నిలబడ్డాను. గడిచిన క్షణాల మధురానుభూతి కేవలం అతనికే ప్రాప్తించలేదు. నేనూ అనుభవించాను ఆ క్షణాలని.

నేరుగా బాత్రూంలోకి దూరాను, కాసేపు ఆలోచించుకోవడానికి.

ముఖానికి ఆవరించిన ఉదాసీనతను కడిగేసుకుని చిరునవ్వును పులుముకుని బయటికొచ్చాను. శామ్యూల్ ముఖాన్ని నా గుండెలకి అదిమిపెట్టి, అతని తల వెంట్రుకల్ని సుతారంగా నిమిరి, ఆనక అతని తల పైకెత్తి నా సంతృప్తిని వ్యక్తం చేస్తూ నుదుటిపై ముద్దాడి కిచెన్‌లోకి వెళ్లాను. నేనేమయినా జబ్బు పడ్డానా, అతను నాకు సేవలు చేయడానికి? ఎప్పటిలా ఇవాళ కూడా నేనే టీ కాచుతాను. టీ నీళ్లు గ్యాస్‌స్టౌవ్ మీద పెట్టాక, కిటికీ తెరిచాను. బయట వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. పరిసరాలు అంతా యథావిధిగానే ఉన్నాయి. ఎక్కడా ఏ మార్పు లేదు. నేను కూడా అతని పరిపూర్ణ సత్యాన్ని ఏకీభవిస్తూ, ఈ పశ్చాత్తాపాన్ని విడనాడాలి.

నేను నాస్తికురాలిని కాను. ఎప్పుడైనా పూజచేయడానికి పూనుకోగానే భగవంతుడి పటంపై అతని ప్రతిబింబం ప్రకాశిస్తుంది. పదేపదే కళ్లు మూసుకుని మనసును దేముడిపై కేంద్రీకృతం చేయాలనుకుంటాను. అయినా సఫలీకృతం కాలేకపోతాను. తరచూ పూజను వాయిదా వేయాల్సి వస్తుంది. ఇదేమిటీ, ఎందుకవుతుందిలా? అతని పట్ల ఎందుకంతగా వ్యామోహం ఏర్పడింది? నాకేం లోటుందని? భర్త, పిల్లలు ఉండగా ఈ కళంకాన్ని కొని తెచ్చుకునే దౌర్భాగ్యానికి ఎందుకు దిగజారాను? రెండు నిమిషాలు భగవంతుడ్ని కొలవడానికి కూచున్నా. నా మదిలో అతనే మెదులుతున్నాడు. అసహాయస్థితిలో నా దుస్థితికి భగవంతుడ్ని క్షమాపణలు కోరుతాను. తెలిసి చేసే తప్పు క్షమార్హం కాదని నాకు తెలుసు. అయినా గత్యంతరం లేకుండా పోయింది. పరపురుషుడి ఆకర్షణదే పైచేయి అయింది.

ఒకరోజు అలాంటి సందిగ్ధావస్థలో నేను భగవంతుడితో అన్నాను- 'ఒకవేళ ఇదంతా పాపం అయితే, నువ్వు సర్వశక్తి సంపన్నుడివి, అంతర్యామివి. మరి ఎందుకు నా మదిలో నుంచి ఈ పరపురుషుడి వ్యామోహాన్ని తొలగించడం లేదు. నేను మునుపటిలా నిశ్చింతగా, ఏకాగ్రతతో నీ పూజ చేయగలిగే ప్రశాంతత ఎందుకు ప్రసాదించవు? నువ్వే నాకు ఏదైనా సన్మార్గం చూపు, ఏం చేయాలో చెప్పు? '

ఎంతెంత సుఖప్రాప్తిలో మునిగి తేలుతున్నానో, అంతంత భయం పెరుగుతోంది. అతను సెలవులకి ఇంటికి వెళ్లడం అనివార్యమని తెలిసికూడా, అతను వెళ్లడం నేను సహించలేకపోతున్నాను. అతని ఎడబాటుతో విరహవేదన తలెత్తుతోంది. మొదటికిమల్లే అతను ఎక్కడికి వెళ్లినా, వచ్చినా నాకేంటన్నట్టు, ఇప్పుడు తటస్థంగా ఉండలేకపోతున్నాను.

మావారు ఇంటిపట్టున లేనప్పుడు, ఒంటరిగా నిద్రపట్టక అటూ ఇటూ దొర్లి, దొర్లి విసుగుపుట్టి, తిన్నగా లేచి అతని గుమ్మం చేరుకుంటాను. అర్ధరాత్రో, తెల్లవారునో నాకు మెలుకువరాగానే వచ్చేస్తానన్న నమ్మకంతో అతను తలుపుకు గడియ పెట్టకుండానే ఉంచుతాడు. తలుపు చప్పుడు కాకుండా నిదానంగా తెరిచి ఇంట్లోకి అడుగుపెట్టాను. మంచం చేరుకోగానే నా బోసి



చేతుల్ని చూసి అతను ఆశ్చర్యపోతూ అడిగాడు.

"నీ గాజులు ఏమయ్యాయి? "

"తీసేసాను"

"ఎందుకు? "

"ఇక్కడికి వస్తుండగా అవి మోగితే భయమేస్తుంది. వరండాలో పడుకున్న నీ నౌకరు నా రాకను ఎక్కడ పసిగడతాడో నని..."

"అబ్బా, ఎంత దూరపు ఆలోచన నీది!" అని నవ్వుతూ నా నడుముచుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కున్నాడు. అతని చెయ్యి నడుము మడతల్లో పడగానే నా నరాలు జివ్వుమన్నాయి. తమకంతో తూలిపోయాను.

"ఇదంతా నీ సాన్నిధ్య ప్రభావం. కేవలం ఇదేకాదు, చాలా విషయాలు దాచడం, వంకలు చెప్పడం, ఏవేవో అలవాటయ్యాయి నాకు.." గోముగా అన్నాను.

"నా వల్ల బాధ కలుగుతోందా నీకు? "

"లేదు, ఏ మాత్రం లేదు" తమకంగా అంటూ అతని గుండెలమీద ఒదిగిపోయాను. నాకు ఈ లోకంతో పనిలేదు. నేను మనసా వాచా అతని సాంగత్యం కోరుకుంటున్నాను. అతను నా పట్ల నిజాయతీగానే మెదులుతున్నాడు. నాకింకేం కావాలి? ఆ మధుర క్షణాల మైకంలో రోజులు, వారాలు, నెలలు గడిచిపోతూనే ఉన్నాయి.

ఇప్పుడు మావారు ఎప్పుడు క్యాంపు నుండి ఇంటికి వచ్చినా, అతను ఆయనతో గంటలతరబడి బాతఖానీ పెట్టడం, ఆ సమయంలో కనీసం నావంక కన్నెత్తయినా చూడకుండా నిగ్రహం పాటిస్తూ, సత్యేన్‌ను మచ్చిక చేసుకోసాగాడు.

ఈ మధ్య నాకే ఆశ్చర్యం కలుగుతోంది, సత్యేన్ కబుర్లల్లో పడి ఎంత ఆలస్యంగా పడుకోవడానికి వచ్చినా నాకు విసుగు పుట్టడం లేదు. ఎంతసేపు సత్యేన్‌తో కాలక్షేపం చేసినా, అతను కూడా అలసిపోతున్నట్టు అనిపించడం లేదు. నాకు చేరువలో ఉన్నానన్న సంతృప్తి అతనికెలా ఉందో, శామ్యూల్ని చేరువగా చూడాలన్న తహతహ నాక్కూడా అలాగే ఉంది. ఆ మధుర ఘడియల్ని నేను మిస్ చేసుకోదలచలేదు. అతను నా సమక్షంలో ఉంటే, సర్వం నా చెంతే ఉన్నట్టు అనిపిస్తుంది. చిన్న పిల్లవాడు తన కిష్టమైన బొమ్మని అదిమి పట్టినట్టుగా ఆ మధుర క్షణాలని అదిమి పట్టుకోవాలనిసిస్తోంది.

నాకు జీవితం పట్ల చాలా ఆసక్తి, అనురక్తి ఉంది. అందులోనూ అతని భాగస్వామ్యం మరింత ఆశాజనకమయిపోయింది. ఇంకా ఏమీ వద్దు. అన్ని సమకూరాయి నాకు. భర్త, పిల్లలు, ఇప్పుడు నిజమైన తోడు నీడగా అతను...

క్రమేపీ మా బంధాన్ని శాశ్వతం చేసుకోవాలన్న తపనను అతను వ్యక్తం చేస్తున్నాడు. నా ఆత్మసమర్పణకి అతను ఉబ్బితబ్బిబ్బయి పోతున్నాడు. నన్ను నా సుఖాన్ని సొంతం చేసుకోవాలన్న ఆరాటం ఎక్కువయింది. బహుశా ఎక్కడో కొంత అవిశ్వాసం కూడా తలెత్తినట్టుంది నా మీద. నేను ఏ క్షణాన, ఏ కారణంగానైనా దూరమయిపోతానేమోనన్న భయం మొలకెత్తి ఉంటుంది. ఈ బంధం అశాశ్వతమేనేమో అనుకుంటున్నాడు. నేను అతనికి ఎలా విశ్వాసం కలిగించను, ఈ బంధం సదా కొనసాగుతుందనీ? అది అతని నిజాయతీ, నిగ్రహం మీదే ఆధారపడి ఉంది. నిరాపేక్షతో, నిజాయతీగల స్నేహం నిలకడగానే ఉంటుంది. ఇక్కడ విశ్వాసమే ముఖ్యం. ఇతరత్ర బంధాలను తప్పించుకోవాల్సిన అగత్యం లేదు. అంత విడమరిచి చెప్పకపోయినా, చాలా సింపుల్‌గా చెప్పాను- "నువ్వు నాకు ఇదే

రూపంలో నచ్చుతున్నావు? " అని.

ఆ మాటకి అతను నవ్వి, చిన్నగా అన్నాడు-

"నీలో ఉన్నంత పేషెన్సీ నాలో లేదు. నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. అదే నగ్నసత్యం. అది స్థిరం కావాలన్నదే నా ఆకాంక్ష. నిన్ను దూరంగా చూస్తూ గడపడం నావల్ల కావడం లేదు. ఈ దాగుడుమూతలు నేను భరించలేకపోతున్నాను. నువ్వు నాకు సొంతం కావాలి"

అతని ఉద్విగ్నత నాకు అర్థమయినా ఆ అభిప్రాయంతో నేను ఏకీభవించలేదు! ఇద్దరు పిల్లల తల్లిగా నేను అతని అభీష్టాన్ని నెరవేర్చలేను. ఇప్పటికే పడ్డ తప్పుటడుగు, అడపాదడపా నన్ను ఆశాంతికి గురిచేస్తోంది. ఓ గృహిణిగా నా సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం సుతరాం ఇష్టం లేదు. పిల్లల్ని అధోగతిపాలు చేయలేను. మెదడులో కర్తవ్యం మెదులుతూ ఉన్నా, అతను కంటపడగానే, కళ్లెం తెంచుకున్న గుర్రంలా మనస్సు అతని వెనకాల పరిగెడుతూనే ఉంటుంది.



## 7

**నే**ను ఇప్పుడు ఈ బంధాన్ని ఏమంటారోనని ఆలోచించలేదు. నిజానికిది అక్రమ సంబంధమే అయినా, నా మనసెందుకో అలా అంగీకరించడం లేదు. ఇది ఆత్మీయ బంధమనే నా అంతరంగం ఘోషిస్తోంది. ఇష్టమైనది పొందడానికి కష్టం ఉంటుంది. ఆ కష్టం ఆర్థికంగానూ కావొచ్చు, సామాజికంగానూ కావచ్చు, కుటుంబపరంగానూ కావచ్చు. అక్రమ సంబంధాల్లో అస్థిరత్వం చోటు చేసుకునే ఉంటుంది. అదే అస్థిరత మనిషిలో తపన, తడబాటుని ఉత్పన్నం చేస్తాయి. మరి అదే తడబాటు బంధానికి అమరత్వాన్ని కూడా అందిస్తుంది. కలయికే బంధాల చరమదశ. ముఖ్యంగా ఇలాంటి మనోబంధాల్లో ఇక జీవితం కట్టుబాట్ల భయాల్లో సాగుతుంది. నిదానంగా పచ్చదనపు ఎడారిలోకి చేరిపోతుంది. బంధాలు మారినప్పుడు, పాత పేర్లచోట మరోకొత్త పేర్లు చోటు చేసుకుంటాయి. అయితే ఈ నామరహిత బంధం పరమ పావనమైంది. విశ్వాసపాత్రమైంది. చాలా నాజూకయింది. అంతే దృఢమైంది. ఇది తెగిపోయే బంధం కాదు. ఇనుప సంకెళ్ల బంధం..

ఇవాళ శామ్యూల్‌కు ఇష్టమైన భోజనం నేనే స్వయంగా వండాను. మటన్ బిర్యాని, చిక్కటి మజ్జిగలో పచ్చి మిరపకాయలు, ఉల్లి, కొత్మీర తరిగివేసి పులుసులా చేసి, పోపు పెట్టి, కమ్మగా వండాను. అతనికి మజ్జిగ పులుసంటే చాలా ఇష్టం. నేను డైనింగ్ టేబుల్‌మీద అతనికి ఎదురు కుర్చీలో కూచుని తింటుంటే అతన్నే తేరిపార చూసాను. అతను తృప్తిగా తినడం చూస్తుంటే ఎంతో తృప్తిగా అనిపించింది నాకు. ఆ తింటున్నది శామ్యూల్ కాదు, రితు, మోనూలా ఉంది. ఇదేం ఆప్యాయత ఉద్భవిస్తుంది నాలో? ప్రేమ, మమకారాలు మిళితమై మనస్సును రంజింపచేస్తున్నాయి.

అతను భోజనం చేసేసాడు. నేను టవల్ అందించాను. అతను చేతులు తుడుచుకున్నాక, తాంబూలం ఇచ్చాను. అతను సోంపుగింజలు నోట్లో వేసుకుంటూ

నా వంక అదోలా, గోముగా మొహంపెట్టి చూసాడు. ఉద్వేగంతో వెంటనే నా మణి కట్టు పట్టుకున్నాడు.

"పదా.. ఎక్కడికైనా పారిపోదాం" అతను ఉద్వేగానికి లోనయ్యాడు.

"ఎక్కడికి? "

"ఎక్కడికైనా. ఇంత పెద్ద ప్రపం చంలో.. ఎక్కడైనా స్వేచ్ఛగా బతుకుదాం"

"అదే ఎక్కడని? "

"సింగపూర్"

"సరే. పారిపోయామనుకో తర్వాత? "

"మనం పెళ్లి చేసుకుందాం"

"ఆ తర్వాత? "

"ఆ తర్వాతేమిటీ.. మనకు పిల్లలు పుడ తారు"

"అలాగా..!" నేను నవ్వుతూనే 'అలాగా' అనే పదాన్ని ఒత్తి పలికాను. అందులో దాగిన వెటకారాన్ని అతను గ్రహించి ఉడు క్కున్నాడు. అతడు ఉడుక్కోవడానికి విరు గుడుగా, నేను పగలబడి నవ్వాను. ఇలా ఏదైనా అతను గంభీరంగా మాట్లాడినప్పు డల్లా నాకు నవ్వొస్తుంది. వెంటనే అతను నిరాశ చెందకుండా బుజ్జగించేస్తాను.

"సింగపూర్‌కు వెళ్లాల్సిన అవసరమే ముంది? ఇక్కడి స్థలం అనుకూలంగా లేదా? ఇక్కడి వాతావరణం ఆహ్లాదక రంగా లేదా? " అడిగాను.

"లేదు. స్వేచ్ఛ లేదు. ఏ క్షణాన బయట పడతామోనన్న భయం వెంటాడు తోంది.. ఏమైనా సరే మనం ఇక్కడ్నుంచి పారిపోవాల్సిందే.." అంటూ బొత్తిగా పసి పిల్లాడిలా మారాం చేసాడు. అతని ముఖంపై అమాయకత్వం ఆవరించు కుంది. ఈ వయసులో ఇంతటి అమాయ కత్వమా? ప్రేమలోనే ఇది సాధ్యమేమో, అనిపించింది నాకు.

"ప్రేమతో మనిషి ఎంత ఉదారుడు, దయామయుడైపోతాడు" అన్నాను నేను.

"అవును. కొద్దిరోజులుగా నాక్కూడా అలాగే అనిపిస్తోంది. మొదట్లో మా నౌకరు చిన్న పొరపాటు చేసినా చిందులు తొక్కేవాణ్ణి. అదే ఇప్పుడు వాడెంత పెద్ద పొరపాటు చేసినా కోపం రావడం లేదు" అన్నాడతను.

"అందుకేనా, నిన్న మీ నౌకరు మా సుమీరన్‌తో అంటుంటే విన్నాను- మా సారు ఈ మధ్య పూర్తిగా మారిపోయారు. మంచిగా మాట్లాడుతున్నారు- అని" నేను కూడా ఆలోచనలో పడిపోయాను. నాక్కూడా అలాగే అనిపిస్తోంది. 'సము ద్రపు కెరటాల్లా, నా అంతరంగంలోనూ ఆనందపు తరంగాలు ఉప్పొంగుతుంటే, వాటిని అందరికీ పంచాలని ఉంది. నా ముఖంపై తాండవిస్తున్న ఉల్లాసం, బహు శా సుమీతా పసిగట్టినట్టుంది.

"ముక్తా, ఏమిటి విషయం? చాలా సంతోషంగా కనిపిస్తున్నావు? " ఒకరోజున నిలదీసి అడిగేసింది సుమీతా.

"ఏంలేదు. సంతోషం దేనికి? మామూ లుగానే ఉన్నాను"

"దాచకు. నీ ముఖం చూస్తే అర్థమయి పోతుంది. శామ్యూల్తో ఇంత చనువు మంచిదికాదు. నువ్వు ఒకరి ఇల్లాలివి. నీకు భర్త, పిల్లలు, సంసారం ఉన్నాయి. సత్యేన్ కూడా నువ్వంటే ఎంతో ఇష్టపడు తారు. మరి నీకిదేం పోయేకాలం.. ఏం తక్కువైంది నీకు? "

అప్పుడు ఆమె ముందు నోటికొచ్చిన అబద్ధాలు చెప్పి తప్పించుకున్నాను. ఆ తర్వాత అనిపించింది, నిజంగానే నాకేం తక్కువైంది? ఏలోటు లేదు. ముత్యా ల్లాంటి పిల్లలు, బొమ్మరిల్లు వంటి ఇల్లు, బంగారంలాంటి భర్త. సుమీతా అన్నది నిజమే. అయినా శామ్యూల్ ఆకర్షణ మైకంలా మనస్సుని కమ్ముకుంది. ఆ మైకం నుండి బయటపడలేకపోతున్నాను.

బహుశా అతని బోల్డ్‌నెస్ మహిమ కావచ్చు. ఆ ఆయుధాన్నే పదేపదే ప్రయోగిస్తూ నన్ను కైవసం చేసుకుంటున్నాడు. సాఫీగా సాగిపోతున్న మా దాంపత్య జీవితంలో కొద్దిపాటి విరహపు బీటలు రాగానే, ఆ సందులోంచి అతను వెయ్యి కాళ్ల జర్రిలా దూసుకొచ్చేశాడు.

తర్క వితర్కాలతో ఆత్మవిమర్శ చేసుకుంటూ నన్ను నేను కుదుటపరుచుకునే ప్రయత్నం చేశాను. సుమీతా మేలుకొలుపు మాటలు గుర్తుకొచ్చినప్పుడల్లా కలవరపాటు కలుగుతోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఆలోచనలు మెదడును తేనెతుట్టెలా ముసురుకుంటున్నాయి. ఆ తీవ్రతతో మెదడు నరాలు చిట్లిపోయేలా ఉన్నాయి. రెండు చేతులతో తలని బిగ్గరగా అదిమి పట్టుకున్నాను. ఉఫ్, ఇదేం అలజడి రేకెత్తింది నా జీవితంలో..

"ఏం ఆలోచిస్తున్నావు, డార్లింగ్?" అతను చేరువగా నిలబడి ఉన్నాడు. ఎప్పట్నుంచి నిల్చున్నాడో గమనించనే లేదు నేను. నేను మౌనంగా ఉండిపోయాను. నేను ఏ ఆందోళనకు గురయి కొట్టుమిట్టాడుతున్నానో, అది వ్యక్తంచేసే పదాలు తోచడం లేదు.

"నా గురించే ఆలోచిస్తున్నావు గదూ?"

బహుశా నా విచారవదనం అతన్ని కూడా కలవరపరచినట్టుంది.

నేను తల విదిలించాను.

"మన సంబంధం గురించా?"

"అవును" నేను దీనంగా అన్నాను.

"ఏమిటీ నా పట్ల నమ్మకం లేదా?" అతను నా చెయ్యి పుచ్చుకుని అడిగాడు. నేను విడిపించుకోజూశాను.

అతను మరింతగా అదిమిపట్టాడు.

"నన్ను నమ్ము. నాకు నీ అవసరం ఉంది" అతను దీనంగా అభ్యర్థించాడు. గొంతులోని ఆర్ద్రత నేరుగా నా గుండెల్లోకి దిగింది.

"ఈ సంబంధ పర్యవసానం ఏమిటీ? " బెంబేలు పడుతూ అడిగాను.

"పర్యవసానం గురించి పిరికివాళ్లు ఆలోచిస్తారు. మనమెందుకు ఆలోచించడం? మనమిద్దరం ఒకటయ్యాం. ఒకటిగానే జీవిద్దాం" అతను ఆవేశంగా అన్నాడు.

"మరి నాకు మల్లెనే, నీకూ భార్య ఉంది, పిల్లలున్నారు"

"అయితే మనం చివరిశ్వాస వరకూ కట్టుబాట్లతో జీవితం కొనసాగించే శాపగ్రస్తులమేనా? మనం ఓ కొత్త పరంపరని ప్రారంభిద్దాం. కొత్త సంప్రదాయాన్ని సృష్టిద్దాం. మన జీవితాన్ని మనకి నచ్చిన రీతిలో తీర్చిదిద్దుకుందాం..." అని చెబుతూనే, నెమ్మదిగా నా చేతిని చుంబించి, వెళ్లిపోయాడు. మళ్లీ వాతావరణంలో విచిత్రమైన సువాసన వ్యాపించింది. కాలం మీద భారం వేసి పొద్దు గడుపుతున్నాను.

సత్యేన్‌తో శామ్యూల్ మంచి మిత్రత్వాన్నే కొనసాగిస్తున్నాడు. అతను స్నేహం చేయడంలో మహాదిట్టనే. సత్యేన్ వంటి గంభీర వ్యక్తిత్వంగల మనిషిని మచ్చిక చేసుకోవడం మామూలు విషయం కాదు. అందులోనూ లోగడ కలిగిన అనుమానం ఏమాత్రం బలపడకుండా మసలుకుంటున్నాడు. అంతేకాదు. పక్కింటి సుమీతా కంట్లో పడకుండా జాగ్రత్త పడుతూ మావారి విశ్వసనీయతను కూడా పొందుతున్నాడు. ఇప్పుడు మావారు అతనితో ఎలాంటి సందేహం లేకుండా నిశ్చలంగా ఉంటున్నారు.

ఇవాళ కూడా వాళ్లిద్దరే డ్రాయింగ్ రూంలో కూచుని మాట్లాడుతున్నారు.

"ఏమండి, మీరు పదిరోజులు సెలవు పెట్టగలరా? " అతను మావారిని అడిగాడు.

"లేదు"

"ఎందుకు? " అతను తెల్లబోతూ అడిగాడు.

"మా పని అలాంటిది. సెలవు తీసుకోవడం కుదరదు" సత్యేన్ చెప్పారు.

"రాత్రింబవళ్లు పర్యటిస్తూ పనిచేయడం మీకు విసుగనిపించదా? " మళ్లీ అడిగాడు.

"విసుగనిపిస్తుంది. ఎప్పుడూ ఒకేలాంటి జీవితం ఏ మనిషికయినా విసుగు పుట్టిస్తుంది. కానీ తప్పదుగా, ఉద్యోగమన్నాక" నత్యేన్ నవ్వుతూ చెప్పారు.

"అవునులెండి. అదీ కరెక్టే? " అతను ఏకీభవించాడు.

వాళ్ల బాతాఖానీ కొనసాగుతూనే ఉంది. నేను కిచెన్‌లోకి వంట చేయడానికి వెళ్లిపోయాను. వాళ్ల కబుర్లు అటు తిరిగి ఇటు తిరిగి, బహుశ కోల్‌కతా పర్యటన వైపుకి మళ్లినట్టుంది. అతను మా వారిని ఒప్పిస్తున్నట్టు అనిపించింది.

రాత్రికి పడుకున్నాక, మా వారు నావైపు తిరిగి అడిగారు, "ఈసారి నాతోపాటు కోల్‌కతా వస్తావా? "

"ఇలా హఠాత్తుగా వెంట తీసుకెళ్లే ఆలోచన వచ్చిందేమిటీ మీకూ? " నేను భ్రుకుటి ముడివేస్తూ అడిగాను.

"ఊరకనే, చాలా రోజులుగా నిన్ను ఎక్కడికీ తీసుకెళ్లలేదుగా? "

"పిల్లలకు స్కూల్ ఉందిగా? "

"మన వెంట ఇప్పుడు పిల్లల్ని తీసుకెళ్లడం లేదు. సుమీరన్ వాళ్లను చూసుకుంటుంది. వేసవి సెలవుల్లో వాళ్లని మా అమ్మగారి దగ్గరకు పంపుదాం" సత్యేన్ విడమరచి చెప్పారు.

"కేవలం మనిద్దరమేనా? "

"కాదు, శామ్యూల్ తన భార్య పిల్లలతో

వస్తున్నాడు. వాళ్లు కూడా చాలాకాలంగా కోల్‌కతా చూడాలనుకుంటున్నారట. అతను మనల్ని తోడుగా రమ్మని రిక్వెస్ట్ చేసాడు. నలుగురయిదుగురు కలిసి పర్యటిస్తే ప్రయాణం ఉల్లాసంగా గడుస్తుందని అంటున్నాడు" అని చెప్పారు.

శామ్యూల్ చాలా చాకచక్యంగా, నేర్పుగా మా వారిని కోల్‌కతా టూర్‌కి ఒప్పించినట్టున్నాడు. చలికాలంలో ప్రయాణమంటే నిజానికి నాకిష్టం ఉండదు. కానీ నా ఇష్టంకంటే, అతని సంతోషానికే ప్రాముఖ్యమిస్తూ నేను సిద్ధమయ్యాను. అతనికి నాతోపాటు దేశ నలుమూలలు పర్యటించాలన్న కోరిక ఉంది. అయితే నిజానికి కేవలం నాతో పాటే తిరగాలని ఉంది. మధ్యలో సత్యేన్ కూడా ఉండొద్దట.

ప్రయాణానికి చాలా తక్కువ వస్తువులే సర్దాను, ఒకే బ్యాగు తేలిగ్గా మోయగలిగేలా. ఇంతకు ముందెప్పుడు ఏ ప్రయాణంవేళ ఇంత చురుగ్గా నేను సిద్ధమవ్వలేదు.

సామానుతోపాటు మేమిద్దరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాం. అతను తన ఫ్యామిలీతో నేరుగా స్టేషన్‌కు వస్తానని చెప్పాడు. మావారికి ఆ ప్రయాణం పెద్ద విశేషమేమీ కాదు, పర్యటనలు మామూలే. కానీ నాకే చాలా ఉత్సాహంగా ఉద్విగ్నంగా ఉంది. ఈ ప్రయాణంలో కొత్త పరిచయాలు, కొత్త పలకరింపులతో ఎన్నాళ్లుగానో నాలో దాగి ఉన్న ఉత్సుకతకి తెరపడుతుంది. అతని భార్య, పిల్లలు ఎలా ఉంటారో చూడాలన్న ఆసక్తి నాకు చాలా రోజుల క్రితమే కలిగింది. వాళ్ల గురించి అతను చాలా తక్కువ ప్రస్తావిస్తాడు. నెలనెలా ఇంటికి తనే తప్పకుండా వెళ్లొస్తాడు గానీ, ఎప్పుడూ వాళ్లని వెంటబెట్టుకు రాలేదు. ఎందుకనో? ఇవాళ అతని భార్యను కలవడం, మాట్లాడ్డం అన్నీ జరుగుతాయి. సాటి ఆడమనిషి తోడుతో ప్రయాణం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగుతుంది. పైపెచ్చు పర్యటనరోజుల్లో ఎక్కువ సమయం అతను నా సమక్షంలోనే ఉంటాడన్న సంతోషం కూడా ఉంది.

ఎక్కువసేపు మేము నిరీక్షించాల్సి రాలేదు. అతను వస్తూ కనిపించాడు. కానీ కేవలం ఒక్కడే. అతని వెంట ఎవరూ ఉన్నట్టు కనిపించడంలేదు. వెనకాల వస్తున్నారేమోనని దూరంవరకు దృష్టి సారించి చూసాను. ఎవరూ అతని తాలూకు మనుషుల్లా అనిపించలేదు. హడావుడిగా అతనొక్కడే సూట్‌కేసు పట్టుకుని వచ్చాడు.

"ఫ్యామిలీ ఏదీ? " సత్యేన్ అటూ ఇటూ పరికించి చూస్తూ అడిగారు.
"వాళ్లు రాలేకపోయారు"
"ఎందుకు రాలేకపోయారు? " సత్యేన్ ఆశ్చర్యపోతూ అడిగారు.
"నాభార్యకి అకస్మాత్తుగా పుట్టింటికి వెళ్ళాల్సి వచ్చింది. ఆమె కజిన్ బ్రదర్ పెళ్లి ఉంది. అందుకే టూర్‌కి రానంది"
"మరి పిల్లలు? "
"వాళ్లు కూడా తల్లివెంటే వెళ్తున్నారు" అతను చెబుతుంటే, నాకు విడ్డూరంగానూ విచారంగానూ అనిపించింది. అతని భార్యను చూడాలన్న తాపత్రయం నీరుగారిపోయింది. ఆమె వచ్చుంటే ఎంత బావుండేది. అతని ఫ్యామిలీ రావడం లేదని తెలిసేసరికి మావారు కూడా నిరుత్సాహంగా మారిపోయారు. బహుశ ఫ్యామిలీతో వస్తున్నాడనే ఈ పర్యటనకి మావారు అంగీకరించి ఉంటారు. నాక్కూడా అతను అబద్ధం చెబుతున్నట్టే అనిపించింది. అతను ఇంతవరకు ఎప్పుడూ ఫ్యామిలీతో ఏ ప్రోగ్రాం ఏర్పాటు చేయలేదు. నేను టికెట్ చూపమని ఎంత అడిగినా అతను తన టికెట్ చూపలేదు. ఇలా మభ్యపెట్టడంలో ఏదో పన్నాగం ఉండే ఉంటుంది.

మనసు కుదుట పరచుకుని కంపార్టుమెంట్‌లోకి ఎక్కి కూచున్నాను. ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగుతుందనుకున్న ప్రయాణం నిరుత్సాహంగా మొదలయింది. మావారి ముభావం భావి ఉద్రిక్తతను చాటుతోంది. మౌనంగా ఏం ఆలోచిస్తున్నారోనన్న భయం కలిగి, సహజధోరణి కలిగించడానికి నేను మా వారివైపే ఎక్కువ మొగ్గు చూపుతూ మాట్లాడసాగాను.

మర్నాడు పొద్దున్నే రైలు హౌరా స్టేషన్ చేరుకుంది. రైలు దిగి ప్లాట్‌ఫారం గుండా నడుస్తుంటే, జనం తోపులాటను చూసి నేను బిత్తరపోతూ అరిచాను, "బాప్రే! ఇంత జనమా? "

ఆ రద్దీని తట్టుకుంటూ బయటి దారివైపుకు నడుస్తుంటే మనుషుల పూర్తి ఆకారాలు కనిపించడం లేదు. కేవలం తలలే కనిపిస్తున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడా రవ్వంత ఖాళీ కనిపించడం లేదు. అన్నీ తలలే తలలు. నల్లటి నది ప్రవాహంలా ముందుకు దూసుకుపోతూనే ఉన్నాయి. ఎవరైనా కాస్త తడబడుతుంటే వెనక నుంచి తోసేస్తూనే ఉన్నారు. ఆ ప్రాంగణమంతా ఉరుకులు పరుగులతో, రణగొణధ్వనులతో మారు మ్రోగుతోంది. ఎటుపోతున్నామో, ఏమైపోతున్నామో, అసలు అర్థం కావడం లేదు. పూర్తిగా స్టేషన్ దాటి రోడ్డుమీదకు చేరుకోగానే, ఊపిరి తీసుకుంటూ అడిగాను, "ఎప్పుడు ఇంతే రద్దీగా ఉంటుందా ఇక్కడ? "

"తెల్లారింది మొదలు, రాత్రి పదిన్నర వరకు ఈ జనప్రవాహం ఇలాగే ఉంటుంది. రాత్రి పది తర్వాత ఈ స్టేషన్‌కు ఒక్క రైలు రాదు, ఇక్కడ్నుంచి ఒక్క రైలు పోదు. ఆ రాత్రివేళప్పుడే ఈ ప్రాంతమంతా ప్రశాంతంగా ఉంటుంది. తెల్లవారు నుంచే జనప్రవాహం మొదలవుతుంది. ఇక తెరిపి ఉండదు" అని చెప్పారు మా వారు, తన అనుభవాన్నంతా వ్యక్తం చేస్తున్నట్టుగా.

"అలాగా!" అని నేను ఆశ్చర్యపోతూనే శామ్యూల్ కలుగజేసుకున్నాడు.

"ఇక్కడ ఉన్న జనం మరే రైల్వేస్టేషన్‌లో కనిపించరు. దేశ జనాభా అంతా ఇక్కడే ఉన్నారా అనిపిస్తుంది" అంటూ శామ్యూల్ టాక్సీకోసం దౌడు తీస్తుంటే మా వారు ఆపారు.

"ఉండండి, హౌరా వంతెన దాటాక, ట్రామ్ ఎక్కుదాం. కోల్‌కతాలో ట్రామ్‌లదే

ప్రాధాన్యం" అని చెప్పారాయన.

రెండు డబ్బాల ట్రామ్, నడిరోడ్డుమీదుగా నది ప్రవాహంలా పయనిస్తుంటే, రోడ్డు ఇరువైపుల జనం ఒడ్డున పరుగులు పెడుతున్నట్టుగా ఉంది. ఎటుచూసినా నింగిని తాకే ఆకాశహర్మ్యాలు. మా వారు తనకు తెలిసిన హోటల్‌కి తీసుకెళ్లారు. ఆయన కోల్‌కతా వచ్చినప్పుడల్లా అదే హోటల్లో బసచేస్తారట. హోటల్లో చాలా మంది బేరర్లు ఆయన్ని గుర్తుపడుతున్నారు. రూంలోకి వెళ్లగానే మావారు శామ్యూల్‌కు చెప్పారు.

"మీరు తొందరగా ఫ్రెషప్ అవ్వండి. టిఫిన్ చేసి ఇవాళే కొన్ని ప్రదేశాలు చూసొద్దాం"

"ఓకే. అరగంటలో ప్రిపేర్ అయిపోతాను" అంటూ అతను తన గదిలోకి వెళ్లిపోగానే, నేను కూడా బ్యాగులోంచి బట్టలు తీసి, బాత్రూంలోకి వెళ్లిపోయాను.

మొట్టమొదట మేము అజబ్‌గర్ సందర్శించడానికి వెళ్లాం. మొదటి అంతస్తులో పురాతన వస్తువులు చూస్తూ, చూస్తూ రెండో అంతస్తు చేరుకున్నాం.

అక్కడ అన్ని రాష్ట్రాల సంస్కృతులు ప్రదర్శింపబడి ఉన్నాయి. వివిధ రాష్ట్రాల వేషధారణ, భోజనాదులు, పండుగల విశిష్టతలు, రాష్ట్రాల చిహ్నాలు, పురాతన కట్టడాల నమూనాలు ఉన్నాయి.

అక్కడ్నుంచి మేము జూపార్క్‌కు వెళ్లాం. జూలో కాలినడకన తిరిగేసరికి బాగా అలసిపోయి, ఆకలేయసాగింది.

అక్కడే ఉన్న క్యాంటీన్‌లో భోజనం చేసి, జూ నుండి బయటికి రాగానే మావారు, అతన్ని అడిగారు, "ఇప్పుడు మళ్లీ ఎక్కడికి వెళ్దాం? "

"విక్టోరియా మెమోరియల్, రేస్ కోర్స్ చూసేస్తే దక్షిణం వైపు దర్శనీయ ప్రదేశాలు పూర్తయిపోతాయి" అని సూచించాడతను.

"మరి దక్షిణపు దక్షిణేశ్వర్ మందిరం మిగిలి పోతుందిగా? " మావారు గుర్తుచేశారు.

"అవునవును, నేను మరిచేపోయాను" అంటూ నాలుక కరుచుకున్నాడు. బహుశా తను హిందువు కాకపోవడం వల్ల గుళ్ళ విషయంలో పెద్దగా పట్టింపు లేకపోవడం కూడా కారణం కావచ్చు. తన తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడానికి అతను సత్యేన్‌కేసి చూస్తూ మరో విషయం గుర్తు చేసాడు.

"బెంగాల్‌లోనే కదూ.. ఎక్కడో తారా పీఠం ఉంది, సిద్ధి పీఠాల్లో ఒకటిగా భావి

స్తారు? ”

“మీకెలా తెలుసు దాని గురించి? ”

“నా ఫ్రెండొకడు చెప్పాడు. అక్కడ వామక్షేపా భక్తికి చాలా ప్రాధాన్యం ఉందట. ఇంకా చాలా చెప్పాడు. నిజమేనా? ”

“నిజమే, ఎన్నోసార్లు కోల్‌కతా వచ్చాను గానీ, దురదృష్టవశాత్తు నేను కూడా అక్కడికి వెళ్లలేకపోయాను. నేనూ అక్కడి మహిమ గురించి చాలా విషయాలే విన్నాను. అదేం పెద్ద ప్రసిద్ధి చెందిన ప్రాంతం కాకపోయినా గొప్ప మహిమగల దేనని తెలిసింది. తారాదేవి కొలువుండడంతో తారా పీఠంగా విరాజిల్లుతోంది. అక్కడొక విశేషం ఉందట. ఆ మందిరం పూజారి ప్రతిరోజు ఒక కాలుతున్న చితిపాగను తిలకించనిదే, ఆ దేవికి నైవేద్యం అర్పించరట. విడ్డూరంగా ఉంది కదూ? ” మావారు చెబుతుంటే, నేను ఆయన ముఖంకేసి తదేకంగా చూస్తూ, “మీక్కూడా చాలా విషయాలు తెలుసే!” అన్నాను చిన్నగా.

“మనం పర్యటిస్తూ ఉంటే చాలా విషయాలు తెలుస్తాయి. రకరకాల మనుషుల్ని కలుస్తాం. వాళ్ల మాటలతో ఎన్నో అనుభవాలు, అనుభూతులు కలుగుతాయి. పలురకాల పర్యటనలతోనే పలురకాల అనుభవాలు తెలుస్తాయి” అని చెప్పారు మావారు.

“మరి పర్యటించే సమయం లేనివాళ్లు? ” అతను అడిగాడు.

“అలాంటివాళ్లు మంచి మంచి పర్యాటక ప్రదేశాల పుస్తకాలు చదవాలి. ఆయా ప్రదేశాలని ప్రత్యక్షంగా సందర్శించిన అనుభవజ్ఞులే వాటిని రాస్తారు. ఎందరో తమ అనుభవాలని, అనుభూతుల్ని పొందుపరుస్తారు”

జూపార్క్ నుంచి విక్టోరియా మెమోరియల్ మూడంతస్తుల భవనం ఎక్కిదిగి తిరిగేసరికి బాగా అలసిపోయాను.

“ఇవాళ్టికి చాలండి. హోటల్‌కి వెళ్దాం” అన్నాను మావారితో. ఆయన సరే నన్నారు. కానీ శామ్యూల్ మాత్రం అన్యమనస్కంగా ‘ప్చ్’ అన్నాడు. నాకు అర్థం కాలేదు. అతనెందుకు అలా పెదవి విరిచాడో! అతను అలసిపోలేదా ఏమిటీ?

హోటల్ రూంలోకి చేరుకోగానే మంచమ్మీద కుప్పలా పడిపోయాను.

“బాగా నొప్పులయి పోయాయండి. ఇంత నడవాల్సి వస్తుందనుకోలేదు” అన్నాను ఆయాసంగా.

మావారు నేను కాళ్లు వత్తుకోవడం చూసి నవ్వుతూ అన్నారు, “నడక ఆరోగ్యానికి మంచిది. మనుషులు లావెక్కరు కూడా!”

ఆయన మాటలు నన్ను ఉడికించాయి.

నా అలసటను గ్రహించి, శామ్యూల్ హోటల్ బేరర్‌ను పిలిచి టీ తెమ్మని చెప్పాడు. అలసటతో దిమ్మతిరిగిపోయిన శరీరం, టీ తాగితే కాసింత ఉపశమనం పొందుతుందని అందరికీ తెలిసిందే.

బేరర్ వేడి టీ, చల్లటి నీళ్లు తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. అప్పుడే రాత్రి భోజనాలు కూడా ఆర్డర్ చేసాడు శామ్యూల్. వేడివేడి టీ తాగాక మనసుకాస్త కుదుటపడింది. కాసేపు విశ్రాంతి తీసుకుని, స్నానం చేయడానికి బాత్రూంలోకి వెళ్లిపోయాను.

వాళ్లిద్దరూ బాతాఖానీలో పడ్డారు. నేను ఫ్రెషప్ అయి బయటకొచ్చేసరికి శామ్యూల్ ఏదో వేదాంతం వల్లిస్తున్నట్టు నా చెవిన పడింది.

“...విషయం పక్షులు, మనుషులని కాదు. సందర్భం చూసే వస్తువును బట్టి ఉంటుంది. సృష్టిలో ఎందరో పశుపక్ష్యాదులను ప్రేమించి, పోషించేవారు ఉన్నారు. నిర్దాక్షిణ్యంగా భక్షించేవారు ఉన్నారు. అకా

రణంగా చంపబడుతున్న వాటి పూర్వజన్మ కర్మఫలం అనుకోవాలా, లేక వాటిని చంపి తినే వారి పాపకర్మం అనుకోవాలా? మరి మీ ధార్మిక గ్రంథాల్లో మనిషి కర్మలకి పొందాల్సిన స్వర్గం, నరకం భూమ్మీదే ప్రాప్తిస్తుందని రాసారు" అతనెంతో జీవిత సారాన్ని రంగరించిన అనుభవజ్ఞుడిలా చెబుతుంటే, నేనతనిని క్షణంపాటు తేరిపార చూసాను.

"అయితే మీరు మా ధార్మిక గ్రంథాలు కూడా చదివారా? " మావారు ఆశ్చర్యపోతూ అడిగారు.

"చదివాను సార్, నాకెందుకో హిందూ ధర్మం పట్ల చాలా ఆసక్తి ఉంటుంది. అందులో దాగి ఉన్న ఫిలాసఫీ జీవితపు సత్యాలని సాక్షాత్కరిస్తాయి. జీవితం పట్ల విశ్వాసాన్ని రేకెత్తిస్తాయి" అతను తడబడుతూ చెబుతుంటే, ఈ కబుర్లన్నీ నన్ను ప్రభావితం చేయడానికే వల్లిస్తున్నట్టు అనిపించింది. లేకుంటే క్రైస్తవుడై ఉండి మా ధార్మిక గ్రంథాలను చదవడమేమిటి? వాటికి ప్రభావితం కావడమేమిటీ?

"ఇప్పుడు గ్రంథాల ప్రస్తావన అనవసరం. ప్రస్తుతం భోజనం త్వరగా వచ్చేలా చూడండి. తిని పడుకోవాలి. నాకు నిద్ర వస్తోంది" అతనికేసి చూస్తూ అనగానే, వెంటనే హోటల్‌వాళ్లకి ఫోన్ చేసాడు.

బేరర్ భోజనం తీసుకురాగానే ముగ్గురం కామ్‌గా భోంచేసాక, ఇక పడుకోవడానికి వెళ్లిపొమ్మని సైగ చేసాను. గత్యంతరం లేక మొహం దీనంగా పెట్టి పక్క రూంలోకి వెళ్లిపోయాడు. డబుల్ బెడ్‌రూం తీసుకోవడం అతనికిష్టం లేదు. ట్రిపుల్ కాట్స్ ఉన్న ఒకే గది తీసుకుని కలిసే ఉందామన్నాడు. అందుకు మా వారు ఇష్టపడలేదు. నాక్కూడా అతని ప్రస్తావన అనుమానంగా తోచింది. డబుల్ బెడ్‌రూమ్స్‌నే ఖాయం చేశాం.

మర్నాడు పొద్దున్నే బ్రష్‌చేస్తూ మా వారు నాతో చెప్పారు, "కోల్‌కతా కొచ్చిన వాళ్లు కాళీమాత గుడి చూడ్డం తప్పనిసరి. నువ్వు త్వరగా రెడీ అవ్వు. మొదట గుడికే వెళ్దాం"

"పది నిమిషాల్లో రెడీ అయిపోతాను. కాళీమాత దర్శనం చేయందే కోల్‌కత్తా యాత్ర ఎలా సంపన్నమవుతుంది. మొదట అక్కడికే వెళ్దాం" అంటూ నేను గబగబా బ్రష్‌చేసి, స్నానంచేసి వచ్చాను. ఎర్రంచు తెల్ల సిల్క్‌చీర కట్టి, ఎర్రబ్లౌజు, ఎర్రగాజులు, ఎర్రబొట్టు పెట్టుకుని తయారయి హాల్లోకి రాగానే, మావారు నన్ను చూసి విస్తూపోతూ అన్నారు "ఏమిటోయ్, కాళీమాత దగ్గరకు వెళ్తున్నామని, కాళీమాత అవతారమెత్తావా? "

"అవును, గుడికి వెళ్లేటప్పుడు కట్టుకోవాలనే ఈ చీర తెచ్చాను. బావుందా? " అని అడిగాను.

శామ్యూల్ తననే అడిగినట్టుగా, మా వారి వెనకనుండి, కనుగుడ్లు పెద్దవిచేసి 'బ్రహ్మాండంగా' ఉందన్నట్లు సంజ్ఞ చేసాడు.

కాళీమాత మందిర ప్రాంగణంలో ముగ్గురం టాక్సీ దిగాం. గుడి బయట పూజా సామాగ్రి దుకాణాలు వరసగా ఉన్నాయి. మావారు అమ్మవారికి సమ

ర్పించే సామాగ్రి కొంటున్నారు. అతనేమో అన్యమనస్కంగా అటూ ఇటూ పచార్లు కొట్టసాగాడు. గుడిలోకి అన్యమతస్థులు ప్రవేశించరాదు. ఎటూ పాలుపోక జేబు లోంచి సిగరెట్ పాకెట్ తీసి తెరవబోయి, గుడి ప్రాంగణంలో పొగ తాగరాదన్న నియమం గుర్తుకొచ్చి గభాల్న తిరిగి జేబులో పెట్టేసుకున్నాడు. అతని విచారం నాకర్థమయింది. తను భిన్నమతస్థుడు కావడంవల్ల నాతోపాటు గుడిలోకి రాలేక పోతున్నందుకు బాధపడుతున్నట్టుగా ఉంది. అతని వాలకం చూసి నాక్కూడా బాధేసింది. నేను కూడా గుళ్ళోకి వెళ్లనులే, అందామనుకున్నాను కానీ అంతలోనే మావారు వచ్చేయడంతో నా తడబాటు తొలగిపోయింది.

సత్యేన్ పూజాసామాగ్రి బుట్ట నా చేతికి చ్చారు. దాంతోపాటు గాజులు కూడా అమ్మవారి ముందుకి తీసుకెళ్లాలన్న విషయం గుర్తుకువచ్చింది. పక్కనే ఉన్న షాపులో గాజులు వేలాడుతున్నాయి. ఆ ఇనుప గాజులే కాళీమాత ప్రసాదంగా స్వీకరిస్తారు అక్కడికొచ్చినవారు. రితు, మోనూ, నాకు సరిపడే గాజులు వెతికాను. అప్పుడే సుమీత గుర్తుకొచ్చింది. ఇంటి నుంచి బయల్దేరేటప్పుడు ప్రత్యేకంగా గుర్తు చేసిందాయే, తప్పకుండా తనకోసం కాళీ మాత గాజులు తీసుకురమ్మని చెప్పింది. గాజులు కొని, పూజాసామాగ్రి బుట్టలో వేస్తూ, అతనికేసి ఓరకంట చూసాను. అతను ఇంకా ఉద్విగ్నంగానే పచార్లు కొడు తున్నాడు.

శామ్యూల్ని బయటే వదిలేసి మేమిద్దరం గుళ్ళోకి ప్రవేశించాం. లోపల దర్శనానికి పెద్ద క్యూ ఉంది. మేము మెల్లిమెల్లిగా క్యూలో ముందుకు సాగాం. మేము కాళీ మాతను చేరుకోబోతున్నాం. జగన్మాత కాళీ ముందర పది సెకండ్లు కూడా నిల వడం అసంభవంగా ఉంది. చాలా భయంకర రూపంలో ఉంది ఆ తల్లి. నల్లని ముఖంలో ఎర్రటి నాలుక బయటికి చాచి తెల్లటి కనుగుడ్లు మెరుస్తుంటే, శరీ రంలో వణుకు పుట్టింది. ఆ తల్లిని మన సార స్మరించుకోకముందే, గుడి సిబ్బంది భక్తుల్ని ముందుకు తోసేస్తూనే ఉన్నారు. ఎంతగా తోసేస్తున్నా ఆ ఉగ్రరూపిణిని రెప్పలార్పకుండా వీలైనంతసేపు చూస్తూనే గర్భగుడిలోంచి బయటికి వచ్చాం. ఆరుబ యటకు రాగానే అక్కడ ఒక పురోహితుడు చెప్పాడు- "మనోవాంఛ సిద్ధించడానికి దారం కట్టదలచుకుంటే, అక్కడ చెట్టుకొ మ్మకి కట్టొచ్చు" ఎదురుగా ఉన్న చిన్న చెట్టును చూపించాడు. దానికొమ్మలకి రంగురంగు దారాలు ఎక్కడ చూసినా కట్టి ఉన్నాయి.


"ఏం చేయాల్సి ఉంటుంది? " నేను పురో హితుడ్ని అడిగాను.

"ఈ దారం తీసుకోండి. మనసులోని కోరికలు తలుచుకుని, కాళీమాతను స్మరిస్తూ ఒక కొమ్మకి కట్టండి"

"కట్టాక? "

"కోరిక నెరవేరాక వచ్చి ఆ దారాన్ని విప్పేయండి" పురోహితుడు చెప్పినట్టుగా దారం తీసుకుని వెళ్లి, బాగా గుర్తుండి పోయే స్థలంలో కొమ్మకి కట్టాను.

ఆ తర్వాత మేము గుళ్లోనుంచి బయ టికి వచ్చాం. మమ్మల్ని చూస్తూనే శామ్యూల్ ముఖం విచారంగా మారిపో యింది. ముఖద్వారంలోంచి బయట అడుగు పెడుతున్నప్పుడు, నేను దూరంగా అతణ్ణి గమనించాను. అతను అప్పుడు మామూలుగానే ఓ పురోహితుడితో ఏదో అడుగుతున్నాడు. మరి మమ్మల్ని జంటగా చూడగానే మొహం విచారంగా పెట్టేశాడే మిటీ? అతని విచారాన్ని గ్రహించడానికి నేను వెనక్కి తిరిగి చూపుల్తోనే ఎందుకు



డల్‌గా ఉన్నావని అడిగాను. సత్యేన్ కాస్త ముందు ముందుగా నడుస్తున్నారు. ఆయన మెడలో పూలదండ, నుదుటిమీద సిందూర తిలకం మెరుస్తోంది. భార్యాభర్తలం పక్కపక్కన నడుస్తూ రావడం చూసి, బహుశ ఈర్ష్య పడ్డట్టున్నాడు. అందుకే ముఖం వాడిపోయింది. వాస్తవం తెలిసి కూడా అసూయ పడడం ఎంత మూర్ఖత్వం!

బయట రెస్టారెంట్‌లో టిఫిన్ చేసాక, టీ తాగుతుండగా, మావారు హఠాత్తుగా అడిగారు “దారంకట్టి ఏం కోరుకున్నావు? ” నేనేం చెప్పలేదు. కేవలం నవ్వి ఊరుకుండిపోయాను. ఆయన వాపోతూ మళ్లీ గట్టిగానే అడిగారు.

“అంత చెప్పకూడని కోరిక ఏముంటుంది, అది నేను వినకూడదా? ” తను రెట్టించి అడిగేసరికి, నేను విస్తుపోయి ఆయన ముఖంకేసి తదేకంగా చూసాను. ఇలాంటి సందర్భాల్లో ఇంతకు ముందెప్పుడు ఇలా ఆరాతీస్తూ అడగలేదు. అప్పుడే నా మస్తిష్కంలో, సత్యేన్ ఈ మధ్య అకారణంగా బాధపడిన సంఘటనలు మెదిలాయి.

సాధారణంగా శామ్యూల్ సమక్షంలోనే ఆయనేదో అశాంతికి గురవుతున్నట్టు అనిపిస్తుంది. బహుశ మావారికి తన అధికార స్థావరంలోకి అతను అనధికారికంగా ప్రవేశిస్తున్నాడన్న అనుమానం మొలకెత్తిందేమో? అందుకే ఇంతగా పట్టుబట్టి అడుగుతున్నాడేమో, నేనేం కోరుకున్నానని.. దాంతో శామ్యూల్కి నన్ను ఉడికించే అవకాశం దొరికి, అతను కూడా సత్యేన్ వాక్యాన్ని యథావిధిగా అదే స్టైల్లో రిపీట్ చేసాడు.

“అంత చెప్పకూడని కోరిక ఏముంటుంది.. అది మేము వినకూడదా? ”

అతని వెటకారానికి నాకింకా ఒళ్లు మండింది. ముగ్గురం అక్కడ్నుంచి కదిలి, నడుస్తూనే ముందుకు సాగాం, ఎవరి మానాన వాళ్లం కిమ్మనకుండా. ఇద్దరూ ఒకటయి నన్ను ఏడిపిస్తున్నట్టు నా మనసు కలుక్కుమంది.

రోడ్డుమీద నడుస్తోంటే, దారి పొడవున పురుషులకంటే స్త్రీలే ఎక్కువగా కనిపిస్తున్నారు. సాదాసీదా దుస్తులే ధరించారు. ఇక్కడి వాళ్లంతా తక్కువ మూర చీరలు కట్టేలా ఉన్నారు. ఎవరి హడావుడిలో వాళ్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. దారి పొడవునా ఫుట్‌పాత్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. అక్కడక్కడ బగ్గీలపైన చేపల వేపుళ్లు, చేపల పులుసుతో అన్నం కూడా రోడ్డుమీదే అమ్ముతున్నారు. బెంగాల్‌లో చేపల మాంసం చాలా ప్రసిద్ధి. రకరకాల చేపలు అక్కడ దొరుకుతాయి. ఎక్కడ చూసినా జనం కోలాహలమే.

రోడ్డుకు అవతలివైపు బిర్లా ప్లానెటోరియం ఉండడంతో మావారు కొద్దిగా ముందు ముందు నడుస్తూ రోడ్డు దాటేశారు. వాహనాలు అడ్డు రావడంతో మేమిద్దరం కొంచెం వెనకబడి పోయాం. నేను మావారి వంక చూస్తూ రోడ్డు దాటబోతుంటే హఠాత్తుగా ఓ కారు దూసుకొచ్చింది. త్రుటిలో అది నన్ను ఢీ కొనేది,

సమయాస్ఫూర్తితో శామ్యూల్ వెనక నుంచి చటుక్కున నా చెయ్యి పుచ్చుకుని వెనక్కి లాగాడు. లేకుంటే ప్రమాదం సంభవించేదే. అది మామూలు సంఘటనే అయినా అతను నన్నెంతగా కనిపెట్టుకుని ఉంటున్నాడనే దానికి నిదర్శనం. నా హృదయం ద్రవించింది.

బహుశా ఇలాంటి చర్యలే నన్ను అతనికి చేరువ చేస్తూ, మెల్లిమెల్లిగా మా వారికి దూరం చేస్తున్నాయేమో అనిపించింది.

అడుగులు లెక్క పెడుతున్నట్టుగా మేము రోడ్డుదాటి, బిర్లా పానెటోరియం చేరుకున్నాం. మాకంటే ముందే బుకింగ్ కౌంటర్ చేరుకుని మావారు టిక్కెట్లు కొన్నారు. అప్పుడు ఇంగ్లీషు షో సమయం. మేము ముగ్గురం ప్లానెటో రియం ఏయిర్ కండిషన్డ్ హాల్లోకి ప్రవే శించాం. నక్షత్రాల కూటమి సహజ ప్రకృతి సౌరమండలంలా గోచరిస్తోంది. ప్రదర్శనలో ప్రతీ దృశ్యాన్ని కళ్లకు కట్టినట్టు విశ్లేషిస్తూ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తూ, విచిత్రంగా తోచింది.

రెండున్నర గంటల ప్రదర్శన చూసి మావారి మనస్సు తేలిక పడ్డట్టుంది, సహ జంగా కనిపించారు. ఆయన సాధారణ స్థితికి చేరుకోవడంతో నా మనస్సుకు కూడా ఊరట కలిగింది.

చీకటి పడుతూనే రోడ్డుమీద నియాన్ లైట్లు వెలిగాయి. మేము నేరుగా హోటల్ గది చేరుకున్నాం. ఆ రోజు కూడా కాలిన డక ఎక్కువయి బాగానే అలసిపోయాం. ఫ్రెష్ అయ్యాక ముగ్గురం టీ తాగాం. భోజనం చేశాకే అతను తన రూంకి వెళ్ళి పోతాడు. అప్పటిదాక పొద్దంతా చూసిన ప్రాంతాల విశ్లేషణ కొనసాగుతుంది. ఎవ రికి తోచిన రీతిలో వాళ్లం ఏకరువు పెడతాం.

ఆ మాటల మధ్యలో అతను హఠా త్తుగా అడిగాడు. "ఏమిటీ, నేను హిందు వుని కాలేనా? " అతని ప్రశ్నకి మావారు, నేను బిత్తరపోయి చూస్తూ ఉండి పోయాం. ఏం జవాబు చెప్పాలో తోచ లేదు. ఉన్నట్టుండి అతనికి ఈ ఆలోచన వచ్చిందేమిటీ?

మమ్మల్నీ ఆట పట్టించడానికి అలా అడి గాడని మావారు మరింత తీవ్రంగా ఆలో చనలో పడ్డారు. నేను విషయాన్ని రూఢీ పరుచుకోవడానికి అడిగాను.

"మీరెందుకు హిందువు కావాలనుకుం టున్నారు? "

"ఊరకనే, మనస్సుకు అలా అనిపి స్తోంది" అతను చెప్పాడు.

"అదే ఎందుకని అలా అనిపిస్తోంది. ఏదో కారణం ఉండే ఉంటుందిగా? " నేను తరిచి తరచి అడిగాను. కారణం ఏం చెబు తాడో వినాలని కుతూహలంగా ఉంది.

"నా ముఖం చూసి చాలా మంది నన్ను హిందువనుకుంటారు" అని చెప్పి, తనే మళ్లీ అడిగాడు-

"ఏమిటీ, నా ముఖం క్రిస్టియన్‌లా అని పించదా? "

"లేదు. బొత్తిగా అనిపించదు. మీరు పూర్తిగా హిందువులాగే కనిపిస్తారు"

సత్యేన్ ఏదో అనబోయే లోపునే నేను అనేశాను. అతని తెల్లని రూపం తేలిక

పాటి నీలికళ్లు, కోలమొహం, పల్చటి పెద వులు కొంచెం భిన్నంగానే కనిపిస్తాయి. వాస్తవం వ్యక్తం చేయలేకపోయాను. అయినా ఇంతకూ హిందువు కావాలని కోరిక ఎందుకు కలిగినట్టు? మా వెంట తిరుగుతుంటే ఏదైనా వెలితిగా అనిపి స్తుందా ఏమిటీ? అతనికి సంతృప్తి కలి గించే జవాబు చెప్పలేక, మావారు సౌర మండలం ప్రస్తావన లేవదీసారు. విషయం పక్కదారి పట్టినందుకు నాకు ఊరట కలిగింది.

కోల్‌కతా పర్యటనలో మూడు రోజులు ఇట్టే గడిచిపోయాయి. అస్తమానం మావారు నన్ను అంటిపెట్టుకుని ఉండ డంతో, అతని పప్పులు ఉడకలేదు. అందుకే తిరుగు ప్రయాణంలో రాంచీలో ఒకరోజు ఆగుదామని చెప్పాడు. అక్కడైనా కలిసివస్తుందేమోనని ఆశేమో?

"అక్కడెందుకు? "

"రాంచీలో నా మిత్రుడు కుమారన్ ఉంటాడు. అతణ్ణి కలిసినట్టు ఉంటుంది. రాంచీ కూడా చూసినట్టు అవుతుంది"

మావారి వంక అభ్యర్థనగా చూస్తూ చెప్పాడు.

"మరీ, నేనింకా సెలవు పొడిగించుకో లేను. మా ఆఫీసర్ ఒప్పుకోరు" అని అన గానే, "ఒకటి రెండ్రోజులేగా.. అక్కడ హుండ్రూ ఫాల్స్ ఉంది. సన్‌రైజ్ పాయింట్ ఉంది. మరికొన్ని చూడదగ్గ ప్రదేశాలున్నాయి. పైగా నా మిత్రుడు కూడా చాలా రోజులుగా రమ్మని కబురు చేస్తున్నాడు. ప్లీజ్, ఒకరోజు ఆగి వెళ్దాం" అతను దీనంగా యాచిస్తున్నట్టుగా చెప్పాడు. ఇంకా నాతో కలసి తిరగాలన్న అభిలాష అతనిలో మెండుగా ఉన్నట్టుంది. నేను కరిగిపోయాను. కానీ అతనికి వంత పాడే స్థితిలో లేను. మావారిని ఒప్పించే ధైర్యం లేదు. కొద్దిసేపు మౌనంగా ఉండి పోయాను. నాలో అలజడి మొదల యింది. చూద్దాం ఆయన ఏం నిర్ణయం తీసుకుంటారోనని నిరీక్షించాను.

మావారి మౌనం అర్ధాంగీకారమైంది. అతని అభ్యర్థన కాదనలేకపోయారు.



రైలు రాంచీ చేరుకుంది. మేము లగే జీతో స్టేషన్ బయటకి వచ్చాం. ఇక్కడ కూడా జనం బాగానే ఉన్నారు. వాతావ రణం చల్లగా ఉంది.

శామ్యూల్ కేసి చూస్తూ అడిగాను, "ఇక్కడ ఎప్పుడు చల్లగా ఉంటుందనే బ్రిటీ ష్‌వాళ్లు రాంచీని వేసవిలో బీహార్ రాజ ధాని చేశారా? "

"వాస్తవానికి రాంచీ వేసవిలోనూ ఇంతే చల్లగా ఉంటుంది. హాటియా ప్రాంతంలో పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో ఇప్పుడు వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగింది"

ఇక్కడ అతను రెండేళ్లు ఉన్నాడట. అప్పుడే కుమారన్‌తో స్నేహం ఏర్పడింది.

మేము టాక్సీలో కుమారన్ ఇల్లు చేరు కున్నాం. కాలింగ్‌బెల్ నొక్కగానే, ఓ పొడ వాటి వ్యక్తి వచ్చి తలుపు తెరిచాడు. కొద్దిగా బట్టతల ఉందాయనకి.

"ఇతనే కుమారన్!" శామ్యూల్ మాకు పరిచయం చేసాడు. ఆయన మాకు నమ స్కారం చేసి, మావారిని హుషారుగా కౌగ లించుకుని పలకరించాడు. బహుశా

మేము కోల్‌కతా నుంచి బయల్దేరేముందు మా గురించి ఫోన్‌లో చెప్పినట్టున్నాడు.

"మీరు లోపలికి పదండి" అంటూ ఆయన శామ్యూల్ని ఆలింగనం చేసుకున్నాడు. ఆయన ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. బహుశా చాలారోజుల తర్వాత పాత మిత్రుడ్ని కలుసుకున్న ఆనందమేమో?

కుమారన్ ఇంటిముందు రకరకాల పూలతోట్లు, మల్లెతీగలు, చెట్లతో పరిసరమంతా పచ్చగా ఉంది. నిజానికి దక్షిణ భారతీయులు పూలకి చాలా ప్రాధాన్యం ఇస్తారు. మహిళలు తరచూ సిగలో పూలు తురుముకుంటారు. కొప్పునిండా మల్లెలతో గుబాళిస్తూ ఉంటారు. మద్రాసీలు ఎక్కువగా సిల్కుచీరలు చుట్టుకుని, చక్కటి కట్టుబొట్టుతో ఆకర్షణీయంగా కనిపిస్తారు.

ఇంట్లోకి ప్రవేశించగానే కుమారన్ భార్య సులభ చాలా ఆత్మీయంగా పలకరించింది. దక్షిణ భారతీయ సంప్రదాయపు కట్టుబొట్టులో ఆకర్షణీయంగా ఉంది. కంచి పట్టుచీరలో కుందనపు బొమ్మలా ఉంది. నా చెయ్యి పట్టుకుని ప్రేమగా లోపలికి తీసుకెళ్లి ఇల్లంతా చూపించింది. ఇల్లు శుభ్రంగా నీటుగా సర్ది ఉంది.

సులభకి ముగ్గురు పిల్లలు. ఇద్దరు పిల్లలు కాస్త పెద్దగా ఉన్నారు. ఒక్కడు చిన్నవాడు. పెద్ద పిల్లలిద్దరూ వచ్చి నన్ను అతుక్కుపోయారు, ఎంతో పరిచయం ఉన్నట్టు.

చిన్నోడు ఊయలలో పడుకున్నాడు.

ఫలహారాలు చాలా రుచిగా ఉన్నాయి. ఇడ్లీ, సాంబారు, చెట్నీ, అల్లం పచ్చడి

బ్రహ్మాండంగా ఉన్నాయి నాకు. మా వారికీ బాగా నచ్చాయి. ఇడ్లీ తినగానే వేడి వేడి దోసెలు, బంగాళదుంప వేపుడుతో తెచ్చి పెట్టింది. కోల్‌కతా చేపల పులుసుతో కంపుకొట్టుకుపోయిన నోరంతా, ఆ కమ్మటి వాసనతో శుద్ధమైపోయింది. ఇంత రుచికరమైన వంటకాలు నేనెప్పుడు తినలేదు. మావారు కూడా సంబరపడిపోయారు. శామ్యూల్ మాత్రం మామూలుగానే తింటున్నాడు. బహుశా కుమారన్‌తో పాటు లోగడ ఆ వంటకాలు బాగా రుచి చూసే ఉంటాడు. అందుకే అతను ఏమంత మురిసిపోతూ తినడంలేదు.

ఎక్కువగా అల్లం పచ్చడితోనే ఇడ్లీలు తిన్నాడు. టిఫిన్ చేసాక సులభ మాకు మద్రాసీ స్టైల్లో స్టీలు గిన్నెలో వేడి వేడి పొగలు చిమ్మే కాఫీ గ్లాసులు ఇచ్చింది. కాఫీ ఎంత కమ్మగుందో చెప్పలేం. నాలుక పావనమైపోయింది. ఆ తర్వాత సులభ మధ్యాహ్నం భోజనం సిద్ధం చేయడానికి పూనుకొంది. లంచ్ తర్వాత హుంద్రూ ఫాల్స్ చూడటానికి వెళ్లాల్సి ఉంది. సులభకి సహకరించడానికి నేను కూడా వంటగదిలోకి వెళ్లాను.

“ఏమైనా పని నాక్కూడా చెప్పండి” అడిగాను.

“వద్దొద్దు. మీరు కూచోండి. నేను కాసే పట్లో చేసేస్తాను” ఆమె గొంతు చాలా మధురంగా ఉంది. తమిళం, హిందీ మిశ్రమంతో తియ్యదనం ఉట్టిపడుతోంది.

“మీరు కవితలు రాస్తారు కదూ? ” ఆమె హఠాత్తుగా అడిగింది.

“మీకెలా తెలుసు? ”

“శామ్యూల్ మీ గురించి ఒకసారి ఉత్తరంలో రాసారు”

అది విని నాకు ఒళ్లు మండింది. అయితే నా గురించి తన స్నేహితులతో ప్రస్తావిస్తున్నాడన్నమాట. ఏమేం చెప్పుకు తిరుగుతున్నాడో?

“మీరు కామ్‌గా ఉండిపోయారేమిటీ? నా మాటలు మిమ్మల్ని బాధపెట్టాయా? ” ఆమె చిన్నబుచ్చుకుంటూ అడిగింది.

“లేదే? ”

“శామ్యూల్ మీ గురించి చెడుగా ఏమీ చెప్పలేదు. మిమ్మల్ని, మీ వ్యక్తిత్వాన్ని పొగుడ్తూనే రాసారు” అని చెప్పగానే నా పెదవులపై చిరునవ్వు విరిసింది. పోనీలే బతికించాడు. ఇక నయం మా సంబంధం గురించి చెప్పలేదనుకుని దీర్ఘంగా నిట్టూర్చాను.

నేను వెంటనే టాపిక్ మార్చడానికి “మీరెప్పుడైనా మా భాగల్‌పూర్‌కు రండి. అక్కడి విక్రంశిలా చాలా చూడదగ్గ ప్రదేశం. ఇక్కడికి దగ్గరే”

“ఎక్కడ వీలుపడుతుంది? కేవలం సెలవుల్లోనే కుదురుతుంది. ప్రతీ సెలవులకి పుట్టింటికో, మెట్టినింటికో వెళ్లాల్సి ఉంటుంది. చూస్తాను, వేసవి సెలవుల్లో కుదిరితే వస్తాం” సులభ చెబుతుండగానే, హాల్లోంచి శామ్యూల్ గొంతు వినిపించింది.

“మీరు కాస్త తొందరగా కానివ్వండి. సమయమంతా వండడానికి, తినడానికే సరిపోతుంది, తిరగడానికెప్పుడు వెళ్తాం? ”

"వంట తయారయిపోయింది. ఇక వడ్డించడమే తరువాయి" సులభ వాళ్లకి వినిపించేలా బిగ్గరగా చెప్పింది.

భోజనాల తర్వాత జీపులోకి సామాను సర్దాం. బ్లాంకెట్, కాఫీ థర్మాస్, నీళ్ళబాటిళ్లు, పళ్లబుట్ట, బిస్కెట్ పాకెట్లు, మ్యూజిక్ సిస్టం, అవసరమైన వస్తువులన్నీ తీసుకున్నాం. సులభ త్వరత్వరగా సిద్ధమవుతూ తన చంటిపిల్లాడ్ని కూడా తయారు చేసింది. నేను పసివాణ్ణి ఎత్తుకున్నాను. చాలా ముద్దొస్తున్నాడు. మిగతా ఇద్దరు పిల్లలు సంతోషంగా గంతులేస్తూ వెళ్లి జీపులో కూచున్నారు. అది అద్దెజీపు.

హుంద్రూ ఫాల్స్ సమీపంలో ఒక సమతల ప్రదేశం ఎంచుకుని బ్లాంకెట్ పరిచాం. సామానంతా దింపి మేము అటూ ఇటూ తిరుగుతూ హుంద్రూ ఫాల్స్ దృశ్యం తిలకించసాగాం. అలౌకిక దృశ్యం.. ఎత్తైన కొండ పైనుంచి జాలువారుతున్న నీటిధార తెల్లటి నురుగులా ఏకధాటిగా, లయబద్ధంగా పడుతోంది. హోరెత్తే శబ్దంతో బురుజు చిమ్ముతూ సెలయేరు గలగలా ప్రవహిస్తోంది.

"ఇప్పుడేమంత ఉద్ధృతి లేదు ఫాల్స్‌లో. వర్షాకాలంలో చూడాలి దాని విశ్వరూపం. ఇప్పుడు కొండపై ఊట తగ్గింది. ప్రవాహం కూడా అంతంత మాత్రంగానే ఉంది" కుమారన్ చెప్పారు.

సత్యేన్, కుమారన్ కలిసి నీటి ప్రవాహాన్ని తదేకంగా చూస్తున్నారు. కుమారన్ ఆయనకు గైడ్‌లా అంతా వివరిస్తున్నాడు. సులభ తన పిల్లల్ని సంబాళిస్తోంది. శామ్యూల్ నాకు చేరువలో నిలబడి అక్కడి ప్రాముఖ్యాన్ని ఏకరువు పెడుతున్నాడు. ఆ ప్రకృతి సౌందర్య దృశ్యం చెంత నా సాన్నిధ్యం నిరాటంకంగా లభించడంతో అతను సంతోషంగా కనిపిస్తున్నాడు. గడిచిన నాలుగు రోజుల వెలితి మరిచిపోయాడు. అతని కళ్లు మెరిసిపోతున్నాయి. అతని కళ్లల్లో తేలియాడుతున్న ఆశ, ఆనందం చూస్తుంటే నాకు భయం వేసింది. ఒకవేళ నేనతనికి అందుబాటులో ఉండలేకపోతే, ఆ బాధను తట్టుకోగలడా?

సాయంత్రం టీ తాగేవేళకి అందరం ఒకచోట చేరిపోయాం. పళ్ళు, బిస్కెట్లు, వెంట తెచ్చిన పదార్థాలు తిని, థర్మాఫ్లాస్క్‌లోని వేడి వేడి కాఫీ తాగాం. చీకటి పడుతుండగా సామానంతా సర్దుకుని తిరుగు ప్రయాణం కట్టాం.

మేము నగరం చేరుకునేసరికి చీకటి కమ్ముకుంది. రోడ్డుపై నియాన్ లైట్లు వెలిగాయి. జీపు వేగంగా దూసుకెళ్తుంటే చల్లగాలి తగులుతోంది. వర్షం కురిసేలా ఉంది. శామ్యూల్ ముందు సీట్లో కూర్చుని, డ్రైవర్ సీటుపైకి తన చెయ్యి చాపిపెట్టి ఏదో ఆలోచనలో పడ్డాడు. జీపులో డ్రైవర్ వెనకాల సీటులో నేను కూచుని ఉండడంతో, అనుకోకుండా నా చెయ్యి శామ్యూల్ చేతిమీద పడింది. ఒక్కసారిగా నా ఒళ్లు జలదరించింది. ఆహా.. ఏమి హాయి, యీ రేయీ.. అతని చేతి స్పర్శకి నా తనువు పులకించింది. ఎవరి దృష్టిలో పడకుండా ఆ మధుర క్షణాల అనుభూతి, యుగయుగాల సుఖానుభూతిని ప్రాప్తింపచేసింది. ఎవరికి తెలుసు ఈ సుఖాల పరిభాష? ఎవరు పొందారు ఈ సుఖవైభవం? సుఖమంటూ ఉంటే, ఈ మధుర క్షణాల్లోనే ఉంది. దాన్నే పొందుతున్నాను. ఆ చల్లగాలిలో, చీకటి ముసుగులో.. ఇదే సుఖం. అదే అమర సుఖం అనిపించింది ఆ నిమిషంలో.

అదేరోజు రాత్రి బండికి రాంచీ నుంచి బయల్దేరాం. ఇల్లు చేరుకున్నాక తెలిసింది, పొరుగింటి సుమీత పుట్టింటికి వెళ్లిందని. కొద్ది రోజులపాటు నిశ్చింతయిపోయింది. ఆమె ఉండివుంటే టూర్ విశేషాలన్నీ

# మనస్తత్వ విశ్లేషణకు పట్టం!



**శ్రీమతి ఆశా ప్రభాత్**

బీహారి రచయిత్రి శ్రీమతి ఆశా ప్రభాత్ 1958లో పుట్టారు. ఆమె బీఏ చదివారు. ఉర్దూ, హిందీలో ఆమె మూడు నవలలు, ఒక కథల సంపుటి ప్రచురితమైంది. ప్రస్తుత నవల 'నేను-అతను' ఉర్దూలో పాకిస్తాన్ దినపత్రిక 'మంశూర్'లో సీరియల్‌గా వచ్చింది. బీహార్ ఉర్దూ అకాడమీ 1999లో ఆమెను 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సత్కరించింది. బీహార్ రాష్ట్ర పరిషత్తు నుండి 'సాహిత్య సేవా సమ్మాన్' సత్కారం పొందారు. 'ప్రేమ్‌చంద్ సమ్మాన్', 'దిన్‌కర్ సమ్మాన్', 'ఉర్దూ దోస్తీ సమ్మాన్' తదితర సన్మానాలను పొందారు. ఆమె రచనల్లో మనస్తత్వ విశ్లేషణ విస్తృతంగా ఉంటుంది.

చిరునామా : **శ్రీమతి ఆశా ప్రభాత్,** కోట్ బజార్, సీతామఢీ, బీహార్, పిన్- 843302

ఆరాలు తీస్తూ అడిగేది. పదేపదే ఉపదేశాలిచ్చి బుర్ర తినేస్తుంది. ప్రతి మనిషిలోనూ మిత్రుడు, శత్రువు దాగి ఉంటాడు. పసిగట్టాలంతే. ఖాళీ సమయాల్లో కవితలో, వ్యాసాలో రాసుకోక పనికిమాలిన వాళ్లతో కబుర్లేమిటని అంటూ ఉంటుంది. ఆమెకేం తెలుసు, శామ్యూల్ సాన్నిధ్యంతో నా జీవితంలో ఎంత ఉల్లాసం, ఉత్సాహం చోటుచేసుకుందో? ఆ ఉల్లాసంతో కన్ను మూసి తెరిచినట్టుగా నాలుగేళ్లు గడిచిపోయాయి. సంతోషపు రోజులు రెక్కలు కట్టుకుని ఎగిరిపోతాయి. వేగంగా దొర్లిపోతాయి.

శామ్యూల్ మొహం వాడిపోయి ఉంది ఇవాళ. అతను చిన్నగా వచ్చి సోఫాలో చతికిలబడ్డాడు. ముభావంగా, మౌనంగా ఉండిపోయాడెందుకో. అర్థం కావడంలేదు. ఏమైనా చెబుతాడేమోనని చాలా సేపు ఎదురు చూశాను. చివరకు ఓపిక సన్నగిల్లి నేనే అడిగాను.

"నువ్వెందుకంత డల్‌గా ఉన్నావు? "

అయినా అతనేం చెప్పలేదు.

"ఏమిటో చెప్పు? " విసుగ్గా అడిగాను.

"నాకు బదిలీ అయింది. రేపే బనారస్‌కు వెళ్ళాలి, జాయిన్ అవడానికి" అతను చెప్పగానే నా గుండె గుభేల్‌మంది. నివ్వెరపోయాను. ఇద్దరి మధ్య మౌనం ఆవరించుకుంది. అయ్యో, ఉన్నఫళంగా ఈ ఉపద్రవం వచ్చిపడిందేమిటీ? ఆనందంగా సాగిపోతున్న బతుకు మళ్లీ అగాధంలో పడిపోతోంది. అతను వెళ్లిపోతే, నేనెలా జీవించగలను.. అతను లేకుండా... ఎలా గడుస్తాయి రోజులు... ఒంటరి రాత్రులు... పొద్దు గడవక పగలంతా ఎడారయిపోతుంది. నా జీవనం నిరుత్సాహంగా, నిస్తేజంగా...

అయినా అతను వెళ్లిపోయాడు. అతన్ని ఎలా ఆపగలను? ఏ అధికారంతో? త్వరలో తిరిగొస్తానని చెప్పి వెళ్లాడు. కానీ ఎప్పుడొస్తాడు? ఎన్నడొస్తాడో, ఏ అంచనా లేదు. నిజం నిష్ఠూరంగానే ఉంటుంది. అది ఇప్పుడు అర్థమవుతుంది. దుఃఖాన్ని అదిమి పట్టినకొద్దీ కన్నీళ్లు ఉబికి వస్తున్నాయి. ఆ దుఃఖాన్ని ఎవరికీ చెప్పకోలేను, అదుపు చేసుకోనూ లేను. ఇది ఎలాంటి రూపంగల ప్రేమో అర్థం కావట్లేదు. అంతరంగ ప్రేమ అంతరంగాన్నే కుదిపేస్తుంది. నా ఆత్మ విలవిల్లాడిపో

తోంది.

అంతటా స్తబ్దత ఆవరించుకుని ఉంది. భయానకంగా కాదు, సుఖరహితంగా...

ఆకాశంపై నుంచి పూర్ణశుక్లపక్ష చంద్రుడు తన వెన్నెలతో భువిని తడిపేస్తున్నాడు. కిటికీ దగ్గర కూచుని మా వారు తన పర్యటన అనుభూతిని వివరిస్తున్నారు. నన్ను ముభావంగా చూసి అడిగారు, "ఏం ఆలోచిస్తున్నావు ముక్తా? "

"ఏమీ లేదండి"

"వెన్నెల రాత్రి గురించి ఆలోచిస్తున్నట్టున్నావు. ఏమైనా రాయాలనిపిస్తోందా? "

"అవును"

"కొద్దిగా ఇటు రా, కిటికీ దగ్గరకు. చూడు, ఈ వెన్నెల రాత్రిలో నిండుచంద్రుడు ఎంత ముద్దుగా ఉన్నాడో" అంటూ నా చెయ్యి పట్టుకుని కిటికీ దగ్గరకు లాగారు. ఆ వెన్నెలను, ఆ నిండు చంద్రుడ్నే నేను చూడదలచుకోలేదు. నా స్మృతి పథంలో మెదులుతున్న పున్నమి చంద్రుడు వేరే ఉన్నాడు. చెప్పాలనుకుని కూడా మావారితో ఏమీ చెప్పలేకపోయాను. ఇవాల్టికి అతను వెళ్లి నెలయింది. ఈ నెల్లాళ్లలో నాకేది ఉత్సాహంగా, ఉల్లాసంగా తోచడంలేదు. నాలుగేళ్లలో మేమెంత చేరువయ్యామో, ఈ ఒక నెల ఎడబాటుతో అర్థమవుతోంది. ఒకవేళ మళ్లీ కలుస్తామో లేదోనన్న దిగులుతో పెద్ద వెలితిగా ఉంది. అది వ్యక్తంచేసే పదాలు తోచడంలేదు.

గత నాలుగేళ్లుగా అతనే నాకు సర్వస్వం అయిపోయాడు, జీవితంలోని మాధుర్యాన్ని చవిచూడ్డానికి. జీవితం అగమ్యగోచరంగా ఉన్న దశలో అతని పరిచయం లభించింది. ఒకవేళ అతను పదేళ్ల ముందు కలిసి ఉంటే? లేదు... లేదు... ఇలా ఆలోచించడం తప్పేమో? అతనితో పదేళ్లు గడిపాక కూడా ఏ వెలితి కలగకపోతే, అప్పుడు ఆ అభిప్రాయానికి రావాలి. మరి సత్యేన్ లాంటి భర్త ఉండగా పరపురుషుడి ఆకర్షణకి గురయ్యే

## తొలి అనువాద నవల




### కర్నాటి నాగభూషణం

నా గురించి పెద్దగా చెప్పుకోదగ్గ అంశాలేమీ లేవు. ప్రస్తుతం పదవీ విరమణకు చేరువవుతున్న కేంద్ర ప్రభుత్వ చిరు ఉద్యోగిని. నిజాం పాలనలోని కింగ్‌కోఠీ ప్రాంతానికి చేరువలో పుట్టి, పెరగడంవల్ల ఉర్దూ, హిందీ భాషలు ఒంటబట్టాయి. 'విపుల' మాసపత్రిక చూశాక అనువాదం పట్ల ఆసక్తి కలిగి, మొదటి ప్రయత్నంగా ఓ హిందీ పత్రిక నుంచి అనువదించిన 'వదినా' అనే కథ పంపాను. 1979లో జనవరి సంచికలో అది ప్రచురితమవ్వడంతో అచ్చులో నాపేరు చూసుకోవడం మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రాస్తూనే ఉన్నాను. పెద్దగా చదువుకోకున్నా చతుర-విపుల అప్పటి సంపాదకులు చలసాని ప్రసాదరావుగారు అనువాద రచనలకు సంబంధించి ఎన్నో మెళకువలు తెలియజేశారు. వారి ప్రోత్సాహంతో అనేక కథలను 'విపుల'కు అనువదించి ఇచ్చాను. ప్రస్తుతం నేను అనువదించిన తొలినవల ఆశా ప్రభాత్ 'నేను-అతను' 'చతుర'లో ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు.

**చిరునామా: కర్నాటి నాగభూషణం,**
ఇంటి నెం. 3-5-1114/20/1, షంషీర్‌బాగ్, కాచిగూడ క్రాస్ రోడ్, హైదరాబాద్-500027

అగత్యం ఏమొచ్చిందో, సూటిగా చెప్పలేక పోయినా అతనొక మెరుపులా నా జీవితంలోకి ప్రవేశించాడు. ఒక మైకంలా కమ్ముకున్నాడు. అతని సాంగత్యంలో నాకో పరిపూర్ణత చేకూరింది. ఎక్కడా ఓ లోటు, ఏ వెలితీ లేదు. అతని ప్రేమలో ఉద్వేగం ఉంది. మాధుర్యం ఉంది. అతని ఆలింగనంలో సంతృప్తి ఉంది. ఆత్మ సంతృప్తి కలుగుతోంది.




**రెం**డునెల్ల తర్వాత అతనొచ్చాడు. ఇక్కడి ఫ్లాట్ ఖాళీ చేయడానికి సామానంతా ప్యాక్ చేయబడుతోంది. సుమీరన్ చూసొచ్చి చెప్పింది. కిటికీ దగ్గర నిలబడి సర్వస్వం కోల్పోయిన వ్యక్తిలా అటుకేసే చూస్తూ ఉండిపోయాను. అప్పుడే కాలింగ్‌బెల్ మోగింది. నాకన్నా ముందరే సుమీరన్ పరుగెత్తుకొచ్చి తలుపుతీసింది. శామ్యూల్ వచ్చి మౌనంగా సోఫాలో చతికిలబడ్డాడు. సుమీరన్‌కు టీ తీసుకురమ్మని చెప్పి నేను కూడా అతని పక్కనే ఉన్న మరో సోఫాలో కూచున్నాను. ఇద్దరి అంతరంగాల్లో తుపాను ఎగిసిపడుతున్న ఉద్వేగపు ఛాయలు ప్రస్ఫుటిస్తున్నాయి.

అయినా వెలుపల మౌనం ఆవరించుకుని ఉంది. మౌనానిక్కూడా ఒక పరిభాష ఉంటుంది. అతని మనసులో ఉప్పొంగుతున్న ఆర్ద్రత, ఆవేదన అతని కళ్ళ నుంచి నా కళ్లకి చేరుతోంది.

"ఈ మనిషి నిన్ను ఎక్కడికీ పోనివ్వడా?" మౌనాన్ని భగ్నం చేస్తూ చిన్నగా అన్నాడు. అతని గొంతు ధ్వని ఏదో బావిలోంచి వస్తున్నట్టు, బాధతో మూల్గినట్టుగా ఉంది.

"ఈ మనిషి అంటే ఎవరు?" నేను బొత్తిగా అర్థంకాక అడిగాను.

"అదే.. నీ భర్త. నిన్ను ఎక్కడికీ పోనివ్వడా?"

"ఎక్కడికీ పోనివ్వడా అంటే.. నాకు అర్థం కాలా?" అయోమయంగా అడిగాను. కానీ అతని ఆంతర్యం బోధపడింది. గడిచిన నాలుగేళ్లలో అర్ధకాలం నుంచే అతనికి ఎప్పుడో బదిలీ వేటు పడుతుందనే అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. అలాంటప్పుడు మన అనుబంధం తెగిపోకుండా, నాకు పోస్టింగ్ వచ్చిన చోటుకి నువ్వు వచ్చేయాలని అంటుండేవాడు. ఇవాళ అతను ఇక్కడ్నుంచి శాశ్వతంగా వెళ్లిపోతున్నాడు. అదే ఆరాటంతో అలా అంటున్నాడేమో.

"బనారస్‌కు నాతోపాటు వచ్చేయరాదూ..?" అభ్యర్థిస్తున్నట్టుగా మొహం పెట్టి అడిగాడు.

"అదెలా కుదురుతుంది? నా ఇల్లు, సంసారం.."

"అన్నీ నీవెంటే ఉంటాయి. మీకు అక్కడే ఇల్లు చూస్తాను. పిల్లలకు మంచి స్కూల్లో చేర్పిస్తాను. సత్యేన్‌గారు ఎలాగో ఎక్కువగా క్యాంపులకే వెళ్తారు కదా? అక్కడ్నుంచే వెళ్తొస్తూ ఉంటారు. ఇక నువ్వు చేయాల్సిందల్లా మీ వారిని ఒప్పించడమే.."

"అక్కడికి మారాల్సిన అవసరం ఏముందంటే, ఏం చెప్పనూ?"

"బనారస్‌లో బ్యాంకులోన్‌తో స్వెట్టర్ల

స్టిచింగ్ సెంటర్ తెరవాలనుకుంటున్నాను. అదేకాకుండా ఒక మాసపత్రిక కూడా ప్రారంభించాలని ఉంది. వాటికి సంబంధించిన వనరులన్నీ అక్కడ శామ్యూల్ సమకూరుస్తాడని చెప్పు"

"అమ్మో, చాలా పకడ్బందీగానే ఆలోచించావే" నేను విస్తుపోతూ అన్నాను.

"ఏదైనా పొందాలనుకున్నప్పుడు దానికి తగిన వనరులు, వసతులు కూడా ఏర్పాటు చేయాలి కదా? ఎట్టి పరిస్థితుల్లోనూ నేను నిన్ను వదులుకోదలచుకోలేదు" అతని ఆదుర్దా, తాపత్రయం చూస్తుంటే ఒకవైపు ఆనందం, మరోవైపు భయం పుట్టుకొస్తోంది. ఇది సాధ్యమేనా? మావారు ఒప్పుకుంటారా? ఆయన అనుమానించరా? అసలు అలా అడగడం ఎంతవరకు సమంజసం?

నేను ఆలోచనలో పడిపోవడం చూసి, శామ్యూల్ వెళ్ళేటప్పుడు మళ్లీ ఒకసారి గట్టిగా హెచ్చరించి వెళ్లాడు, ఎలాగైనా సత్యేన్‌ను ఒప్పించమని.

అయితే అతను వెళ్లిన కొన్నాళ్లకి అనుకోకుండా మా భాగల్‌పూర్ నగరంలో మత కలహాలు చెలరేగాయి. ఉద్రిక్త వాతావరణం ఆవరించుకుంది. ఎక్కడబడితే అక్కడ హత్యలు, దౌర్జన్యంతో నగరం అట్టుడికిపోతోంది. కర్ఫ్యూతో గృహనిర్బంధమైపోయి, జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కడ ఏమవుతుందో, ఎవరేమయిపోతున్నారో తెలియడంలేదు. అదృష్టవశాత్తు మావారు ఇంటిపట్టునే ఉన్నారు. ఇంట్లో ఉన్న సరుకులతోనే కాలం వెళ్లబుచ్చాల్సి వస్తోంది.

మూడు రోజుల తర్వాత కర్ఫ్యూను మూడు గంటలు సడలించారు. నిత్యావసర సరుకుల కోసం జనం బజారుకు పరుగులు పెట్టారు. నేను కూడా సరుకుల లిస్టు రాసి ఇచ్చి సుమీరన్‌ను బజారుకు పంపాను. పాల పాకెట్లతోపాటు ఒక పాలపొడి పాకెట్ కూడా తెమ్మన్నాను. నాకు టీ తాగనిదే సంతృప్తిగా ఉండదు.

ఆ కర్ఫ్యూ సడలింపుతో సత్యేన్ స్నేహితులిద్దరు మా ఫ్లాటుకి వచ్చారు, ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకోవడానికి. మావారికి వాళ్ళని చూడగానే ఎక్కడాలేని సంతోషం కలిగింది. ఆయనకు ఇంట్లోనే ఉండి ఉండీ విసుగు పుట్టింది. బయట జరిగిన ఉద్రిక్త పరిస్థితుల గురించి ఎవరికి తెలిసిన విషయాలు వాళ్ళు పరస్పరం చెప్పుకోసాగారు. సంభాషణ కొనసాగుతూ ఉండగానే హఠాత్తుగా సుమీరన్ పరిగెత్తుకు వచ్చింది.

"ఏమిటీ, ఏమయింది? " సత్యేన్ ఉలిక్కిపడుతూ అడిగారు. ఏదో ఘోరం జరిగినట్టుందని అందరూ వణికిపోయారు.

"సార్... సార్... మళ్లీ కర్ఫ్యూ విధించారు. పోలీసులు జనాన్ని తరిమికొడుతున్నారు" వగరుస్తూ చెప్పిందామె.

"ఇంకా గంట టైముందిగా సడలింపుకి? "

"ఎవరో మంత్రిగారు రాగానే జనం ఘెరావ్ చేశారటా. ఆ గుంపును చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జి చేశారట. దాంతో గొడవ పెరగగానే వెంటనే మళ్లీ కర్ఫ్యూ విధించారట. అంతటా ఉరుకులు, పరుగులు మొదలయ్యాయి" సుమీరన్

భయంతో వణికిపోతూ చెప్పింది.

"అయితే మేము కూడా పరిగెత్తాలి" అంటూ సత్యేన్ స్నేహితులు లేచారు.

వారి మొహాల్లో భయం ఛాయలు ప్రస్ఫుటించాయి. మా వారు వాళ్లను ఆప లేదు. బయటిదాకా సాగనంపడానికి వెళ్లారు. నాకు అంతా అయోమయంగా అనిపించసాగింది. ఏమిటీ ఈ గడ్డు పరిస్థితి? మనిషిమీద మనిషికి విశ్వాసం లేకుండాపోయింది. అకారణంగా ఒకర్నొకరు చంపుకోవడం, దాడులు జరపడం అవివేకం కాకపోతే మరేమిటీ?

వారం తర్వాత పరిస్థితి చక్కబడింది. అయినా ఆ వాతావరణం భయం తాలూకు ఛాయలు నగర జీవనం మీద ఆవరించుకుని ఉన్నాయి. జనజీవనం యథాలాపంగా సాగిపోతోంది. ప్రకృతి నియమం మేరకు దేనికోసం ఏదీ ఆగదు. మనం ఎంతటి ఆత్మీయుల్ని స్మశానంలో కడతేర్చి వచ్చినా, రాగానే కడుపు ఆకలితో నకనకలాడిపోతూనే ఉంటుంది. అవసరాలు అర్రులు చాస్తూనే ఉంటాయి.

మధ్యాహ్నం రైలుకు శామ్యూల్ వచ్చాడు. వస్తూనే నన్ను బాహువుల్లో బంధించేశాడు. అదే పరిపుష్టి అలింగనం. అతని బిగి కౌగిలిని ఒక్క ఉదుటున విదిలించేశాను.

"ఏమిటీ తొందర? వెనకాముందు చూసేది లేదా, ఎవరైనా చూస్తే ఎలా? " అంటూ సోఫాలోకి తోసేశాను అతన్ని. నేను కూడా పక్కనే కూచుండిపోయాను.

నా మాటలకి అతను నవ్వుతూ అన్నాడు, "నీ పొందు కోల్పోయి నేను పొందుతున్న బాధ నీకు తెలియడం లేదు. కర్ఫ్యూ మూలాన సత్యేన్ నీచెంతే ఉంటున్నాడు. ఆయన ప్రేమలో నన్ను మరిచిపోతున్నావు. సరిగ్గా ఫోన్ కూడా చేయడం



లేదు"

అతని ఫిర్యాదుకు నేను లోలోపలే నవ్వుకున్నాను. అతనిలోని ఈర్ష్య గుణం బయటపడింది.

వెంటనే అనాలనుకున్నాను- 'నువ్వేమయినా అవివాహితుడివా, నీక్కూడా భార్య ఉంది. ఆమె తోడు ఉంది? ' అని. అయినా అనలేదు. ఎందుకంటే, మేమిద్దరం మా భాగస్వాముల ఊసు ఎత్తొద్దని ముందే వాగ్దానం చేసుకున్నాం. నేను ఆ మాటమీద నిలబడదలిచాను. అతను అప్పుడప్పుడు వాగ్దానం మరిచిపోతాడు. పురుషుడు కదా, ఈర్ష్యా గుణాన్ని నియంత్రించుకోలేడు. స్వభావం బయటపడుతూనే ఉంటుంది. ఒక్కోసారి అతని



ఫిర్యాదు లక్షణం మధురంగా అనిపిస్తుంది. అత్మీయతా భావాన్ని దృఢత్వం చేస్తుంది.

"సరే ఈ ఫిర్యాదులన్నీ పక్కన బెట్టు, ఇప్పుడెలా ఉన్నావో చెప్పు?" చిలిపిగా చూస్తూ అడిగాను.

"అక్కడ ఉన్నానే తప్పా, నా ధ్యాసంతా నీమీదే. ఇక్కడి ఘర్షణలు తెలిసి మరింతగా కుంగిపోయాను. నాకు రెక్కలు ఉంటే ఎగిరొచ్చి నీ దగ్గర వాలిపోయే వాణ్ణే. ప్రయాణ సదుపాయాలన్నీ స్తంభించిపోయాయి. దిక్కుతోచలేదు నాకు"

"అవును. చాలా బిక్కుబిక్కుమంటూ గడిపాం. మళ్లీ అలాంటి గడ్డురోజులు రావద్దనే కోరుకుంటున్నాం"

ఆ రోజులు తలుచుకుంటేనే నా శరీరం వణికిపోతుంది.

అతను ఫ్రెష్ అవడానికి వెళ్లాడు. నేను వంట చేయడానికి పూనుకున్నాను. మావారు బజారుకు వెళ్లి చాలాసేపే అయింది. ఎక్కడ బాతాఖానీలో పడిపోయారో? అతను వంటగదిలోకి మళ్లీ ఒకసారి వచ్చి నన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు. ఎంతసేపట్నుంచో తల్లికోసం తల్లడిల్లిపోయే పిల్లాడిలా బిగ్గరగా, ఆత్రుతగా వాటేసుకున్నాడు.

ఎక్కడ మావారు తిరిగొచ్చేస్తారేమోనన్న భయంతో నేను వెంటనే అతని కౌగిలి

విదిలించి పక్కకి తోసాను. అతను తమాయించుకుని తన ప్యాంటు జేబులోంచి ఒక కవరు తీసి వణుకుతున్న చేతులతో నాకిచ్చాడు.

“ఏముంది ఇందులో? ”

“నీ అపాయింట్‌మెంట్ లెటర్. నిన్ను ‘సూత్రధారి’ పత్రికకు సహా సంపాదకురాలిగా నియమించారు. కొంతకాలం ఆ పత్రికలో అనుభవం గడించాక నీ సొంత పత్రిక ప్రారంభించొచ్చు. పైగా నువ్వు అక్కడికి మకాం మార్చడానికి ఇదొక వంక కూడా. మీ కోసం వేరే ఇల్లు కూడా అద్దెకు చూస్తాను. ఇక నువ్వు సత్యేన్‌ను ఒప్పించడమే తరువాయి”

“సరే. ప్రయత్నం మొదలుపెడతాను” అంటూ స్టవ్ దిక్కు మళ్లబోతుంటే, మళ్లీ ఒకసారి నన్ను తనవైపు లాక్కుని గట్టిగా కౌగిలించుకున్నాడు. ఆత్రంగా చెంపలమీద ముద్దాడాడు. దొరికిన అవకాశాన్ని వదులుకోవడం లేదు.

అంతలోనే కాలింగ్ బెల్ మోగింది. బహుశా మావారు వచ్చుంటారని గ్రహించి, నన్ను వదిలేసి, హాల్లోకొచ్చి సోఫాలో సర్దుకుని కూచున్నాడు.

నేను వెళ్లి తలుపు తెరవగానే “ఉఫ్, రోడ్డుమీద ఎక్కడ చూసినా ట్రాఫిక్ జామ్. సందులు, గొందుల్లోంచి తిరిగి తిరిగి వచ్చాను” అంటూ మావారు ఇంట్లోకి ప్రవేశించారు.

హఠాత్తుగా శామ్యూల్ కంట బడుతూనే “ఓహో మీరా, ఎప్పుడొచ్చారు? ” అడిగారు.

ఆ స్వరంలో ఆశ్చర్యంగానీ, సంతోషంగానీ ఏదీ లేదు.

సత్యేన్‌ను చూసి అతను కూడా నవ్వడానికి ప్రయత్నిస్తూ “ఎందుకు ట్రాఫిక్ జామయిందో? ” అన్నాడు.

“అదే, బట్టల మిల్లు కార్మికులు రోడ్డు మీద ధర్నా చేస్తున్నారు. దాంతో నాలుగు వైపుల రోడ్లు జామయిపోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. ధర్నాలు, ఊరేగింపులు రోడ్డునపోయే జనాల సమయం పాడుచేస్తాయి. దాంతో ఎవరికేం ఒరుగుతోందో గానీ జనం ప్రాణాలు మాత్రం తోడేస్తారు” చెబుతూ షర్టు బటన్‌లు విప్పసాగారు.

“ఎప్పుడు ఏదో గందరగోళం ఉండే ఈ నగరం ఎందుకు విడిచిపెట్టరు మీరు? ” శామ్యూల్ తక్షణమే అనేసాడు. ఉన్నట్టుండి తన అభిప్రాయం వ్యక్తంచేసే అదును దొరికింది.

“ఏ ప్రాంతంలో గొడవల్లేవు? ప్రతిచోట ఏదో ఒక అరాచకం జరుగుతూనే ఉంటుంది” సత్యేన్ అలా అనేసరికి, అతను కాస్త తటపటాయించాడు.

“గొడవలు అంతట ఉన్నా ఇంత డిస్ట్రబెన్స్ ఉండదు. ఇక్కడ ఎప్పుడు ఏ అరాచకం, ఆందోళన తలెత్తుందో ఊహించలేం. ఇక్కడ జరిగే దౌర్జన్యకాండలు చాలా దారుణంగా భయానకంగా ఉంటాయి. జనజీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. స్కూలుకు వెళ్లిన పిల్లలు ఇంటికి తిరిగొచ్చేదాక తల్లిదండ్రులకు భయం భయంగానే ఉంటుంది” అతను మెల్లిమెల్లిగా సర్ది చెప్పసాగాడు.

“అవును, అది కూడా నిజమే. ఈ మధ్య

ఒక వీధివాళ్లు మరో వీధివాళ్లను అనుమానిస్తూ గడుపుతున్నారు. ఎవరు ఎవరి మీద విరుచుకుపడేది కూడా అర్థం కావడం లేదు. ఏ క్షణాన ఉద్రిక్తత పరిస్థితి నెలకొంటుందో ఊహించలేకపోతున్నాం. దాంతో స్కూళ్ళు, కాలేజీలు మూసేస్తున్నారు. పిల్లల చదువులు పాడవుతూనే ఉన్నాయి"

"అందుకే, మీరు కాస్త నిదానంగా ఆలోచించండి. కొంతకాలం ఈ సిటీ వదలి చూడండి.. పిల్లలు కొంచెం పెద్దయ్యేవరకయినా" అని చెబుతూ అతను బాత్రూం లోకి వెళ్లాడు.

డైనింగ్ టేబుల్ దగ్గర ముగ్గురం మౌనంగానే ఉండిపోయాం. కేవలం గరిటెలు, పళ్లాల ధ్వనులు తప్ప, మరో చప్పుడు లేదు. అంత రుచికరమైన వంటకాన్ని కూడా ఎవరు మెచ్చుకోవడం లేదు.

చెయ్యి కడుకున్నాక చేతులు తుడుచుకుంటూ అతను చెప్పాడు, "కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు ట్రాన్స్‌ఫర్ చేయించాల్సి ఉంది. రేపు సాయంత్రానికి వెళ్ళిపోతాను"

"రేపు సాయంత్రం నేను కూడా వెళ్ళాల్సి ఉంది. ఇద్దరం కలిసే బయల్దేరుదాం" చెప్పారు మావారు.

డ్రాయింగ్ రూంలో దివాన్‌పైన అతనికి పక్క పరిచాను. దోమల బత్తి వెలిగించి ఓ పక్కన బెట్టాను. మంచినీళ్ల జగ్గు, టీపాయ్ మీద పెట్టాను. రాత్రిపూట అతనికేం ఇబ్బంది కలుగకుండా అన్నీ ఏర్పాటు చేశాను.

"మనం కూడా బనారస్‌కు మారితే బావుండనిపిస్తోంది" మా వారి పక్కన పడుకుని చిన్నగా అన్నాను.

"ఎందుకని? " ఠక్కున అడిగారాయన.

అంత కచ్చితంగా కూడా కారణం ఏమి చెప్పలేకపోయాను. కానీ శామ్యూల్ అభీష్టం నన్ను కలవరపరుస్తోంది. అందుకే మతకలహాల సాకుగా చెబుతూ భయాన్ని వ్యక్తం చేసాను.

"ఎప్పుడూ ఏదో ఒక ఆందోళనతో ఈ ప్రాంతం అశాంతిగా ఉంటుంది. భయం భయంగా గడపాల్సి వస్తుంది. గొడవలు జరిగినప్పుడు పిల్లలు కూడా భయపడుతున్నారు"

"ఇంతకుముందు కూడా లోగడ ఎన్నో సార్లు మతఘర్షణలు జరిగాయి. అప్పుడు నువ్వు ఎక్కడికీ వెళ్లిపోదామని అనలేదే? ఇప్పుడు నువ్వు శామ్యూల్ మాటలు పట్టుకొని మారుదామంటున్నావు" కొంచెం తీక్షణంగా చూస్తూ అన్నారు.

"రాను, రాను ఘర్షణలు ఎక్కువ అవుతున్నాయి. లోగడ ఇంత ఉద్రిక్తంగా గొడవలు జరిగేవి కావు"

"అయితే ఏమయింది? కొన్నాళ్లుపోతే అవే సర్దుకుంటాయి. పరిస్థితులు ఎప్పుడు ఒకలా ఉండవుగా? "

"ఏమోనండీ, నాకీ మధ్య భయంభయంగా ఉంటుంది. మీరు క్యాంపుకు వెళ్లినప్పుడు, ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. కొన్ని రోజులు స్థలం మారి చూద్దాం!"

మావారు మౌనంగా ఉండిపోయారు! నేను కూడా ఆలోచనలో పడిపోయాను. ఆయన చెప్పేది కూడా వాస్తవమే. ఇంతకుముందు కూడా ఎన్నోసార్లు మతఘర్షణలు జరిగాయి. అప్పుడెప్పుడు నగరం మారాలన్న ఆలోచన రాలేదు. ఏదో సంకల్పం రాగానే అది నెరవేర్చుకొవాలన్న తపన మొదలయింది. ఒకవేళ శామ్యూల్ బనారస్ వెళ్లి ఉండకపోతే ఈ నగరం మారాలన్న ఆలోచన కలిగేదా? అందరూ నగరం వదిలి పారిపోవడం లేదు కదా?

ఇదే భయానక వాతావరణంలో నగరవాసులు జీవనం సాగిస్తున్నారు. పెళ్లిళ్లు,

పేరంటాలు అవుతున్నాయి. పిల్లలు పుడుతున్నారు. అన్నీ జరుగుతున్నాయి ఇక్కడే. మరి నా ఒక్కదానికే ప్రమాదం ముంచుకొస్తుందా? మానసిక సంఘర్షణలో ఈ నగరం పట్ల ఉన్న ఆసక్తి ఒకవైపు, అతని సాన్నిధ్యం పట్ల ఉన్న మక్కువ ఒకవైపు పోటీ పడుతున్నాయి. నా శరీరం నిలువునా రెండు భాగాలుగా చీలిపోయి తలపడుతున్నాయి. చివరకు గెలుపు మక్కువవైపే మొగ్గుచూపింది. నగరం నుంచి తప్పుకోమంది.




**మూ**డు నెలల్లో మూడుసార్లు ఏదో ఒక వంక బెట్టుకొని వచ్చాడతను- అదేమిటోగానీ అతను వచ్చిన మూడుసార్లు మావారు ఇంటిపట్టునే ఉన్నారు. ఆయన ఉండడం చూసి అగ్గిమీద గుగ్గిలం వేసినట్టు తల్లడిల్లిపోయాడు. పైకి మాత్రం సహజంగానే కనిపిస్తూ సత్యేన్‌ను కన్విన్స్ చేయసాగాడు. ఏదో రకంగా బనారస్‌కు మారేలా ఉద్వేగపరుస్తూనే ఉన్నాడు. ఎట్టకేలకు అతని పాచిక పారింది.

మావారు బనారస్‌కు మకాం మార్చడానికి అంగీకరించారు. ఏం మంత్రం ఊదాడోగానీ మంత్రముగ్ధుడిలా తలాడించారు.

"మీ కోసం అక్కడ అద్దె ఇల్లు తీసుకున్నాను"

"మావారు ఒప్పుకోకముందేనా? " ఆశ్చర్యపోతూ అడిగాను.

"నాకు తెలుసు, ఏదో ఒకరోజు ఆయన ఒప్పుకుంటారని"

"అంతగట్టి నమ్మకమా నీకు? "

"అవును. పూర్తి ఆత్మవిశ్వాసం లేకపోతే జీవితంలో ఎప్పుడూ అనుకున్నది నెరవేర్చలేం"

అతని పట్టుదలను కాదనలేకపోయాను.

"చూడు ముక్తా, అవసరమైన కొంత సామానే తీసుకో. మిగతావి అక్కడే కొనుక్కోవచ్చు. బరువైనవి ఇక్కడే ఉండనీ.."

"సరే" అంటూ ఏమేం తీసుకెళ్ళాలని ఆలోచించాను. సామాను సర్దడం మొదలుపెట్టాం. సంసారం ఒక సాగరం. ఎంత సమకూర్చినా తక్కువే.

కొద్దిపాటి సామానుతో భాగల్‌పూర్ నుండి బనారస్‌కు మకాం మారింది. అక్కడికి చేరుకుని నేను సంతోషంగానే ఉన్నాను, అతని సన్నిధికి చేరుకున్నందుకు. కానీ మావారే అన్యమనస్కంగా కలతచెంది ఉన్నారు. ప్రయాణమంతా ముభావంగానే సాగింది. కలిసి మా వెంట వచ్చి ఎక్కడా టీ తాగడానిక్కూడా మావారు ఇష్టపడలేదు. ఎందుకంత విచారంగా ఉన్నారని నేను అడగలేదు. కొత్త నీడన, అతని సాన్నిధ్యపు సంతోషం నాకింకేం ఆలోచనను కలిగించడం లేదు. అప్పుడే ఎలాంటి విచారాన్ని వినదలుచుకోలేదు.

మాకోసం అద్దెకు తీసుకున్న ఇంట్లో సామాను సర్దాం. అది పూర్తిగా రాళ్లతో కట్టిన పురాతన భవనం. పై అంతస్తులో ఉంది ఇల్లు. ఇంటికి ఇరువైపుల కిటికీలు, బాల్కనీ ఉన్నాయి. కిటికీలకు, తలుపులకు పాత పరదాలు కూడా ఉన్నాయి. ఇంట్లో రెండు గదులు- హాలు, కిచెన్, ఒక బాత్రూం. మా కుటుంబానికి సరిపడే ఇల్లే చూసాడు. మేము సామాను సర్దుతుంటే

మావారు ఒక మడతకుర్చీ తెరిచి దానిపై కూర్చుండిపోయారు మౌనంగా. ఇల్లంతా తిరిగిచూడనూ లేదు. ఎలాంటి కామెంట్ చేయలేదు. పిల్లలు మాత్రం ఇంటా, బయటా అంతా కలియతిరగసాగారు. వాళ్లకు ఆ ఇల్లు నచ్చిందో, నచ్చలేదో ఏ విషయం చెప్పకపోయినా హుషారుగానే గంతులువేస్తూ కనిపించారు.

మళ్లీ సాయంత్రం వస్తానని చెప్పి శామ్యూల్ వెళ్లిపోయాడు. అతను వెళ్లగానే నేను ఇల్లంతా శుభ్రంచేసి సామాను సర్దాను. మావారు స్నానం చేసాక, వంట సామాను తీసుకు రావడానికి బజారుకెళ్లారు. మనిషి ఎక్కడికి వెళ్లినా తన కడుపు వెంటే ఉంటుందిగా. ముందు అది నిండితేనే తర్వాత విషయాలు గుర్తుకొస్తాయి.

ఇల్లు శుభ్రంచేసి సర్దుకునేసరికి దినం గడిచిపోయింది. ఆ రోజు రెడీమేడ్ టిఫిన్, టీ, భోజనంతో గడిచింది. చీకటిపడగానే మావారు పిల్లల్ని వెంటేసుకొని, బజారు తిరిగి రావడానికి వెళ్లారు. నేను కూడా స్నానం వగైరా ముగించేసి బాల్కనీలోకి వచ్చి కొత్త నగరపు, కొత్త వాతావరణాన్ని, రోడ్డునపోయే కొత్త ముఖాలని చూడసాగాను.

అప్పుడే నా భుజంపై మెత్తని స్పర్శ తగిలింది. అతనే అయ్యుంటాడు. ఇప్పుడు నా శరీరం కూడా ఆ స్పర్శను గుర్తించసాగింది. అందుకే నేను వెంటనే వెనుతిరగలేదు. కాసేపు ఆ సుఖస్పర్శ అనుభూతిని నా మనసు, తనువు అనుభవించాలని అనుకున్నాను. అతని దేహం నుంచి విరజిమ్ముతున్న సుగంధ పరిమళం మత్తును


**విశిష్ట కథల విభిన్న రుచుల**
**సమాహారంగా తాజా సంచిక**

★ పంచభక్ష్యాల వంటి **ఐదు** తెలుగు కథలు

★ మైథిలీ, ఒడిశా, హిందీ, ఉర్దూ, మలయాళ, కన్నడ.. షడ్రసోపేతంలా భారతీయ భాషల కథలు **ఆరు**

★ ప్రపంచ భాషల్లో అమెరికన్, రష్యన్, లాటిన్ అమెరికన్, ఇండోనేషియా, ఆంగ్ల.. కథల కదంబం

మార్కెట్లో ఉంది

కథకుల ఫైల్‌లో

ఇల్లిందల సరస్వతీదేవి **సైకాలజీ**




**విపుల**

**విశ్వకథా వేదిక**

సినీ గీత రచయిత
రామజోగయ్యశాస్త్రి
**పరామర్శ**
ఇంకెన్నో..

కలిగిస్తోంది. నేను నిశ్చేష్టురాలిగా ఉండిపోవడం చూసి, నా భుజానికి తన ముఖాన్ని రుద్దుతూ చిన్నగా మూల్గాడు.

"ఈ రోజు కోసమే నేను ఇంతగా పరితపించింది. నీ రాకతో నేను సంపూర్ణ వ్యక్తినయిపోయాను. ఇప్పుడు నాకెలాంటి దిగులూ లేదు"

"మరి నీ కుటుంబం? "

"నా కుటుంబాన్ని కూడా ఇదే నగరానికి మార్చాను. ఇక్కడికి దగ్గరే. చూస్తావా? "

"లేదు"

"ఒకసారి దూరంనుంచయినా నీకు చూపించాలని ఉంది"

"చూసి ఏం చేసేదుంది? " టపీమని నా నోట్లోంచి వచ్చేసింది.

"చాలా తొందరలోనే నీ కోసం ఓ కొత్త ఫ్లాట్ కొంటాను. దాన్ని మన అభిరుచి మేరకు తీర్చిదిద్దుకుందాం. అన్ని పరికరాలు నీ ఇష్టప్రకారం అమర్చుకోవచ్చు. ఉఫ్! ఎంత చల్లగా ఉంది.." అంటూ నా కొంగును నా భుజాల చుట్టూ కప్పాడు.

"అవును. అందుకే బాల్కనీలో నిలబడిపోయాను" అతని వైపుకి తిరిగాను.

"ఈ ప్రశాంత వాతావరణంలో ఓ ఫస్ట్ ముద్దు ఇచ్చేయ్, నేను వెళ్తాను"

"ఫస్ట్ ఏమిటీ, ఇంతకుముందెప్పుడు తీసుకోనట్టు? "

"ఇక్కడ, ఈ ఇంట్లో ఫస్టేగా? " అంటూ ఇంట్లోకి లాక్కొని కసికొద్దిగా చెంపల్ని, పెదవుల్ని ముద్దాడాడు. మావారు ఎక్కడొచ్చేస్తారోనన్న ఆత్రం ఉంది అతని చర్యల్లో. మొత్తానికి మావారు రాకముందే తను మనోవాంఛ తీర్చుకుని చెక్కేసాడు.

నాలుగు నెలలు గడిచాయి, ఇక్కడికి వచ్చి. ఇప్పటివరకు అంతా సవ్యంగానే సాగిపోతుంది. పిల్లల్ని స్కూళ్లో చేరిపించాడు. మావారు యథావిధిగా క్యాంపులకు వెళ్లివస్తున్నారు. కానీ ఆయన పెదవులపై మునుపటి చిరునవ్వు లేదు. నన్ను చూడగానే ఆయన పెదవులు నవ్వుతో విచ్చుకునేవి. ఇప్పుడు మామూలుగా మాట్లాడ్డం లేదు. ఆయన ప్రవర్తనలో ఈ ఇల్లు కేవలం నాదే అన్నట్టుగా, తనో అతిథిలా మెదులుతున్నాడు. ఆయన ఇంటికి వచ్చినప్పుడల్లా సన్నిహితంగా ఉంటూ, మామూలు స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం ఎంత చేసినా, మావారు సహజధోరణికి రాలేకపోతున్నారు. ఆయనలో ఏం చిక్కుముడి పడిందో విప్పలేకపోతున్నాను. ఆ అసహజత్వ సహజత్వాల మధ్య కాలం తన మానాన తను సాగిపోతూనే ఉంది.

ఒకరోజు మధ్యాహ్నం శామ్యూల్ మంచమ్మీద ఒరిగి కూచున్నాడు. ఎందుకో గంభీరంగా ఉన్నట్టు కనిపించాడు. నేను పక్కనే కూచుని అతని ఛాతీమీద తల పెట్టాను. చొక్కా బొత్తాలు సగంతీసి ఉండడంతో ఛాతీపై వెంట్రుకల్ని నా చేతి వేళ్లతో సుతారంగా నిమరసాగాను. నేనలా నిమరడంతో బహుశా అతనిక్కూడా హాయిగా అనిపిస్తున్నట్టుగా ఉంది. అందుకే మత్తుగా తన కనురెప్పలు మూసాడు. తన్మయత్వంతో ఆ అనుభూతి వ్యక్తంచేస్తూ నా నడుముమీద తన చెయ్యిని చుట్టి నన్ను మరింత దగ్గరకు లాక్కున్నాడు. ఆ స్పర్శకి నా తనువు పులకించిపోగా మెల్లిగా అతని పెదవులకు నా పెదవులను ఆనించాను. ఆ వేడి తాకిడికి అతను రెచ్చిపోతూ నన్ను మరింత బిగ్గరగా కౌగలించేసుకున్నాడు. అదే బిగికౌగిలి.. మత్తును ఉసిగొలిపే కౌగిలి.

ఏం గుర్తుకొచ్చిందో ఏమో, హఠాత్తుగా ఆ కౌగిలిపట్టు సడలింది. నడుము పైనుంచి చెయ్యి తొలగించి, నిస్తేజంగా ఉండిపోయాడు. అప్పుడు అతని ముఖంలో కాసింత విచారం.

"ఏమిటీ ఇంతలోనే విచారంగా మారిపో

యావు? " అడిగాను.

"విచారంగా ఎక్కడున్నాను? ఇప్పుడేగా నిన్ను నా గుండెలమీదకు తీసుకుని ముద్దాడాను" మాటవరసకు బింకంగా అన్నాడే గానీ, గట్టిగా వ్యతిరేకించలేదు. మరికాస్త ఒత్తిడి చేస్తే నిజం రాబట్టొచ్చని అనిపించి, మళ్లీ కదలించాను.

"ఏమిటీ నీ విచారాన్ని నేను పంచుకో కూడదా? "

"ఎందుకు కూడదు? కానీ నేను విచారంగా ఎక్కడున్నాను? " మళ్లీ నన్ను ఒప్పించే ప్రయత్నం చేశాడు. అయినా నేను పట్టు వదల్లేదు. అతను విచారంగా ఉండడం నేను సహించలేను. ఎప్పుడూ ఉత్సాహంగా ఉండే మనిషి ఉన్నఫళంగా విచారంగా మారిపోతే, దాన్ని దాచలేడు. విచారపడే స్వభావం కాదతనిది.

"ఏదైనా చెప్పకూడని విషయమా, నాక్కూడానూ? "

"లేదు, లేదు. అంత ముఖ్యమైన విషయం ఏమీ లేదు"

"ముఖ్యమైన విషయం ఎందుక్కాదు. కాకపోతే నాకు చెప్పడంలేదు? " అని నేను మౌనం వహించాను. ఆనక మెల్లగా లేచి వెళ్లి బాల్కనీలో నిల్చున్నాను.

అతను వచ్చి నా వెనకాల నిల్చున్నాడు. నేను మాట్లాడతానేమోనని కాసేపే ఎదురు చూసాడు. ఏం మాట్లాడనూ లేదు. వెనక్కి తిరగనూ లేదు. అతను నా చెయ్యి పట్టుకుని గదిలోకి తీసుకెళ్లి మంచంమీద కూచోబెట్టి, తను కూడా నా పక్కన కూచుండిపోయాడు.

"అనవసరంగా అలుగుతున్నావు. పెద్దగా చెప్పుకోదగ్గ విషయమేమీ లేదు. నీ దగ్గర్నుంచి వెళ్లాక నేను నా భార్యను..." అంటూ ఆగిపోయాడు.

"భార్యను...? " నేను ఆదుర్దాగా అడిగాను.

"నా భార్యను అంతగా ప్రేమించలేకపోతున్నాను. ఆమె అసంతృప్తికి గురవుతుంటే నాకు అవమానంగా అనిపిస్తోంది"

అతను చిన్నగా చెప్పుకుపోతుంటే నేను బిత్తరపోయి చూస్తూ ఉండిపోయాను. ఇలాంటి సమస్య కూడా ఎదురవుతుందని నేనెప్పుడూ ఊహించలేదు. అసలు ఎదుటివారి గురించి ఆలోచించే అవకాశం ఎక్కడ దొరికింది? ఇప్పటివరకు ఏం జరిగిందో, ఏం జరుగుతుందో, అంతా అతని ఆసక్తితోనే జరుగుతోంది. నాకు తెలియకుండానే నేను అతని మాయలో పడిపోయి, నా భర్త ఎలా ఫీలవుతున్నారో కూడా ఆలోచించలేదు. ప్రతీదీ అతను కోరుకుంటున్నట్టుగానే జరిగిపోతుంది. ఇప్పుడు సమస్య కూడా ప్రత్యక్షంగా అతని వైపునుంచే తలెత్తింది. సాటి ఆడదానిగా నాకు అతని భార్యపట్ల సానుభూతి కలుగుతోంది. మావారు కూడా ముఖాముఖి నిలదీసేరోజు వస్తుందేమోనని భయం పుట్టింది.

"ఈ సమస్యకు ఒకే ఒక పరిష్కారం ఉంది" అన్నాను.

"ఏమిటది? "

"నువ్వు ఒకటి రెండు నెలలు నాకు దూరంగా ఉండు. అన్ని సర్దుకుంటాయి" సూచించాను.

"లేదు, లేదు. అదెలా కుదురుతుంది?"
"ఎందుకు కుదరదు? కుదురుతుంది.." నేను దృఢ నిశ్చయం వ్యక్తం చేశాను.
వెంటనే అతను అరిచాడు, "లేదు... లేదు. నీకు దూరంగా ఉండే ఆలోచన కూడా చేయలేను. అది నావల్ల కాదు"
అతను విలవిల్లాడిపోతూ నా చెయ్యి పుచ్చుకున్నాడు.
"కానీ, నేను దూరంగా ఉండాలనుకుంటున్నాను. నీ భార్యను అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యి.. ఆమె అశాంతికి గురయినట్టు, మావారు కూడా అశాంతికి గురయ్యే ఉంటారు. బయటపడకపోవడం ఆయన మంచితనం. మనం దూరదూరంగా ఉండడం అన్నింటికీ మంచిదే.."
"కొంపదీసి అంతపని చేయకు. నేను భరించలేను" అల్లాడిపోతూ అతను అనగానే నేను ఆలోచనలో పడ్డాను.
ఎంత సులభంగా దూరంగా ఉండాలని అనేశాను. నాకు అతనిపట్ల ఏం అసక్తి, వ్యామోహం లేనట్టు తేలిగ్గా చెప్పేశాను. నిజానికి నన్నీ వ్యామోహానికి గురిచేసింది అతనేగా? నాలో నెలకొన్న కొద్దిపాటి అశాంతిని ఆసరా చేసుకుని, నన్ను ఆకట్టుకుంటూ అదును చూసి తన స్వాధీనం చేసుకున్నాడు. అతను కురిపించిన పురుష వాత్సల్యానికి, అనురాగానికి మైమరచిపోయి సర్వస్వం అర్పించడమే కాదు, సర్వసంగ పరిత్యాగినయ్యాను. ఇప్పుడు అనిపిస్తోంది, ఇదంతా ఏమిటీ? ఏం జరుగుతోంది? ఇందులో అతని భార్య దోషం ఏముంది? మా ఇద్దరి స్వయంకృతాపరాధానికి ఆమె బలయిపోతోంది. నా భర్తకు అన్యాయం జరిగింది. అయితే ఇంత జరిగాక నేను ఇప్పుడు శామ్యూల్‌కి దూరం కాగలనా? నాలో అంత ఆత్మస్థైర్యం ఉందా? తప్పదు కొంతకాలం దూరం అవక తప్పదు. ఎందుకంటే నా మూలంగా తన భార్యకు అన్యాయం జరుగుతోందన్న అపరాధభావం అతనిలోంచి తొలగిపోవాలి. ఎలాగో నేను నా భర్తకు చేసిన ద్రోహం క్షమార్హమైనది కాదు, ఎవరూ క్షమించరు.
నా నిర్ణయానికి అతను పిచ్చివాడిలా బెదిరిపోతూ నన్ను కౌగిట్లోకి తీసుకున్నాడు. చిన్నపిల్లాడు తనకు ఇష్టమైన బొమ్మ ఎక్కడ పోగొట్టుకుంటానోనన్న భయంతో అక్కున చేర్చుకుంటున్నట్టు, నన్ను బిగ్గరగా అదుముకుంటున్నాడు. అతని వెర్రి చేష్టలతో నేను మరోసారి వణికిపోయాను. ప్రేమకు ఇది ఏ రూపం? ఇదేం కోరిక...

11



కొద్దిరోజుల కోసం మేం మా సొంతింటికి వచ్చాం, శామ్యూల్‌కి చెప్పకుండానే. తెలిస్తే మమ్మల్ని రానివ్వడు, మేము బలవంతంగా వచ్చేయాలనుకున్నా అతని యాచక దృక్కులు ఆపేస్తాయి. కానీ నేను ఆగదలచుకోలేదు. అతను తన కుటుంబంతో సంపూర్ణంగా గడిపే అవకాశం ఇవ్వదలిచాను. నా ఎడబాటును అతను తట్టుకోగలడా లేదా గమనించదలిచాను. దాంతో నన్ను ఎంత గాఢంగా కోరుకుంటున్నాడో తెలిసిపోతుంది. పైగా నన్ను నేను కూడా పరీక్షించుకోదలిచాను. ఇన్నాళ్లూ అతని సాన్నిధ్యంలో పరవశించిపోయిన

నేను ఆ వియోగంతో నిశ్చింతగా ఉండగలనా, లేదా?

మేము మా ఫ్లాటు చేరుకోగానే, మా అలికిడి విని సుమీతా పరుగెత్తుకొచ్చింది.

"ఎలా ఉన్నావే ముక్తా? " అంటూ గట్టిగా కౌగిలించుకుంది.

"ముందయితే వదులు, ఊపిరి ఆడ్డంలేదు" అన్నాను నవ్వుతూ.

"ఆ! వదిలా. ఇప్పుడు చెప్పు"

"భేషుగ్గా ఉన్నాను. నీకలా అనిపించడం లేదా? "

"నీ అల్లికల పని ఎలా నడుస్తోంది? " అడిగింది.

ఆమెకు ముందునుంచే అనుమానంగా ఉంది. నేను కేవలం శామ్యూల్ కోసమే బనారస్ వెళ్లానని. అల్లికల సెంటర్ ఉత్త సాకే అని ఆమెకు అర్థమయింది.

"ఫర్వాలేదు. బాగానే నడుస్తోంది. ఇప్పుడు వేసవి కదా, చలికాలం పికప్ అవుతుంది. సరేగానీ, నువ్వెలా ఉన్నావో చెప్పు? "

"ఏదో ఇలా ఉన్నాను. నువ్వు లేకపోవడంతో నాకు చాలా బోర్‌గా ఉంది. నీ అంత చనువుగా నాతో ఇంకెవరు ఉండరుగా" సుమీత దీనంగా చెబుతుంటే నాక్కూడా బాధగానే అనిపించింది. నాక్కూడా ఆమె ఒక్కతే చేదోడు వాదోడు. పరస్పరం కష్టసుఖాలు చెప్పుకొనేవారం. కానీ కొన్నాళ్లుగా శామ్యూల్ నా జీవితంలోకి ప్రవేశించడంతో అబద్ధాలు, మభ్యపెట్టడం అలవాటయిపోయింది.

"మీరు ఫ్రెష్ అవండి. ఈవాళ మా ఇంట్లోనే భోంచేయండి. మీరు ఇష్టపడే వంట చేస్తాను" అని చెప్పి సుమీతా వెళ్లిపోయింది.

ఆమె వెళ్లగానే, ఇల్లంతా తిరిగి చూసాను. ఎన్నో ఏళ్లయినట్టు అనిపిస్తోంది ఆ ఇల్లు వదిలేసి. ఇల్లంతా సాలెగూళ్లు బూజుపట్టి, దుమ్ముపట్టి అస్తవ్యస్తంగా ఉంది. ఇంటి దుస్థితి చూసి మనసు కుంగిపోయింది. ఎంత నీటుగా ఉంచేదాన్ని ఇంటిని. ఎంత కళగా ఉండేది.. ఇవాళ నిర్మానుష్యంగా, నిస్తేజంగా కనిపిస్తోంది. ఆ దుర్దశను చూసి మా నానమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. 'ఇల్లాలు లేని ఇల్లు దయ్యాల కొంప'. అది అక్షరాల నిజమనిపిస్తోంది.

ఇల్లంతా శుభ్రం చేయసాగాను. మావారు కూడా ఇల్లు సర్దడంలో నాకు సహకరించసాగారు. బరువైన సామాగ్రిని జరపడంలో, వాటిని యథాస్థానంలో అమ

ర్చడంలో ఎంతో ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. బనారస్‌లో ఇలాంటివేమి ఆయన పట్టించుకునేవారు కాదు.

డైనింగ్ టేబుల్ మీద చాలారోజుల తర్వాత నాకు ప్రశాంతంగా అనిపించింది. అన్నం వడ్డిస్తుంటే రితు ఏదోమాట అనగానే నాకు నవ్వు వచ్చింది. మావారు దృష్టి సారించి నావైపుకి చూసారు. ఆయన మొహంలోనూ నిశ్చింత ప్రస్ఫుటించింది. ఎన్నాళ్లుగానో అదృశ్యమైన చిరునవ్వు ఆయన పెదవుల మీద తారాడింది. ఆయన అలా నవ్వుతుంటే నాకెంతో ఆనందం కలిగింది. అయితే ఆ ఆనందం ఎంతోసేపు నిలువలేదు. మళ్లీ వెంటనే మనసు అటు మళ్లింది. ఇదేం బతుకయిపోయింది? లోపల ఏదో మెదులుతోంది? శరీరం యాంత్రికంగా తనపని తాను చేసుకుపోతుంది. తనువు ఇక్కడుంది, మనసు మరెక్కడో యోచిస్తుంది. ఆ సతమతంతో మావారు బనారస్ ఊసెత్తకుండా ఉంటే బావుండని అనిపించింది.

మావారు, పిల్లలు నిద్రపోయారు. అర్ధరాత్రి మెలకువ వచ్చింది. ఎంత ప్రయత్నించినా మళ్లీ నిద్రపట్టడం లేదు. హాల్లోకి వచ్చి పచార్లు చేయసాగాను, ఎటూపాలుపోక. తీరిక దొరకగానే అతని జ్ఞాపకాలు వేధిస్తున్నాయి. నా భర్త పిల్లల గురించి ఆలోచించాలని అనుకున్నా, అతని పొగడ్తలు, చిలిపి చేష్టలు, శృంగార కలాపాలు నన్ను నిలకడగా ఉండనివ్వడం లేదు. చూడ్డానికి అతను నాజుగ్గా ఉన్నా, అతని ఆగడాలు మొరటోడికన్నా మెండుగానే ఉంటాయి. ఆ పోకిరి చేష్టలు పదే పదే మస్తిష్కంలో మెదులుతున్నాయి.. కేవలం అతనో పురుషుడు, నేనో స్త్రీని మాత్రమే. ఏ భవబంధాలు లేవక్కడ. నా భర్త కౌగిట్లో కరిగిపోతున్నా, నలిగిపోతున్నా, నా కళ్లల్లో అతనే తారాడుతున్నాడు. దాంపత్యసుఖం అందించడంలో మావారిలో ఏలోపం లేదు. అయితే ఆయన కేవలం మగడిపాత్రనే నిర్వహిస్తారు. కానీ అతను మగాడి పాత్ర పోషిస్తాడు. మగధీరుడిలా విజృంభిస్తాడు. ఇది బరితెగించి చెప్పడం కాదు, నగ్నసత్యం. అందుకే నాలో ఈ కలవరపాటు, తడబాటు.

ఇరవైరోజులు గడుస్తూనే శామ్యూల్ ఉత్తరం వచ్చింది. అది మావారి చేతిన పడింది. ఆయన అన్యమనస్కుడవుతూ, ఆ పోస్టుకవరును విప్పకుండానే నాకిచ్చారు. నేను ఆయనకేసి పరిశీలనగా చూసాను. ముఖంపై ఆవరించుకున్న కలవరం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. శామ్యూల్‌పై కోపం వచ్చింది. ఉత్తరం రాయాల్సిన అవసరం ఏమొచ్చింది?

ఏమిటీ పిల్లచేష్టలు? మండిపోతూ ఆయన ముందరే కవరు విప్పాను. కాగితం మడతను విప్పి చదివాను. "ఇక మీరు వచ్చేయండి. పిల్లల సెలవులు అయిపోతున్నాయి. 'సూత్రధార్' సంపాదకులు మీ కోసం కబురు చేసారు"

ఉత్తరం చదివి, దాన్ని మా వారికి ఇచ్చాను. ఆ సంక్షిప్త లేఖ మళ్లీ నా మనసు, మస్తిష్కంలో ఆందోళనను రేకెత్తించింది. మెదడు కూడా ప్రేమభాషను ఇట్టే గ్రహిస్తుంది. రెండు వాక్యాలు చదువుతూనే అతని పూర్తి హావభావాలు చలనచిత్రంలా నా కళ్ళముందు తారాడాయి. ఎక్కువగా రాయకున్నా అతని మౌనవేదనను మనసు గ్రహించింది. కళ్లెం తెగిన గుర్రంలా అతనికేసి పరుగులు పెట్టింది. ఇటువైపు దారితీసిన మనోగతం, మళ్లీ అటువైపు దారిమళ్లింది. మావారు నా ముఖంలో ఉత్పన్నమవుతున్న భావోద్వేగాన్ని చూసి ఖిన్నుడయిపోయారు. నేనేమి పట్టనట్టే అక్కడ్నుంచి జారుకు

న్నాను.

ఉఫ్, ఇప్పుడేం చేయను? ఒకవైపు అతని అభ్యర్థన. మరోవైపు మావారి ఆనందం. మావారు సొంతింట్లో ఆనందంగా, ప్రశాంతంగా ఉంటున్నారు. బనారస్ అద్దె ఇంట్లో ఆయన ఇమడలేకపోతున్నారు. పరాయి ఇంట్లో ఉంటున్నట్టు వెలితిగా ఉంటున్నారు. శామ్యూల్ అభ్యర్థనని నేను నిక్కచ్చిగా తోసిపుచ్చలేకపోతున్నాను. అతను ఇప్పుడు ప్రత్యక్షంగా లేకపోయినా ఉత్తరంలోని ఒక్కో అక్షరంలో అతని రూపం దీనంగా ప్రతిబింబిస్తోంది.

నా బతుకే గందరగోళమయిపోయింది.. అక్కడ ఉండగా ఇక్కడి జ్ఞాపకాలు, ఇక్కడ ఉంటే అక్కడి జ్ఞాపకాలు.. పిల్లల సెలవులు అయిపోతున్నాయి. అక్కడికి వెళ్లే సమయం ఆసన్నమవుతోంది. వెళ్లే రోజులు దగ్గర పడుతున్నకొద్దీ, సుమీతాలో ఆందోళన ఎక్కువవుతోంది. మధ్యాహ్నం నుంచే ఆమె నా దగ్గర తిష్ట వేసింది. చాలా విచారంగా మొహంపెట్టి పదేపదే ఒకేమాట అంటోంది.

"మీరు వెళ్లక తప్పదా? సొంతిల్లు వదిలి పరాయి ఊళ్ళో ఉండడం ఏమిటో? మళ్ళీ ఇక్కడికి వచ్చేయలేరా మీరు? నువ్వు లేకపోవడంతో నాకు చాలా బోర్‌గా ఉంటుంది"

నేను ఆలోచనలో పడ్డాను, ఏం జవాబివ్వాలని. నేను అక్కడ లేకపోతే అతనికి బోరు, ఇక్కడ లేకపోతే ఈవిడకు బోర్..

ఎవరేమనుకున్నా పిల్లల చదువు పాడవకూడదని వెంటనే బనారస్‌కు వచ్చేశాం. మళ్లీ జీవనం యథావిధిగా సాగిపోతోంది. అక్కడికి వచ్చి అప్పుడే మూడు నెలలు గడిచాయి. ఆ మూడు నెలల్లో మావారు మూడుసార్లు వచ్చారు. అదీనూ ఇంటి సరుకులు ఇప్పించి పోవడానికి. మధ్య మధ్యలో ఏలోటు కలుగకుండా శామ్యూల్ కనిపెట్టుకునే ఉంటున్నాడు. ఇంటిఅద్దె కూడా అతనే చెల్లిస్తున్నాడు. మావారు అద్దె ఇవ్వబోతే "ఉండనివ్వండి. ఒకేసారి ఏడాది అద్దె అడ్వాన్సుగా ఇచ్చేశాను. ఆ తర్వాత మీరిద్దురులేండి" అంటూ వారించాడు.

అతని చనువు మావారికి అనుమానం కలిగిస్తున్నా, నా వత్తాసు గ్రహించి, నన్ను ఏమి అనలేక తనే మెల్లిమెల్లిగా ఇక్కడికి రావడం తగ్గించేశారు. ఈసారి రెండునెలలయినా ఆయన రాలేదు. లోగడ ఇచ్చిన నగదు అయిపోయింది. ప్రతిదానికి శామ్యూల్ దగ్గర చెయ్యి చాపాల్సి వస్తోంది. పిల్లలకు పరీక్ష ఫీజు కట్టాల్సి ఉంది. తండ్రి వచ్చి కడతారని పిల్లలు ఎదురు చూస్తున్నారు. ఒకవేళ మావారు ఇంకా కొన్నాళ్లు రాకపోతే ఏం చేయాలి.. రాత్రింబవళ్లు అదే ప్రశ్న మెదడులో మెదలుతోంది.

మధ్యాహ్నం అతను వచ్చాడు. మంచమ్మీద ఓ కొనకి మౌనంగా కూచుండిపోయాడు. అతని మౌనం, నా మనస్సును మరింత కుంగదీసింది. మనసులోని ఆవేదనని కుదుట పరుచుకుంటూ నేను కూడా ఓ కొనకి కూచున్నాను. అయినా నా మనసులో మావారు ఇక ఇక్కడికి రారా? అన్న ఆలోచనే మెదులుతోంది.

అతని ముందు బయటపడకుండా గుంభనంగా ఉండిపోయాను.

"నువ్వు నన్ను బాగా ప్రేమిస్తున్నావు గదూ? " చాలాసేపటి ఉద్విగ్నతని తొలగించటానికి, నాలుగయిదు సిగరెట్లని పీల్చి పారేశాక, మౌనం వీడి అడిగాడు.

అనేక విచారాలతో తలమునలకై ఉండగా, అప్రస్తుత ప్రశ్నకి నాకు నవ్వొచ్చింది. ఆ ప్రశ్న మొదటిసారి అడగడం లేదు అతను. అడపాదడపా అటు తిప్పి, ఇటు తిప్పి అదే ప్రశ్న అడుగుతుంటాడు. ఇప్పుడు అందుకు బదులివ్వడం కూడా మానేశాను. నిజానికి ఇప్పుడతని ప్రశ్నకు నవ్వుకోలేదు నేను. అతని గంభీర వదనం చూసి నవ్వొచ్చింది. అందుకే మళ్లీ వెంటనే తిరిగి ప్రశ్నించాను.

"ఇంకా అనుమానంగా ఉందా నీకు? "

"అయితే పద, మనం వెంటనే పెళ్లి చేసుకుందాం" అతను ఆత్రంగా అనేసరికి నాకు మళ్లీ నవ్వొచ్చింది.

ఏం వెటకారం ఇది?

"పెళ్లా..? అదెలా కుదురుతుంది? " నవ్వును తమాయించుకుంటూ అడిగాను.

"కుదురుతుంది" అతను ఒత్తి పలుకగానే నేను ఉలిక్కిపడి, తనకేసి సూటిగా చూసాను. అతని గంభీరతలో ఏమీ మార్పు రాలేదు. అతని మాటల్ని ఇప్పటి దాకా ఉత్తుత్తివిగానే అనుకుంటున్నాను. కానీ అతని గంభీరవదనం నన్ను ఆందోళనకి గురిచేసింది. నేను కూడా గంభీరంగా మారాను.

"నేనేం చేయాల్సి ఉంటుంది? "

"చూడు ముక్తా. నిన్ను మావాళ్లంతా అంగీకరిస్తారు. కేవలం నువ్వు.." వాక్యం పూర్తి చేయకుండా ఆగిపోయాడు.

"కేవలం నేను ఏం చేయాలి? "

"కేవలం మతం మార్చుకోవాల్సి ఉంటుంది నువ్వు" చాలా సింపుల్‌గా చెప్పేశాడు.

నా గుండెల్లో పిడుగు పడ్డట్టయింది. కేవలం మతం మార్చుకోవాల్సి ఉంటుంది. అవాక్కయి అతని ముఖం చూడసాగాను. కేవలం మతం మార్పిడి.. అదో ఆట వస్తువు అయినట్టు, ఏదో చిన్న పిల్లకి చెబుతున్నట్టు తేలిగ్గా చెప్పేశాడు.

నన్ను ఇంతగా లోబరుచుకున్న అతనికి సంతృప్తే లేదు. నా తనువు, మనస్సును ఆధీనం చేసుకున్నాక కూడా ఇంకా ఏం అధికారం కావాలి? ఈ పెళ్లి తతంగం దేనికి? తనకు వచ్చిన లోటేముంది? ఈ వయస్సులో, ఈ స్థితిలో మళ్లీ పెళ్లి ఏమిటీ? మరి నా పిల్లలేమయిపోవాలి? నేనేమయినా విడాకులు పొందిన వ్యక్తినా? వితంతువునా? తలుచుకుంటేనే గుండెల్లో వణుకు పుడుతుంది. ఈ వణుకు, ఈ భయం అతని దరిచేరేటప్పుడు అస్సలు గుర్తుకురాలేదు. పరపురుషుడి వ్యామోహంలో భర్త ప్రతిష్ఠ, కుటుంబ గౌరవ మర్యాదలు, పిల్లల భవిష్యత్తు ఏదీ ఆలోచించకుండా అతని వెంట పడి వచ్చేశాను. కేవలం అతనిపట్ల ఉన్న విశ్వాసంతో అన్నిటికీ తెగించి వచ్చేశాను. మరి అతనికి ఇప్పుడు నా పట్ల అవిశ్వాసం పెరిగిపోయి పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చాడా? లేక సంకుచిత మనస్తత్వంతో ఆలోచిస్తున్నాడా? నా ప్రేమ, నా సమర్పణ, నా అనుబంధం అంతా అతని తుచ్ఛ ప్రస్తావనని అంగీకరిస్తేనేనా సార్థకత చెందేది?

"మతం మార్పిడితో నా స్పర్శ మారుతుందా? నా ప్రేమ పెరుగుతుందా? లేక ముక్తా నుంచి మరో వ్యక్తినవుతానా? లేదు. ఇవేమీ కావు, ఏమీ మారవు.. ఒక పేరు మారినంత మాత్రాన మరో మార్పు ఏమీ ఉండదు. మారేది కేవలం నీ అధికారం, అహంకారం బహిర్గతమవుతుంది.



నీకు నీ మీద నమ్మకం లేనట్టుంది. నువ్వు విశ్వాసాన్ని కోల్పోతున్నట్టుగా ఉంది. ఎవరికైతే తనమీద తనకు విశ్వాసం ఉండదో, వారు ఇతరులను విశ్వసించలేరు" అనేసి మౌనం వహించాను.

నా మాటలకి ఏం బదులివ్వలేదు.

నేను నిజంగా మూర్ఖురాలినే. ఆ దౌర్భాగ్య స్థితిలో ఇంతదూరం ఆలోచించలేదు. మరి ప్రతి ప్రేమకూ పరాకాష్ఠ పెళ్ళేనా? అలాంటప్పుడు ఇంతగా దిగజారే ముందు మతం అడ్డురాలేదేమిటి? మరి నాకెందుకు అనిపించలేదు, అతనో క్రైస్తవుడు, నేనో హిందువునని? అప్పట్లో అతను నాకు కేవలం ఓ ఇష్టసఖుడిగానే తోచాడే.

ఏ మతం గురించి నాకు తెలియదో, ఏ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాల అవగాహన లేదో ఆ మతాన్ని నేనెలా స్వీకరించగలను? నా పిల్లలు ఎలా ఆమోదించగలరు అదంతా? నా స్వార్థానికి వాళ్లు బలైపోవాలా? ఇదేమిటి? ఏమైపోతుంది నా బతుకు? ఇదేం పిచ్చిప్రేమ. ఇదేం గుణపాఠం? ఒకే వేటుతో పటాపంచలయి పోయింది, నా కళ్లకు కమ్ముకున్న మైకం.

అతనికి నా సుఖం కావాలి... నా సాంగత్యం కావాలి... అదీనూ శాశ్వతంగా... మరి నాకు...? ఎంత సులువుగా చెప్పేశాడు మతం మార్చుకోమని. ఒకేఒక వాక్యం ఎంతటి అగాధాన్ని సృష్టించింది. ఒక మంచి వాక్యం జీవితగమనాన్నే మార్చినట్టుగా, మరో వాక్యం జీవితాన్ని సమూలంగా విచ్ఛిన్నం చేయగలదు. నరకప్రాయం చేయగలదు. ఆ సంతోషం, కేవలం అతని చెంతనే లభిస్తుందనుకున్న సంతోషం ఇప్పుడు ఆవిరయిపోతున్నట్టు అనిపిస్తోంది. అయినా నా మనస్సు మళ్లీ అదే పిచ్చిప్రేమకే మొగ్గు చూపుతోంది. అంత పెద్దమాటని మరిచే ప్రయత్నం చేస్తుంది.

ఆలోచనలో పడ్డాను. అది అతని తొందరపాటు ఆలోచనగా భావించాను. ఆనక అన్నీ సర్దుకుంటాయి, మళ్లీ మేం అలాగే సుఖంగా ఉంటాం...




**కొ**ద్దిరోజులుగా అతనితో గడిపే క్షణాల్లో మనసు, తనువు ఒకటి కాలేకపోతున్నాయి. ఎప్పుడు ఏవో తార్కిక ఆలోచనలు మెదడులో మెదులుతున్నాయి. నేనా క్షణాలని క్షుణ్ణంగా విశ్లేషించసాగాను. ఆ క్షణంలో పొందే జీవితం పరిపూర్ణమైనదేనా? ఎందుకు కాదు, నేను మనసారా అతనిలో లీనమయిపోతాను. మనసా వాచా అతన్ని కోరుకుంటాను. అయినా ఈమధ్య మెదడులో ఏవో అనుమానపు ఆలోచనలు మెదులుతూ, ప్రతీదీ తార్కికంగా ఆలోచించాల్సి వస్తుంది.

మంచమ్మీద పడుకున్న శామ్యూల్ మీద దృష్టి సారిస్తూ, కిటికీ తెరపక్కకి తొలగించాను. బయటి వెలుతురు అతని ముఖంపై ప్రసరించింది. ఎంత ప్రశాంతంగా నిదురపోతున్నాడు. నిశ్చింతగా, ఆదమరిచి నిద్రిస్తున్న అతను ఎంతో ప్రశాంతంగా కనిపిస్తున్నాడు. కాసేపట్లో దిగ్గున లేస్తాడు. ప్యాంటు, షర్టు తొడుగుతాడు. హడావుడిగా వెళ్లిపోతాడు. ఈ

ఇంటితో, నాతో ఏం సంబంధం లేనట్టే రివ్వున చెక్కేస్తాడు. ఇంతకీ ఆ భయం దేనికి? అదేం భయం? ఎలాంటి అశాంతి నెలకొని ఉంది? తన్ను నిశ్చింతగా బతకనివ్వడంలేదు. ఆ అనిశ్చితిని చూస్తుంటే నాక్కూడా అనుమానం కలుగుతోంది. నిజానికి నేను భయపడాలి, అడుగడుగునా, అభద్రతాభావంతో కుమిలిపోవాలి.

కొన్నాళ్ల క్రితం అతను అన్న మాటలు నాకు బాగా గుర్తున్నాయి. "నువ్వు నా మీద అధికారాన్ని ఎందుకు వ్యక్తం చేయవు? పరాయివ్యక్తిలా వ్యవహరిస్తుంటే నాకు చాలా బాధేస్తుంది. అసలు నామీద నీకు ఎప్పుడు విశ్వాసం కలుగుతుంది? నువ్వు చెబితే నేను అన్నీ వదులుకుంటాను, అందర్నీ వదులుకుంటాను" అని.

కానీ నేనెప్పుడు అతనిపట్ల ఎలాంటి పూర్తి అధికారాన్ని ఆశించలేదు. మావారి మీద ఉన్న అధికారం అతని మీద ఉన్నట్టు ఎందుకో ఎప్పుడూ అనిపించలేదు. అతనితో ఏర్పడింది కేవలం ఆత్మీయబంధం, ఆత్మబంధం తప్ప అధికారం కోరుకోలేదు. అతని మాటలు వింటుంటే, పురుషుడు యుక్తవయసులో ఉన్నా, నడివయసులో ఉన్నా, ప్రేమను వ్యక్తంచేసే క్షణాల్లో ఒకేతీరుగా వ్యవహరిస్తాడని, ఒకే భావుకతకి లోనవుతాడని అనిపించింది.

హఠాత్తుగా అతను లేచి కూచున్నాడు. నన్ను చూసి అడిగాడు, "ఏం ఆలోచిస్తున్నావు? "

"అబ్బే.. ఏంలేదు. ఏం లేదు" హఠాత్తుగా అతను అడిగేసరికి తడబడ్డాను.

నా తటపటాయింపు గమనించి అతను అడిగేశాడు- "నేను వెళ్ళడం నీకు బాధగా ఉండదూ? "

"నీకు బాధ ఉంటుందా? " నేను ఎదురు ప్రశ్న వేశాను.

"తప్పకుండా, నాకు ఇక్కడ్నుంచి వెళ్ళాలంటే చాలా బాధగా ఉంటుంది. అసలు వెళ్లబుద్దే కాదు. కానీ ఏం చేయను, వెళ్ళక తప్పదు. ఒకవేళ నువ్వు నాకు పదేళ్ల ముందు దొరికి ఉంటే..!"

"ఆc! దొరికి ఉంటే? "

"నిన్నే పెళ్లాడేవాడ్ని. నీ ఒడిలో పూర్తి జీవితాన్ని గడిపేసేవాణ్ణి. కేవలం నీ తోడు నీడలోనే" గద్గద స్వరంతో అన్నాడు. కానీ నాకు తెలుసు, అవన్నీ ఉత్తమాటలే. అతని చంచలత్వం నాకు తెలుసు. కట్టుబడి ఉండే నైజం కాదు అతనిది. పురుషుల్లో స్థిరత్వం లోటు సర్వదా ఉంటుంది.

"ఊ" చిన్న నిట్టూర్పుతో మిన్నకుండిపోయాను.

"ఇలా 'ఊc' అంటే సరిపోదు. నీకు నా మాటలు అబద్ధమనిపిస్తున్నాయేమో? ఎలా విశ్వాసం కలిగించాలి నీకు. నాలో చెలరేగుతున్న భావాలని ఎలా వ్యక్తం చేయను నేను? "

నేను మౌనంగా ఉండిపోయాను.

"సరే, అవన్నీ వదిలేసెయ్. నువ్వు సాయంత్రం రెడీ అయి ఉండు" షర్టు తొడుక్కుంటూ చెప్పాడు.

"దేనికి? "

"బయటికి వెళ్దాం"

"ఎక్కడికి? "

"గంగానది ఒడ్డుకి. ఇప్పటివరకు నిన్ను

ఎక్కడికీ తీసుకెళ్ళలేదు. ఇవాళ అలా షికా రుకెళ్ళొద్దాం"

"అలాగా!" చిన్నపాటి అంగీకారశబ్దంలో ఉల్లాసంగానీ, ఉత్సాహంగానీ ఏదీ వ్యక్తం చేయలేదు. ఎందుకనో ఈ మధ్య అతను ఏ మాట చెప్పినా నమ్మకం కలగడంలేదు. రేపు ఫలానా పనిచేస్తానని అతనంటే, నాకు వెంటనే అది జరిగేపని కాదులే అని పించేస్తుంది. అతని ద్వంద్వ మనస్తత్వం అర్థమయిపోతుంది. అతను ఏది ఉపయో గించుకున్నా దానిపట్ల తొందరలోనే విరక్తి కలుగుతుంది. అది వస్తువైనా సరే! బంధ మైనా సరే, పైగా కొద్ది సమయంలోనే అతను ఎక్కువశాతం లబ్ధి పొందే ఆకాంక్ష పరుడు కూడా.

నిన్న అతను కాల్చే సిగరెట్ బ్రాండు మారడం చూసి అడిగాను, "ఎవరైనా తన ఇష్టాన్ని ఉన్నతస్థాయికి పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు గానీ ఇలా చౌకబారు, నాసి రకంకు దిగజారరు. మరి నువ్వెందుకు ఇంత నాసిరకం సిగరెట్ తాగుతూ నీ అభిరుచిని దిగజార్చుకుంటున్నావు? "

"సమయానుకూలంగా అన్నీ గడు స్తాయి, మేడం!" నవ్వుతూ అంటుంటే, 'సమయానుకూలంగా అతను ఎంతకైనా తెగిస్తాడన్న మాట!' అనిపించింది.

నేను ఊహించినట్టుగానే శామ్యూల్ క్రమేపీ ఇక్కడికి రావడం తగ్గించేశాడు. ఒకసారి భార్యాపిల్లల్తో స్వగ్రామానికి వెళ్తు న్నానని పదిరోజులు మాయమయ్యాడు. ఎప్పుడూ ఏదో వంక చెబుతూ రోజులకు రోజులు అదృశ్యమయిపోతున్నాడు. నేను ఏ ఒంటరితనం భరించలేక అతనివైపునకు మొగ్గు చూపానో, అదే ఒంటరితనం, నిరీ

క్షణ నన్ను మళ్ళీ ఇప్పుడు దహించి వేస్తు న్నాయి. ఎదురుచూపులతో విసిగి వేసారి పోతున్నాను.

ఒకరోజు అతను వచ్చేసరికి నిస్తేజంగా పడి ఉండడంతో అడిగాడు, "బాగా బోర యిపోతున్నట్టున్నావు? "

ఎంత సులభంగా అడిగేశాడు, బోరయి పోతున్నట్టున్నావనీ.. ఆ చిన్న వాక్యం విని నాలో క్రోధాగ్ని భగ్గుమంది. అయినా ఆవేశాన్ని అణుచుకుంటూ..

ఎదురుప్రశ్న వేశాను, "ఏమిటీ, ఇక జీవి తాంతం నీకోసం ఇలాగే ఎదురుచూస్తూ ఉండాలా? "

"మరి ఏం చేద్దాం? నేను రోజు రోజుకి బిజీ అయిపోతున్నాను"

"ఇంతకుముందెప్పుడూ నువ్వు ఇలా బిజీ అనలేదే? "

"అనాలా, నీకు తెలియదా? "

అతను కటువుగా అనేసరికి లేచి అతని తల పగలగొట్టాలనిపించింది. లేదా నాదన్నా పగలగొట్టుకోవాలనిపించింది. అతని మాటలకి లోలోపల క్రోధాగ్ని రగు లుకోసాగింది. ఈ పర్యవసానం తెలియకే కదా వెంటబడి వచ్చేశానని అనాలనిపిం చింది. అయినా అంతకంటే కటువుగా అనలేకపోయాను. పంజరంలో చిక్కుకున్న పక్షిలా వివశురాలినయిపోయాను. బాల్క నీలోకి వెళ్ళిపోయాను. మనసులోని ఆవేద నంతా కన్నీళ్ళుగా మారి కళ్ళనుంచి కారసా గాయి. అతనితో ఏమీ అనాలనిపించలేదు. స్వయంకృత అపరాధానికి ఎవరిని నిందించి ఏం లాభం? అంతా నా మూర్ఖత్వం. గంటల తరబడి అతనితో కాలక్షేపం చేసిన పరంపరంతా కలలా అయిపోయింది. అతని కబుర్లు, వాగ్దా నాలు, ప్రేమానురాగాలు అన్నీ మాయమాటలుగానే తేలిపోయాయి. కుట్రతో నన్ను లోబర్చుకున్నాడు. అతని మాయాజాలంలో ఇరుక్కుపోయాక గట్టు చేరిన అవకాశవాదిలా విర్రవీగుతున్నాడు.

అతను రానంతసేపూ నాకు ఎదురయిన ఇబ్బందుల్ని, మనోవేదనని అతనికి చెప్పి ఊరట పొందాలనుకుంటాను. కానీ అతను ఈమధ్య ఏమీ వినిపించుకోవడం లేదు. తన ధోరణే తనది. వచ్చీరాగానే మంచమెక్కడం, తన సుఖం తను చూసు కోవడం, నా శరీరంతో ఆడుకోవడంతోనే సరిపోతుంది. అందుకు కేవలం ఇక్కడికి, అక్కడ దొరకని సుఖం పొందడానికే వస్తు న్నాడు. ఇంత సుఖం ఒకవేళ అక్కడే దొరి కితే నన్ను ఇక్కడికి ఎందుకు తెస్తాడు?

13



**వా**రం రోజుల తర్వాత శామ్యూల్ కళాభవన్ ఆహ్వానపత్రిక తీసుకుని వచ్చాడు. రేపు సాయంత్రం ఆరు గంట లకు కవి సమ్మేళనం జరుగుతోంది, నిన్ను తప్పకుండా తీసుకువస్తానని అక్కడ మాట ఇచ్చానని చెప్పాడు. దేశం నలుమూలల్నుంచి గొప్పగొప్ప కవులు, పండితులు సమ్మేళనానికి వస్తున్నారు. అందులో నేను కూడా పాల్గొనాలని ఆదే శించాడు. కానీ ఇవాళ పొద్దుట్నుంచే నా కూతురు రితుకు బాగా జ్వరం వచ్చింది. జ్వరంతోపాటు వాంతులు కూడా అవుతు న్నాయి. మోనూకు పరీక్షలు జరుగుతు న్నాయి. జబ్బు చేసిన పిల్లను వదిలేసి ఆ

సమ్మేళనానికి ఎలా హాజరు కాగలను? ఆమెను వదిలివెళ్ళే పరిస్థితి లేదు. వెంట వెంట తడిగుడ్డతో ఆమె ఒళ్ళు తుడవాల్సి వస్తోంది. ఆమెను కనిపెట్టుకుని ఉండాలి. నా కూతురుకు ఏమైనా అయితే నేను తట్టుకోలేను. నేను గాబరాపడిపోయాను. కళ్లల్లో నీళ్ళు చిమ్మసాగాయి. మావారు ఇక్కడికి మకాం మారేముందు ఒకమాట అన్నారు, 'చాలా పెద్ద బాధ్యత నెత్తినేసుకుని వెళ్తున్నావు ముక్తా. ఇద్దరు ఆడపిల్లల బాగోగుల బాధ్యత నీదే. వీళ్ళు నీ పిల్లలు. కేవలం నీ పిల్లలు'

తను ఒక పురుషుడు కనుక, పురుష నైజం తెలుసు కాబట్టి, అలా హెచ్చరించి ఉంటాడు. ఆ విషయం ఇప్పుడు అర్థమవుతోంది. ఇక్కడికి వచ్చేముందు నేను కూడా ఒకసారి శామ్యూల్‌తో అన్నాను. 'పిల్లలు అక్కడ నిరాశకు గురయ్యే అవకాశమయితే రాదుగా? ' ఆ మాటలకి అతను కాసేపు నావంక విడ్డూరంగా చూసి ఆనక చెప్పాడు- 'ఏమిటీ వీళ్లు కేవలం నీ పిల్లలేనా? నా పిల్లలు కారా? వాళ్లను నా ప్రాణం కంటే మిన్నగా చూసుకుంటాను..'

తలుపు తట్టిన శబ్దం అయింది. అతనే వచ్చుంటాడు. గడియారంకేసి చూసాను. సాయంత్రం ఐదయింది. హఠాత్తుగా గుర్తుకొచ్చింది. ఇప్పుడే కళాభవన్‌కు వెళ్లాల్సి ఉంది. నాకు వెళ్లాలని లేదు. రితు అస్వస్థతగా ఉండగా ఎలా వదిలి వెళ్లగలను? ఆమె నాడి పట్టి చూసాను. జ్వరం కాస్త తగ్గింది. అందుకే నిద్రపోతున్నట్టుగా ఉంది. అయోమయస్థితిలో తలుపు తెరిచాను. శామ్యూలే వచ్చాడు. లోపలికి వస్తూనే ఆదుర్దాగా అడిగాడు.

"అరే, నువ్వింకా రెడీ అవలేదా? ఆరింటికల్లా అక్కడికి చేరుకోవాలి. అప్పుడే ఐదయిపోయింది"

"రితు ఆరోగ్యం బాగోలేదు. చాలా జ్వరంతో ఉంది" నేను నిదానంగా చెప్పాను.

"ఆరోగ్యం బాగోకపోతే ఏమయింది? ఏమైనా రాత్రంతా అక్కడే ఉండిపోతామా? గంట, రెండు గంటల్లో తిరిగొచ్చేస్తాం. మోనూను చూసుకోమని చెప్పు. లేకుంటే మన పొరుగింటి మిసెస్ మిశ్రా గారిని కాస్త చూస్తూ ఉండమని చెప్పు"

చాలా ఈజీగా చెప్పేశాడు. కనీసం రితు చెయ్యి పట్టుకుని ఎలాగుందో కూడా చూళ్లేదు. అమ్మాయి పక్కన కూచోను కూడా కూచోలేదు. ఒకవేళ రితు పరిస్థితిలో తన కూతురుకు ఇలా ఉంటే ఇలాగే అనేవాడా? అతని వ్యవహారం నాకు నచ్చలేదు.. ఇలాంటి స్థితిలో ఆమె తండ్రి ఉండివుంటే ఇప్పటికే ఎంతగానో అల్లాడిపోయేవారు. ఆసుపత్రికి తీసుకెళ్లడమో, డాక్టర్‌ని తీసుకురావడమో చేసేవారు. నేను కూడా ఆయన్ని ఆదుర్దా పెట్టేదాన్ని. ఇక్కడ నోరు మెదపలేకపోతున్నాను. కేవలం అంతరంగంలోనే అల్లాడిపోతున్నాను.

"ఏం ఆలోచిస్తున్నావు ముక్తా.. త్వరగా పదా" ఇంకా అతను నిలబడే ఉన్నాడు.

నేను కూడా కూచోమనలేదు.

"ఇప్పుడు, అక్కడికి వెళ్లడం అంత అవసరమా? " రితు వంక చూస్తూ అడిగాను

అతన్ని.

"తప్పకుండా వెళ్ళాలి. చాలా గొప్ప సమ్మేళనం జరుగుతోంది. దేశం నలుమూలల నుంచి గొప్పగొప్ప కవులు, వక్తలు విచ్చేస్తున్నారు. చాలామందిని పరిచయం చేస్తాను అక్కడ"

"మళ్లీ ఎప్పుడైనా కలవచ్చులే" అన్నాను. ఇన్నాళ నుంచి ఎవరినీ కలవనిది ఇప్పుడు కలిసి ఏం చేసేది ఉందిలే- అని అందామనుకున్నాను.

"లేదు, లేదు. వాళ్లందరికీ నువ్వు ఇక్కడ రెండు రోజులే ఉంటావని తెలుసు" అని చెప్పగానే ఆశ్చర్యంతో అతనికేసి చూశాను.

"అయితే, ఇంతవరకూ ఎవరికి నేను చాన్నాళ్ళుగా ఇక్కడే ఉంటున్నానని చెప్పలేదా? " అడిగాను.

"ఎవరికైనా చెప్పుకోవాల్సిన అవసరం ఏముంది? మనకోసం మనం ఉన్నాం ఇక్కడ" తేలిగ్గా అన్నాడు.

అతని మాటలు నా గుండెల్లో గునపాల్లా గుచ్చుకున్నాయి. ఓహో, అందుకేనా అతను ఇంతవరకు నన్ను ఎక్కడికీ తీసుకెళ్లలేదు. ఎవరితోనూ కలిపించనూ లేదు. కేవలం అనుభవించే వస్తువుగానే నన్ను నాలుగు గోడల మధ్య అట్టిపెట్టేశాడు.

"ఇంకా ఏం ఆలోచిస్తున్నావు? ఆలస్యమయిపోతుంది.. పదా.." అతను దీనంగా అన్నాడు.

నేను యాంత్రికంగా తయారవ్వసాగాను. శరీరం నా ఆధీనంలో లేదు. మస్తిష్కంలో అలజడి చెలరేగుతూనే ఉంది. చిన్నది మోనూ, జబ్బుపడ్డ అక్కను ఎలా కనిపెట్టుకుని ఉండగలదు? మనసు అంగీకరించక, పొరుగింటి శ్రీమతి మిశ్రాగారిని పిలిచి కాస్త పిల్లల్ని కనిపెట్టుకుని ఉండమని అభ్యర్థించాను. హాండ్‌బ్యాగ్ భుజానికి వేసుకుని రితు వంక చూశాను. పాలిపోయిన రితు ముఖం చూస్తుంటే, నా కాళ్లు కదలడంలేదు. కచ్చితంగా నిరాకరించాలనుకున్నాను. కానీ అతను ఆ అవకాశమే ఇవ్వలేదు. "పదా, పదా..." అంటూ వేగిరపెడుతూ తరుముకు తీసుకెళ్లాడు.

ఏదో అదృశ్య పలుపుతాడుతో లాక్కెళ్తున్నట్టు కామ్‌గా అతని వెనకాల బయల్దేరాను.

"అక్కడ ఎక్కువసేపు ఉండంలే. నాక్కూడా త్వరగా ఇంటికి వెళ్లాల్సి ఉంది. నా భార్యని చెకప్‌కు తీసుకెళ్లాలి. డాక్టర్ దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకున్నాను"

స్కూటర్ స్టార్ట్ చేసి చెబుతుంటే, అతని పీక పిసికేయాలనిపించింది. తిరిగి నా బిడ్డ దగ్గరకు పరిగెత్తాలనిపించింది. స్వార్థపరుడు, అవకాశవాది, నా బిడ్డ పరిస్థితి గురించి కొద్దిగా కూడా పట్టించుకోలేదు. తన భార్య చెకప్‌కి తొందరపడుతున్నాడు.

కళాభవన్ చేరుకున్నాం. అక్కడ చాలా సందడిగా ఉంది. ఎవరికి వారు గుంపులు గుంపులుగా జనాలు పరస్పరం చర్చించుకుంటున్నారు. ఇంకా ముఖ్య అతిథి రానట్టుగా ఉంది. ఆయన గురించే జనం బయట ఎదురు చూస్తున్నట్టుగా ఉన్నారు. అతను నేరుగా నన్ను ఒక పెద్ద గదిలోకి తీసుకెళ్లాడు. అక్కడ విశాలమైన రౌండ్ టేబుల్ ఉంది. చుట్టూ కుర్చీలు ఉన్నాయి. కుర్చీలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఒక కుర్చీలో నన్ను కూచోబెట్టి అతను బయటికెళ్లాడు. బహుశా అది ఆడిటోరియం కాన్ఫరెన్స్ హాలేమో? చుట్టూరా గోడవారగా గ్లాసు డోర్ అలమారాలు ఉన్నాయి. వాటినిండా లావుపాటి పుస్తకాలు అమర్చి ఉన్నాయి. గదంతా పాత కాగితాల వాసన ఎగజిమ్ముతోంది. ఏకాంతంలో చాలా రకాల ఆలోచనలు మదిలో మెదులుతున్నాయి. నాకు ఇబ్బందిగా ఉంది, ఒకదాన్నే అక్కడ కూచొని ఉండేందుకు.

లేచి గదిలో పచార్లు కొట్టసాగాను.

"అయ్యో ముక్తాగారు, మీరు ఇక్కడు న్నారా? మీరు ఆడిటోరియంలోకి వెళ్ళుం టారనుకున్నాను" ఎవరిదో ధ్వని వినిపించి తిరిగి చూసాను.

షాకీర్ కనిపించాడు.

"నమస్కారం, మీరు ఎప్పుడు చూసారు నన్ను" నేను తెల్లబోతూ అడిగాను.

"శామ్యూల్ గారితో వస్తుండగా చూసాను. ఎలా ఉన్నారు మీరు? "

"బాగానే ఉన్నాను" నేను నవ్వే ప్రయత్నం చేసాను. నవ్వలేకపోయాను.

"ఎప్పుడొచ్చారు, బనారస్‌కి? "

"ఇవాళ పొద్దున్నే" అబద్ధం చెప్పాను.

"ఎప్పటివరకు ఉంటారు? "

"రేపటివరకు"

"రేపటివరకేనా? "

"అవును"

"మీరు ఇంటి పట్టున లేరా ఏమిటీ? భాగల్‌పూర్ అడ్రస్సుకి చాలా ఉత్తరాలు రాసాను. దేనికీ జవాబు రాలేదు. మీరేమైనా అలిగారా నా మీద? "

"లేదే. మీ మీద ఎందుకు అలుగుతాను నేను? కొద్ది రోజులుగా అక్కడ లేం, వూరెళ్లాం"

"సత్యేన్‌గారు ఎలా ఉన్నారు? "

"బానే ఉన్నారు. చెప్పండి. మీ పత్రిక ఎలా నడుస్తోంది? "

"ఫర్వాలేదు. నిరవధికంగా వెలువడుతూనే ఉంది. వార్షికోత్సవం కూడా జరగబోతుంది. ఇన్విటేషన్ ఎక్కడికి పంపాలో అర్థం కావడం లేదు" అతను అయోమయంగా అంటుంటే నేను కూడా ఏమీ చెప్పలేకపోయాను. ప్రస్తుతం నేను ఇదే ఊళ్లో ఉంటున్నానని, ఇక్కడే ఉంటానని కచ్చితంగా ఏమీ చెప్పలేకపోయాను. నన్ను ఇక్కడికి తీసుకొచ్చిన వ్యక్తే నన్ను అజ్ఞాతంలో ఉంచుతున్నప్పుడు నాకు నేనుగా ప్రచారం చేసుకోవడం దేనికి?

"నేను రెండు నిమిషాల్లో వస్తాను" అంటూ షాకీర్ బయటికి వెళ్లిపోయారు. షాకీర్ శామ్యూల్ మిత్రుడు. అతను భాగల్‌పూర్‌కి వచ్చినప్పుడు శామ్యూల్ మాకు పరిచయం చేసాడు.

'షాకీర్ బనారస్‌లో ఉంటాడు. మంచి సాహిత్యకారుడు. ఒక త్రైమాసిక పత్రిక కూడా ప్రచురిస్తాడు కానీ ఉర్దూలో' అని శామ్యూల్ అతన్ని పరిచయం చేసాడు.

బనారస్‌లో అతని సహకారంతో సొంత పత్రిక ప్రారంబిద్దామని శామ్యూల్ ఆశ పెట్టాడు. ఇక్కడికొచ్చాక ఆ ఊసే ఎత్తలేదు.

"మీరు బోరయిపోవడం లేదుగా? ఈ టీ అయితే తాగండి" షాకీర్ టీ కప్పు టేబుల్‌మీద పెట్టి, తాను కూడా మరో కుర్చీలో కూచున్నారు.

మేము టీ తాగుతుండగా శామ్యూల్ లోపలికి వచ్చాడు. షాకీర్‌ను చూడగానే డోర్ దగ్గరే ఆగిపోయాడు.

"రండి శామ్యూల్ గారూ, కూచోండి. మీ గురించే అడుగుతున్నాను"


అతను మౌనంగా ఉండిపోవడం చూసి షాకీరే పలకరించారు. శామ్యూల్ పెదవి విరుస్తూ వచ్చి మరో కుర్చీలో కూర్చున్నాడు. వాళ్లిద్దరూ బాతాఖానీలో పడిపోయారు. నేను వాళ్ల మధ్యలో జోక్యం చేసు

**రా**మకోటి ఒకప్పుడు రాష్ట్రంలోనే పేరుమోసిన గజదొంగ. అయితే తన భార్యకు ఇచ్చినమాట తప్పకూడదని దొంగతనాలు మానేశాడు. ఇది ఇన్‌స్పెక్టర్ బాజీరావుకు కంటగింపు అయింది. తర్వాత కొద్దిరోజులకే రామకోటి ఉన్నఫళంగా అదృశ్యమయ్యాడు. ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ కావాల్సిన ఆయన కొడుకు పాండు అదేరోజు నేరస్తుడిగా పట్టుబడి కటకటాల పాలయ్యాడు.

ఇంతకీ ఆఫీసర్ కావాల్సిన పాండు చేసిన నేరమేమిటి? పాండు తండ్రి రామకోటి అదృశ్యం వెనుక అసలు కథేమిటి?

పోలీసు వ్యవస్థలోని లొసుగులను, కార్పొరేట్ వ్యాపారంలోని లోతుపాతులను విశ్లేషిస్తూ అక్షరాక్షరాన్నీ ఉత్కంఠతో చదివించే పుట్టగంటి గోపీకృష్ణ తాజా నవల

**పులిజూదం**




కోలేదు. నా మనస్సంతా రితువైపే లాగుతోంది. ఎలా ఉందో నా బిడ్డ? మళ్లీ జ్వరం హెచ్చిందో ఏమో? వాంతి చేసుకుంటే మోనూ గాబరాపడిపోతుంది. మిసెస్ శర్మ కూడా తిట్టిపోస్తుంది. 'ఏం తల్లి ఈమె? జ్వరం వచ్చిన పిల్లను వదిలి, ఎక్కడికో షికారు కెళ్లింది' అని గొణుక్కుంటుంది. మేము ఎక్కడికి వెళ్లినా ఆమె షికారుకెళ్లినట్టే భావిస్తుంది.

"...తన భార్యను ఎంతటి నపుంసకుడైనా ఏలుకుంటాడు. కానీ మరో ఆడదాన్ని కూడా ఏలుకోగలిగేవాడే మగాడు..." హఠాత్తుగా శామ్యూల్ దురుసు మాటలు నా చెవిన పడగానే ఉలిక్కిపడి అతనికేసి చూసాను.

అతని మొహం కందగడ్డలా మారిపోయింది. ఆ మాటలు ఏ సందర్భంలో అన్నాడో నాకర్థం కాలేదు. ఇంతవరకు రితు గురించి ఆలోచిస్తూ ఉండటం వల్ల ఆ మాటలు అనే సందర్భం ఎందుకొచ్చిందో అంతుపట్టలేదు. అతని దురుసు మాటలకి షాకీర్ కూడా ఏం స్పందించలేదు. తిన్నగా లేచి వెళ్లిపోయారు. షాకీర్ జారుకున్నాక శామ్యూల్ నన్ను ఆడిటోరియంలోకి తీసుకెళ్లి కూచోబెట్టాడు.

ఆడిటోరియమంతా కిక్కిరిసిపోయి ఉంది. ఒక వ్యక్తి వేదికపై నిల్చుని కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నాడు.

అంతలోనే బయట అలజడి, అరుపులు మొదలయ్యాయి. బహుశా ముఖ్య అతిథి విచ్చేసి ఉంటారు. చాలాసేపట్నుంచి ఆయన కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఆడిటోరియంలో కూడా అలజడి మొదలయింది. కొందరు ముఖ్య అతిథి

వైపుకి ఎదురు వెళ్తున్నారు. కొద్దిసేపట్లోనే కార్యనిర్వాహకులు ముఖ్య అతిధికి ఆహ్వానం పలుకుతూ వేదికమీద ఆసీనులను చేసారు. క్రమానుసారంగా మిగతా సభికులను వేదికపైకి ఆహ్వానించి కూచోబెట్టారు. సభా కార్యక్రమం కొనసాగుతోంది. సమయం కూడా గడుస్తోంది. గడిచే సమయంతో పాటు, నాలో కలవరం కూడా పెరుగుతోంది. జరుగుతున్న కార్యక్రమాల తీరుతెన్నులు చూస్తుంటే అర్ధరాత్రి దాటినా సభ ముగిసేలా లేదు. నేను గాబరా పడిపోతూ శామ్యూల్‌ను వెతకసాగాను. వేదిక ఎదురుగా రెండో వరుసలో అతను కూర్చుని ఉన్నాడు.

అంతలోనే వేదిక మీదకు నన్ను ఆహ్వానించారు. ఆ కవి సమ్మేళనానికి నా ప్రమేయం లేకుండానే నా పేరు నమోదు చేయించి శామ్యూల్ నన్ను ఇరకాటంలో పెట్టాడు. నా మనోస్థితి ఎలా ఉంది, నేను ఎంతవరకు ప్రిపేర్ అయ్యానో తెలుసుకోకుండానే తన ప్రాబల్యాన్ని చాటుకోవడానికి ఆ కార్యక్రమానికి నన్ను ప్రపోజ్ చేసాడు. గత్యంతరం లేక నేను వేదిక మీదకు చేరుకున్నాను. యథాలాపంగా గుర్తుకొచ్చిన ఒక పాత కవితను వినిపించాను. కరతాళ ధ్వనులు మారుమోగుతూనే సభా నిర్వాహకులు నా కవితను ప్రశంసించారు. అయినా నాలో ఎలాంటి ఆనందం, ఉత్సాహం కలుగలేదు. మరొకప్పుడయితే ఆ స్పందనకి ఉబ్బితబ్బిబయిపోయేదాన్ని. ఇప్పుడు నా అంతరంగం ఎండదెబ్బ తగిలిన ఎడారిలో తహతహలాడిపోతోంది. మెల్లిగా వేదికనుంచి దిగి ముఖద్వారంవైపు నడిచాను. వెనకాలే శామ్యూల్ కూడా వచ్చాడు. అతను హడావుడిగా స్నేహితులకి పరిచయస్తులకి వీడ్కోలు చెబుతూ వస్తున్నాడు. అప్పటికల్లా నేను స్కూటర్ చేరుకున్నాను.

అతను హడావుడిగా స్కూటర్ స్టార్ట్ చేయగానే వెనకాల కూచున్నాను. వేగంగా పోనిస్తున్నాడు. అప్పటికే ఆలస్యమయిందన్న తొందరలో ఉన్నాడు. నన్ను ఇంటి దగ్గర దింపి, బయటినుంచే వెళ్లడానికి స్కూటర్ మలిపాడు.

"పైకి రావా? " దీనంగా అడిగాను.

"ఇప్పటికే చాలా ఆలస్యమయింది. ఇంటి దగ్గర ఆమె ఎదురు చూస్తుంటుంది. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి" స్కూటర్ స్టార్ట్ చేసి, అక్కడ్నుంచి తుర్రుమన్నాడు. నేను కూడా వేగంగా మెట్లు

ఎక్కుతూ పైకి వెళ్లాను. తలుపు తట్టగానే మిసెస్ మిశ్రా గారొచ్చి తలుపు తీసింది.

"పిల్లను ఈ స్థితిలో వదిలి మీరు వెళ్లాల్సిందికాదు. చాలా గాబరాగా ఉందా పిల్లకి" ఆమె మందలింపుగా అంది.

"మీకు శ్రమ ఇచ్చాను, క్షమించండి. ఒక ముఖ్యమైన మీటింగ్‌కు వెళ్లాల్సి వచ్చింది. చాలా తప్పనిసరై వెళ్లాను"

మీటింగ్‌కెళ్లాననేసరికి ఆమెకు మరింత కోపం వచ్చినట్టుంది. విసురుగా తల విదిలించేసి వెళ్ళిపోయింది.

నిజంగానే రితుకు జ్వరం తీవ్రమైంది. చల్లటినీటితో యూడీకోలెన్ చుక్కలు కొన్ని వేసి, రుమాలు ఆ నీటిలో తడిపి ఆమె నుదురును తుడవసాగాను. అమ్మాయి మెల్లిగా కళ్లు తెరిచి నాకేసి దీనంగా చూసింది. నేనొచ్చానన్న నిశ్చింతతో ఆమె ముఖం విచ్చుకుంది. మోనూ మంచమ్మీద ఓ మూలకి కాళ్లూచేతులు దగ్గరకు ముడుచుకుని పడుకుంది. ఆమె ముఖంపై అలసట, ఉద్రిక్తత ప్రస్ఫుటిస్తోంది. అన్నం కూడా తిన్నదో లేదో...

14



**శా**మ్యూల్ రాక ఏడురోజులయింది. రితు జబ్బు పడ్డం చూసి వెళ్ళినదే మళ్లీ రాలేదు. ఆరోజు రాత్రి జ్వరం పెరిగిపోయి, వాంతులు కూడా విపరీతంగా చేసుకుంది. మిశ్రాగారు డాక్టర్‌ని తీసుకొచ్చారు. డాక్టర్ ఆమెకు డిఫ్తీరియా సోకినట్లు అనుమానం వ్యక్తం చేసారు. తాత్కాలికంగా కొన్ని మందులు రాసిచ్చి, టెస్టులు చేయించమని చెప్పారు. మర్నాడు టెస్టులు చేయించాక ఆయన అనుమానం నిజమని తేలింది. రితుకి సోకింది డిఫ్తీరియానే. తగిన మందులు, ఇంజక్షన్లతో సమయానికి వైద్యం అందడంతో తొందరగానే రితు కోలుకుంది. ఆ వైద్య చికిత్సలో మిశ్రాగారి కుటుంబ సహాయం అందకపోయింటే నేను నిలువునా మునిగిపోయేదాన్నే. 'నా బిడ్డకు ఏమైనా అయ్యుంటే' అన్న తలంపు రాగానే నా శరీరం నిలువునా వణికిపోయింది. అతని కోసం ఎదురుచూసి, ఎదురుచూసి నా ఓపిక నశించింది. అతని ఇల్లు వెదుక్కుంటూ వెళ్లాలా అనిపించింది. వెళ్లడానికి మనసు అంగీకరించలేదు. కావాలనే రానివాడ్ని వెతుక్కుంటూ వెళ్లినా ఏం ప్రయోజనం? మళ్లీ నాకే అనిపించింది, బహుశా అతని ఆరోగ్యం బాగోలేక రాలేకపోయాడేమోనన్న అనుమానం కలిగి వెళ్లి చూద్దామనిపించింది.

రిక్షాలో అతని నివాస ప్రాంతం చేరుకున్నాను. కొద్దిదూరంలోనే దిగి నడుస్తూ వెళ్లాను. నేను ఇల్లు చేరుకోకముందే అతనే దారిలో ఎదురు పడ్డాడు. బహుశా బజారుకు వెళ్తున్నట్టుగా ఉంది. నన్ను చూడగానే క్షణంపాటు బిత్తరపోయినా, వెంటనే తేరుకుని అడిగాడు.

"నువ్వా- ఈ వేళ్ళప్పుడు, ఇక్కడికి...? " దగ్గరకొస్తూ అడిగాడు. వెంటనే నేను నోరుజారకుండా మిన్నకుండిపోయాను. అతను ఎక్కడ అనారోగ్యానికి గురయ్యాడోననుకున్నాను. బేషుగ్గానే ఉన్నాడు.

"ఎందుకు ఇంతగా వర్రీ అవుతున్నావ్ డార్లింగ్? నేను నిన్ను వదులుతాననుకున్నావా? " దగ్గరగా వచ్చి చిన్నగా అనేసరికి నాకు ఒళ్లు మండింది. ఈడ్చి చెంపమీద

కొట్టాలనిపించింది. వారం రోజులుగా కనిపించకుండా పోగా, ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. అనవసరంగా వచ్చాను అతన్ని వెతుక్కుంటూ. దుఃఖంతో, సిగ్గుతో నాలో నేనే కుమిలిపోయాను. బహుశా ఇలాంటి స్థితిలోనే, సీత భూదేవి శరణుజొచ్చి, తన ఒడిలోకి జేర్చుకొమ్మని వేడుకుని ఉంటుంది. కళ్లముందు జబ్బుపడి శుష్కించిపోయిన రితు మొహం కదలాడింది. ఆమె కోసమే ఇంతరాత్రివేళ, ఇంత నిస్సహాయస్థితిలో అతన్ని వెతుక్కుంటూ ఇంతదూరం వచ్చాను. ఈ నిర్దయుడైన మనిషి నిరాదరణకు గురయ్యాను.

కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాను. ఏం చేయాలో పాలుపోవడంలేదు. కానీ ఏదో ఒకటి చేయాలి? ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. రితు కోసం అతని దయాదాక్షిణ్యాలను వేడుకోవడమో లేదా అతని మోహబంధం నుంచి బయట పడటమో? ఇంత నిర్లక్ష్యపరుడితో కలిసి ఉండడం వృథా. ఆ క్షణంలో నా ఆత్మ ఒక తల్లి ఆత్మ కాకుండా ఒక స్త్రీ ఆత్మగా మారింది. నాలో ఆత్మాభిమానం పురివిప్పింది. ఎంతగానో నిందించాలనుకున్నాను. కానీ స్వయంకృతాపరాధానికి ఎవరిని నిందించి ఏం ప్రయోజనం? పరపురుషుడి వ్యామోహంలో ప్రతీచోటా ఇలాంటి పర్యవసానమే జరుగుతుందని తెలిసికూడా, పిచ్చిగా అతని వెనకాలపడి వచ్చేశాను.

మౌనంగా నా కూతుళ్ళ దగ్గరికి తిరిగొచ్చేశాను. వాళ్లు నాకన్న కూతుళ్ళు. వాళ్ళను కాపాడుకోవాల్సిన బాధ్యత నాది.

మెల్లిమెల్లిగా రితు ఆరోగ్యం మెరుగుపడింది. మిశ్రా దంపతుల అండదండలు దొరక్కపోతే రితు నాకు దక్కేదికాదేమో? మంచి ఇరుగుపొరుగు దొరకడం కూడా ఓ అదృష్టమే. ఆ పరిస్థితిలో నాకు వాళ్లు నిజంగా దేవుళ్ళుగానే కనిపించారు.

పదిహేను రోజుల తర్వాత మెల్లిగా వచ్చాడు అతను. ఆ పదిహేను రోజులు ఎలా గడిచాయో నా అంతరాత్మకే తెలుసు. నేను అనుభవించిన మానసిక వేదన వర్ణనాతీతం. ఆ కష్టాన్ని, ఆ దుఃఖాన్ని వ్యక్తం చేయడం నావల్ల కాదు. అయినా కూడా అతన్ని చూడగానే మండిపడలేదు. అంత బాధ, అంత దుఃఖం అతన్ని చూడగానే నీరుగారిపోయింది. నోరు విప్పి ఏమి అనలేకపోయాను. ముభావంగా ఉండిపోయాను.

"నువ్వు చెప్పకుండానే వచ్చేశావేమిటీ? " అతను మామూలుగా అడిగాడు.

"మరి ఏం చేయను? నిన్ను ఏమనాలో తోచక వచ్చేశాను. నేను గతాన్ని తోడదలుచుకోలేదు. బాధ తప్ప ఒరిగేదేమీ లేదు"

"కోపం వచ్చిందా, నా మాటలకి? "

మౌనంగా ఉండిపోయాను. అలాంటి నిర్లక్ష్య ధోరణికి కోపం రాక, ఎవరికైనా సంతోషం కలుగుతుందా?

"నీకు తెలుసా, నా భార్యకి మన వ్యవహారమంతా తెలిసిపోయింది. ఇంట్లో ఒకటే గొడవ. అందుకే రాలేకపోయాను" అన్నాడు. అంటే ఇంతకుముందు ఎప్పుడూ ఇలా గొడవ జరుగుతుందని తనకి తెలియదా? ఏ భార్య అయినా తన భర్త పరస్త్రీతో సంబంధం పెట్టుకుంటే ఊరుకోదని తెలియదా? రెండేళ్ల క్రితం నా కోసం ఆమెనే వదిలేస్తానన్నాడు. ఇప్పుడేమో ఆమె గొడవకి తలొగ్గి నాకు దూరంగా మసలుకుంటున్నాడు. ఎలాగూ నేను నా భర్త నిరాదరణకి గురయ్యాను. ఇప్పుడు తను కూడా నిర్లక్ష్యం చేస్తే, నేనేం చేయగలనన్న ధీమా కాకపోతే, మరేమిటీ?

నేను కేవలం అతని ప్రేమకి తలొగ్గి, అతని మైకంలో ఇక్కడికి వచ్చాను. అతని అహాన్ని, నిర్లక్ష్యాన్ని భరించడానికి రాలేదు.



అతనికి నా పట్ల వ్యామోహం తగ్గినప్పుడు, నేనెందుకు అతన్ని ఇంకా అంటిపెట్టుకుని ఉండడం? పైగా విడదీయరాని అను బంధం కూడా ఏదీ పెనవేసుకోలేదు. గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్న నా సంసారాన్ని విచ్ఛిన్నం చేసి, ఇక్కడికి తీసుకురావడంలో అతనే ప్రధాన భూమిక నిర్వహించాడు. మరి ఇక్కడ అనుబంధం తెంచుకోవడానికి అతనే ప్రధాన సూత్రధారి అవుతున్నాడు. మరొకరితో బంధం ఏర్పర్చుకోవడం నాది పొరపాటే అయినా, నా అంతరంగం ఆ అనుబంధాన్ని ఆత్మీయ బంధంగా స్వీకరించింది, ఆనందించింది.

అందుకే అతన్ని ముఖాముఖి ఖండించలేకపోతున్నాను. దూషించలేకపోతున్నాను.

దుఃఖం, అవమానం మనిషి నిర్ణయాన్ని మరింత దృఢపరుస్తాయి. ఒకవేళ శామ్యూల్ తన అసమర్థతను వ్యక్తం చేస్తే నాకు ఏమంత బాధకలిగేది కాదు. కాని అతను రకరకాల వంకలతో తప్పించుకోవడం, రకరకాలుగా మభ్యపెట్టడం, నిలదీస్తే అవమానించడం నాకు మనస్తాపాన్ని కలిగిస్తున్నాయి. కచ్చితంగా అవసరం ఉన్నప్పుడే కనిపించకుండా పోతున్నాడు. నా అవసరాలు ఏవీ అతనికి ముఖ్యంగా అనిపించకపోగా, అనవసరమైన ఖర్చుగా భావిస్తున్నాడు. ఆర్థిక పరంగా చాలా ఆచితూచి వ్యవహరిస్తున్నాడు.

పురుషుడు తను ఏదైనా పొందాలనుకున్నప్పుడు ఎంతో ఉదారంగా వ్యవహరిస్తాడు. సర్వం త్యజించడానికి సిద్ధంగా ఉన్నట్టు మాట్లాడుతాడు. ఆ మాయమాటలకి ఆడది మైమరచిపోయి తన సర్వస్వాన్ని నిరాటంకంగా అర్పించేస్తుంది. మోసపోతుంది. మగాడికి ముందే తెలుసు, తనిచ్చిన మాట నిలబెట్టుకోకపోయినా చెల్లుతుందని, చెల్లిపోతుందనీ. కానీ ఆడది కోల్పోయింది, సమర్పించింది తిరిగి రానిది, తిరుగులేనిది. నేను కూడా అతని నుండి ఏమి ఆశించకపోయేదాన్ని, ఒకవేళ నన్ను ఇక్కడికి తీసుకురాకుండా ఉంటే. అడగకుండానే అతని అవసరం తీరుతున్నచోట నా అవసరాల గొంతు నులుముతున్నాడు. కానీ పిల్లలు.. వాళ్ల ఆశల్ని నేనేం చేయాలి? ఎలా తీర్చాలి? వాళ్లకు ఎన్నో అవసరాలు, ఆశలు ఉన్నాయి. వారి కోరికలవేళ్లల్లో దాగిన అసహాయత నన్ను కుప్పగూల్చి వేస్తుంది. అతని నుంచి మాత్రం ఎలాంటి సహాయం లభించే దాఖలాలు కనిపించడం లేదు. పూర్తి సమర్పణ తర్వాత కూడా మా మధ్యన ఎన్నో దూరాలు ఉన్నాయి. నేను అతని భార్యను కాను. అతని గుర్తింపు నాకు లేదు. కేవలం ఒక సుఖసాధనాన్ని మాత్రమే. అదీనూ అతని ఖాళీ సమయాల్లో ఉబుసుపోకకి. అజ్ఞాతపు చీకటి సుఖం మినహా, ఎలాంటి వెలుగూ నామీద ప్రసరించదు. ప్రేయసీగానో, ఉంపుడుగత్తెగానో జీవించాల్సిందే. బలమైన బంధం లేనప్పుడు బతుకు భారమైపోతుంది. మోజు తీరాక అలాంటి బంధం చులకనయిపోతుంది.

నా గుండెలమీద పేరుకుపోతున్న బాధ్యతల భారం పెరుగుతున్నకొద్దీ అత

నిలో విసుగు పెరిగిపోతుంది. 'ఎప్పుడూ రాగానే ఏవో సమస్యలు ఏకరువు పెడుతూనే ఉంటావు' అంటూ కసురుకోగానే, నాకూ అడగాలనిపిస్తుంది. 'ఏమిటీసుఖం తప్ప, మరో సమస్య ఉండదా? ' అని.

అతను కేవలం తన ఇంట్లో దొరకని సుఖం కోసం ఇక్కడికి వస్తున్నాడు. అది అతని సమస్య కాదా? మరి అది అందించే మనిషి సమస్యలు ఎవరు తీర్చాలి? పిల్లల సమస్యలు.. ఇంటి సమస్య.. ఆర్థికపరమైన సమస్యలన్నీ మరి నేనెవరికి చెప్పుకోవాలి? ఎలాంటి ఆశలు, కోరికలు లేని బండరాయిగానో, ఆటబొమ్మగానో మారిపోనా? క్రమేపీ అతను అనామకుడైపోతున్నాడు. అందుకే అతనికి ఏ మాటా చెప్పాలనీ కూడా అనిపించడం లేదు.

మంచమ్మీద పడుకుని ఏదో నవల చదువుతున్నానే గానీ, మనసులో సుడిగుండం చెలరేగుతూనే ఉంది. నిన్న 'సూత్రధార్' పత్రిక సంపాదకులు ఆ పత్రికను నిలిపేస్తున్నామని చెప్పేసరికి మరింత కుప్పకూలిపోయాను. ఆ పత్రిక ద్వారా ప్రతినెలా ఎంతో కొంత పారితోషికం లభించేది. ఇప్పుడు ఆ కాస్త ఆధారం కూడా కోల్పోయాను. ఏదైనా ఉద్యోగం వెతికి పెట్టమని కూడా అతన్ని అడగలేకపోతున్నాను. స్వతహాగా ఎక్కడైనా ఉద్యోగం వెతుక్కోవడానికి వెళ్లితే, ఎవరిదైనా సిఫార్సు అడుగుతున్నారు.

బాగా ఆలోచించాను.. ఈ ఇల్లు, ఈ నగరం శాశ్వతంగా వదిలేయాలి.. ఆ నిర్ణయం తీసుకున్నాక లోగడ పంచుకున్న అనుబంధం, అనురాగం, ఆత్మీయతలన్నీ బూటకంలా అనిపించసాగాయి. అతని కోసం ఎదురుచూస్తూ అతని మీద ఆధారపడి ఉండకూడదు. అతని కోసం కుమిలి కృశించిపోతూ నా జీవితంతోపాటు నా బిడ్డల జీవితాలను కూడా నాశనం చేయకూడదు. నిరంతరం ప్రవహించే నదిలా సాహసించాలి. నా కాళ్లమీద నేను నిలబడి, నా బిడ్డల్ని నేనే సాక్కోవాలి.

నేను వెంటనే రాంచీలోని కుమారన్‌కు ఉత్తరం రాశాను. లోగడ ఇదే అడ్రస్సుకు శామ్యూల్‌ను కొంత డబ్బు సహాయం కోరుతూ కుమారన్ ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం నా దగ్గరే ఉండిపోయింది. అదే ఉత్తరంలోని చిరునామాకి, నాకు ఏదైనా మామూలు ఉద్యోగం వెతికి పెట్టమని, అలాగే ఓ చిన్న ఇల్లు కూడా అద్దెకు చూసి పెట్టమని అభ్యర్థిస్తూ, ఈ విషయం ఎట్టి పరిస్థితిలోనూ శామ్యూల్‌కు చెప్పొద్దని కూడా ఉత్తరం రాసాను. కుమారన్ ఇతరులను అర్థం చేసుకుని, సహకరించే స్వభావం కలవాడు. శామ్యూల్‌కు నా గురించి చెప్పడన్న విశ్వాసం నాకుంది.

నేను ఆశించినట్టుగానే కుమారన్ చాలా తొందరగానే ప్రత్యుత్తరం రాసాడు. 'ఒక ప్రయివేట్ స్కూలుల్లో టీచర్ ఉద్యోగం ఖాళీగా ఉంది. మొదట్లో జీతం రెండున్నరవేలు ఇస్తారు. తర్వాత ప్రతిభను బట్టి యాజమాన్యం జీతం పెంచుతారు. అంతే కాదు, ఒక ప్రాంతీయ పత్రికలో పార్ట్‌టైం సంపాదకురాలిగా కూడా అవకాశం ఉంది. అక్కడ్నుంచి కూడా ఓ రెండున్నర వేలు

దొరకొచ్చు. ఇల్లు కూడా త్వరలోనే వెతికి పెడతాను. మీరేం చింతించకండి. మేము మీకు అండగా ఉంటాం. మీరు నిస్సంకో చంగా వచ్చేయండి' అని రాశాడు. అది చదివి నా కాళ్లల్లో శక్తి ఉత్పన్నమయింది. దాంతోపాటు ఆత్మవిశ్వాసం కూడా కలి గింది. ఇవాళ్టి నుంచి నేను ఒక వ్యక్తిత్వం గల వ్యక్తిగా మారబోతున్నాను. నా స్వశ క్తితో నా పిల్లల్ని సాక్కోబోతున్నాను.

సొంత పత్రిక ప్రలోభం నెరవేరకపోయి నా రచనా వ్యాసంగం నాకు జీవన భృతిని ప్రసాదిస్తుంది. మెల్లిమెల్లిగా అతని వ్యామోహం పూర్తిగా తొలిగిపోయింది. నాకు రెక్కలుంటే ఎంత బావుండు అనిపిం చింది. వెంటనే వెళ్లి రాంచీలో వాలిపోయే దాన్ని. సంతోషంతో పొంగిపోతూ నేను బనారస్‌కు వచ్చేటప్పుడు తీసుకొచ్చిన ఆ కొద్దిపాటి సామాను మళ్లీ ప్యాక్ చేయసా గాను. అతనికి సంబంధించిన వస్తువులు ఇక్కడే వదిలేస్తాను. అతనికి సంబంధిం చిన వస్తువులే కాదు, అతని తలంపులు కూడా అంతరంగం నుంచి తొలగించదలి చాను. అతని జ్ఞాపకాలు ఏవీ కళ్లముందు ఉండకూడదు.

అదేరోజు ప్రయాణం కట్టాను. తెల్లవారే సరికి రైలు రాంచీ చేరుకుంది. రైలు దిగ కముందే కుమారన్ మమ్మల్ని వెతుకుతూ కంగారుగా కిటికీలోంచి కనిపించాడు. మమ్మల్ని చూడగానే అతని మొహం సంతోషంతో మెరిసింది. కూలీని పిలిచి గబగబా మా సామానంతా దింపించాడు. స్టేషన్ బయట ఒక ఆటో మాట్లాడి సామాను సర్ది మమ్మల్ని కూర్చోబెట్టి తీసు కెళ్ళాడు. రాంచీలోని ఎగుడు దిగుడు రోడ్డుమీద ఆటో ముందుకు దూసుకువెళ్తూ ఉంటే, నూతనోత్సాహంతో నా మనస్సు ఉరకలు వేస్తోంది. ఓ కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టబోతున్న ఆనందం ఉప్పొంగు తోంది. ఆటోరిక్షా ఎన్నో మలుపులు తిరు గుతూ, తిరుగుతూ ఒక వీధి మలుపులో ఆగింది. మేము ఆటో దిగి, చుట్టు పరిస రాలను గమనించగా, అది తెలిసిన వీధి లాగే అనిపించింది. అది కుమారన్ నివ సించే వీధిలాగే ఉంది. అక్కడే అద్దెకు ఒక చిన్న ఇల్లు చూసాడు. ఆ ఇంట్లోనే మా సామాను దింపించాడు. మేము ఇంకా ఇంట్లో అడుగు పెట్టకముందే, కుమారన్ భార్య సులభ పరిగెత్తుకొచ్చి, నన్ను ఆప్యా యంగా కౌగిలించుకుంది. ఆ ఆదరణకి నా కళ్లు చిప్పిల్లాయి. ఆమె భుజం మీద నా తల వాల్చేసి గొల్లుమని ఏడ్చేశాను. వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఆమె కళ్లు కూడా చెమ్మ గిల్లాయి. నన్ను ఓదారుస్తూ చెయ్యి పట్టు కుని ఆ ఇంట్లోకి తీసుకెళ్ళింది. రెండు గదుల చిన్న ఇల్లు అది. అందులోనే ఒక వైపు కిచెన్, బాత్రూం అన్ని సదుపా యాలు ఉన్నాయి. బయట కొద్దిపాటి వరండాకి గ్రిల్ ఉంది. వాకిట్లో చెట్లు కూడా ఉన్నాయి. ఇల్లు మాకు సరిపో యేలా చక్కగా ఉంది.

ఇల్లు చిన్నదే అయినా ఇది నా ఇల్లు... నా సంసారం... మావారు గుర్తుకు వచ్చారు. ఆయన కూడా ఒకప్పుడు ఇలాంటి చిన్న ఇంట్లోనే అన్ని సదుపాయా లతో కాపురం ఏర్పాటు చేశారు. ఎంతో హాయిగా, సంతోషంగా గడిపాం. వీధిలో ఇరుగుపొరుగుతో ముచ్చట్లు, మురిపాలతో ఎంతో ఉల్లాసంగా కాలక్షేపం అయిపో యేది. ఎప్పుడూ వీధిలో సందడిగా, గోలగా ఉండడంతో సమయం ఇట్టే గడిచి పోయేది. ఆ అపార్టుమెంట్‌లోకి మారాకే, ఒంటరితనంతో మనస్సు చంచలమైపో యింది. ఆలోచనలో మునిగిపోయి ఉండడం చూసి, సులభ నన్ను కుదుటప రచడానికి ప్రయత్నించింది. ఒక ఆడది మరో ఆడదాన్ని మనస్సును అర్థం చేసుకో



గలుగుతుంది.

"నువ్వేం చింతించకు, నేనెప్పుడూ నీకు తోడుగా ఉంటాను.." అభయమిచ్చి మళ్లీ తానే చెప్పింది, "ఇవాళ భోజనం నేను తీసుకొస్తాను. ముందు మీరంతా ఫ్రెష్ అవ్వండి"

సులభ కురిపించే ఆత్మీయతకు పిల్లలు కూడా సంతోషంగా కనిపించారు. ఇక ఈ స్నేహాన్ని, ఈ అనురాగాన్ని వదులుకోను.




**ప్ర**తి గాయం తన గుర్తును మిగిలించినంత మాత్రాన మనిషి వాటినే తలుచుకుంటూ కుమిలి కృశించిపోడు. నా జీవితంలోకి ఆ దుర్ఘడియలు అతని ఆగమన సాక్షిగా నిలిచాయి. అదో దుస్సంఘటనగా మారింది. ఆ దుస్సంఘటనతో జీవితమే గల్లంతయిపోయింది.

చూస్తూ, చూస్తూ ఏడెనిమిది నెలలు గడిచిపోయాయి, అతనికి దూరంగా వచ్చేసి. నాకే వింతగా అనిపిస్తోంది. వారం పదిరోజులు కూడా ఎడబాటు సహించని మనిషిని ఇంత సులువుగా విడనాడి ఎలా ఉండగలిగానని ఆశ్చర్యం కలిగింది. ఇన్నిరోజులు ఇట్టే గడిచిపోయాయి. కావాలనే అతని జ్ఞాపకాలని మదిలోంచి తొలగించేశాను. బహుశా ఇదే సరైన నిర్ణయం కామోసు. మరిచిపోవడమే ఉత్తమం. ఆత్మబంధమన్న ఆరాటాన్ని, బలహీనతని బలవంతంగా నొక్కిపెట్టాను. మళ్లీ అలాంటి బలహీన క్షణాలకి, ఎలాంటి అనుచిత ఆకర్షణలకి తావిచ్చే ప్రసక్తే లేదు.

నా నిర్ణయాన్ని, ఉద్దేశాన్ని అతనికి అంతు పట్టనీయకుండా, నిశ్శబ్దంగా అక్కడ్నుంచి వచ్చేసి చాలా మంచిపని చేశాను. పరపురుషుడి ఆకర్షణలో, సజావుగా సాగిపోతున్న సంసారాన్ని విచ్ఛిన్నం చేసుకొని, మనసా వాచా అతన్ని నమ్మి వచ్చిన నాకు అతని అసలు స్వరూపం ఆలస్యంగా అవగతమయింది.

నా అంతరంగంలో గూడు కట్టుకున్న బలహీనత, కేవలం అతనికి భోగవస్తువుగానే ఉపయోగపడింది గానీ, పరస్పర ప్రేమను అందిపుచ్చుకోలేకపోయింది. ఆత్మబంధం వీగిపోయింది. అతను పూర్తిగా స్వార్థపరుడని రుజువయిపోయింది.

అందుకే అతనికి చెప్పాపెట్టకుండా, చిన్నపాటి ఉత్తరం, మిసెస్ మిశ్రాగారికిచ్చి వచ్చాను- 'నేను వెళ్తున్నాను. ఈ ఇల్లు, ఈ నగరం, నిన్ను విడిచి శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. ఎక్కడికి వెళ్తున్నానో నాకే తెలియదు. నన్ను వెతికే ప్రయత్నం చేయొద్దు. -ముక్తా' అని.

మిసెస్ మిశ్రాగారు ఆ ఉత్తరం చూసి ఆనందించింది. నేను నా సొంత ఇంటికి, నా భర్త దగ్గరకి తిరిగి వెళ్తున్నానని అనుకుంది. భార్యాభర్తలు కలిసి ఉండడం ఎంత అనివార్యమో వివరించింది. ఆమెను అదే భ్రమలో ఉంచి వచ్చేశాను.

అతడిని వారం రోజులైనా విడిచి ఉండలేని నేను ఇప్పుడు ఎన్నాళ్లయినా ఇక్కడ సునాయాసంగా గడిచిపోతున్నాయి. ఆ కొత్త ప్రాంతంలో, ఏదీ కొత్తగా అనిపించడం లేదు. ఎలాంటి లోటు అనిపించడం లేదు. జీవితం మామూలుగా సాగిపోతోంది. ఎంత గుర్తు తెచ్చుకోవద్దనుకున్నా

ఒక్కోసారి అతని నిరాదరణ, విశ్వాస ఘాతుకం గుర్తుకొచ్చి గుండెల్లో కెలికినట్లు అవుతోంది. ఎంత మురిపించాడో, అంత ఏడిపించాడు. నా స్వాభిమానం అప్పుడు ఏమైపోయింది? ఒక ఆటబొమ్మలా నాతో ఆడుకునే అవకాశం అంత సులువుగా ఇచ్చాను. అప్పుడు నాకు అపరాధభావమే కలుగలేదు. ఒకక్షణం కూడా పశ్చాత్తాప పడకపోగా, అతనిపట్ల తృష్ణ పెరిగింది.

పదిహేడు నెలల వనవాసం, అర్జునుడు నపుంసకుడిలా గడిపిన ఆ ఒక్క సంవత్సర అజ్ఞాతవాసం కంటే ఘోరంగా గడిచింది. అర్జునుడు శారీరకంగా నపుంసకుడైతే నేను మానసికంగా నపుంసకురాలినై పోయాను. ఒక దాసిలా జీవించాను. సమస్తం అర్పించాను. అంతగా లొంగిపోయిన నేను, ఇంత సులువుగా విముక్తి పొందగలగడం కూడా తలుచుకుంటే ఆశ్చర్యంగానే ఉంది. నా ఇంటిని, నా పిల్లల భవిష్యత్తుని తీర్చి దిద్దుకోవడమే ఇప్పటి నా కర్తవ్యం.

ఇల్లు చిన్నదే అయినా, సరిపోను సామగ్రి లేకపోయినా ఎలాంటి లోటు అనిపించడంలేదు. ఇక్కడ మరొకరి ఇంటితో వ్యత్యాసం పోల్చుకునే వ్యథలేదు. అతని నిర్లక్ష్యానికి గురవుతున్న సంతాపం లేదు. ప్రతీది నా సొంతం. నా సొంత అభిప్రాయంతో గడిచిపోతుంది.

నా మనసులో ఇప్పుడు ఎలాంటి పశ్చాత్తాపం లేదు. నా తప్పిదం పట్లగానీ, నాకు జరిగిన నష్టం పట్లగాని చింతించడం లేదు. నా జీవితంలో దుస్సంఘటన జరగాల్సివుంటుంది. అతని రూపంలో జరిగింది. ఎన్ని తుపాను తాకిడులకు గురైనా జరిగే వినాశనం జరుగుతుంది. మిగిలే విషాదం మిగులుతుంది. మనిషి దాన్నే తలుచుకుంటూ కుమిలిపోడు. కొద్దిపాటి గడ్డిపోచ ఆధారం దొరికినా పునర్నిర్మాణంలో తలమునకలై పోతాడు. శాయశక్తులా ప్రయత్నిస్తాడు..

నేను తలుచుకుంటే మావారి దగ్గరకు కూడా వెళ్లేదాన్నే. ఆయన నన్ను క్షమించగలడన్న నమ్మకం కూడా ఉంది. అయితే ఆయన నా వర్తమానాన్ని మన్నించగలడా? నా వర్తమానం ఆయన్ని నిశ్చింతగా ఉంచగలదా? నిశ్చింతగా బతకని

వ్వదు.

నాకు తెలుసు. ఏ మగాడైనా భార్య చెడు గతం సహించజాలడు. నా వర్తమానం మచ్చపడ్డ గతం. నీచమైన గతం. సమాజం హర్షించని విషయం.

ఆయన కళ్లముందుండి ఆయన్ని మానసికంగా హింసించడం నాకు ససేమిరా ఇష్టంలేదు. నా ప్రవర్తనని గ్రహించి కూడా నిలదీయకపోవడం ఆయన ఔదార్యం. ఆయన అనుభవించిన మానసిక వేదన, మానసిక క్షోభ తక్కువేం కాదు.

నన్ను నిందించలేక తన మానాన తను తప్పుకున్న ఉత్తముడాయన. ఒక సుడిగాలి నన్ను ఆయన్ని విడదీసింది. ఒక తుపాను నన్ను ఆయనకి దూరం చేసింది.

ఒక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనిపించింది. కానీ అది పిరికితనమే కాదు, పాపం కూడా. నేను చేసిన తప్పుకు పిల్లల్ని అధోగతి పాలు చేయడం భావ్యంకాదు. జీవిస్తూనే తప్పును సరిదిద్దుకోవాలని తలచాను. స్వతహాగా జీవించాలన్న నిర్ణయం నన్ను బలోపేతం చేసింది. శామ్యూల్ నన్ను వివశురాలిగా, అసహాయురాలిగా భావించి చులకన చేశాడు. అతని అవకాశవాదమే నన్ను మేల్కొల్పింది. జాగృతపరిచింది. నా అంతరంగాన్ని కమ్ముకున్న కారు చీకటి తొలిగిపోయింది.

గడిచిన ఈ కొద్ది నెలల్లో నాపై పడ్డ చూపులన్నీ కుమారన్‌లా సరళమైనవీ, సహజమైనవీ కావు.. స్థలం మారింది. మనుషులు మారలేదు. కొన్ని చూపుల్లో యాచన, కొన్ని చూపుల్లో కుటిలత్వం, కొందరిలో ఆకలిచూపులు తారసపడ్డాయి.

ఆ చూపుల భాషని గ్రహించడంలో నేను ఇప్పుడు ఏమాత్రం ఏమరపాటుకు గురికాను. మళ్లీ బోల్తాపడే అవకాశమే లేదు.

పిల్లలు ఇప్పుడు సంతృప్తిగా ఉన్నారు. శ్రద్ధగా స్కూలుకు వెళ్తున్నారు. చక్కగా చదువుకుంటున్నారు. ఆడుకుంటున్నారు. నవ్వుతూ, తుళ్లుతూ నా దినచర్యల్లో సహకరిస్తున్నారు. గతపు ఛాయలు మచ్చుకైనా వాళ్లల్లో కనిపించడం లేదు. కొత్త కొత్త స్నేహితులతో ఉత్సాహంగా ఉంటున్నారు. తండ్రి గురించి గానీ, అంకుల్ గురించి గానీ ఎలాంటి ఊసూ ఎత్తడం లేదు వాళ్లు.

పరిస్థితుల్ని అర్థం చేసుకుని మెదిలే ఔచిత్యం వాళ్లకెలా అబ్బిందని నాకే ఒక్కోసారి ఆశ్చర్యమేస్తుంది.

బిజీబిజీగా జీవితం సాగిపోతుంది. రోజులు వారాలు, నెలలు దాటేస్తూ వేగంగా గడిచిపోతున్నాయి.

ఉద్యోగం, ట్యూషన్లు, రచనా వ్యాసంగం, పిల్లల ఆలనా, పాలనతో సంతృప్తిగా బతుకు బండి సాగిపోతోంది. సహృదయులైన కుమారన్ దంపతుల అండదండలతో సాఫీగా జీవనం గడుస్తోంది. బంధాలు, అనుబంధాల విలువ, స్నేహం ప్రాముఖ్యం వాళ్లకి బాగా తెలుసు. రాంచీకి రావాలన్న ఆలోచన నా జీవితాన్నే మలుపు తిప్పింది.

నేను అతన్ని మరిచిపోలేనేమో, అతన్ని వదల్లేనేమో అన్న అనుమానంతో చాలారోజులు మథనపడ్డాను. నా మానసిక దౌర్బ

ల్యం నా వ్యక్తిత్వాన్నే విచ్ఛిన్నం చేసింది. ఊబిలోకి నెట్టేసింది. చాలా తీవ్రంగా, తీక్ష ణంగా ఆలోచించి అతనికి దూరమవడా నికి సాహసించాను.

ఇప్పుడు ఇక్కడ నేను కేవలం ముక్తని, ఒక తల్లిని, ఒక వ్యక్తిని. నా తరహాలో నేను జీవిస్తున్నాను.

"మమ్మీ నా బ్యాగు రెడీ చేస్తావా? " రితు అడగ్గానే నేను ఉలిక్కిపడ్డాను. ఇవాళ పిల్లలు పిక్నిక్‌కి వెళుతున్నారు, స్కూలు తరఫున. పొద్దుట్నుంచి అదే హడావుడిలో ఉన్నాం. టిఫిన్లు, క్యారెట్ హల్వా, వాటర్‌బాటిల్స్ వగైరా అన్నీ సిద్ధం చేశాను. బస్సు ఇంటి ముందుకే వస్తుందట. దానికోసమే వారు ఎదురు చూస్తున్నారు.

"అన్నీ రెడీ చేశాను తల్లీ. కొన్ని పళ్ళు, మిఠాయిలు కూడా పెట్టనా? చక్కగా తినాలి. చెల్లెల్ని జాగ్రత్తగా చూసుకో" రితుకు సముదాయించి చెప్పాను.

"క్యారెట్ హల్వా పెట్టావు కదా? "

"పెట్టాను తల్లీ, అన్నీ కరెక్టుగా సర్దాను. స్నేహితులతో కలిసి తినాలి"

"సరే మమ్మీ. కానీ ఆ ప్రియ రాక్షసికి ఏమీ ఇవ్వను. నన్ను ఎప్పుడూ ఆట పట్టి స్తుంది. చాలా కొంటెపిల్ల"

"అలా అనొద్దమ్మా. స్నేహితులతో కలి సిమెలిసి ఉండాలి" రితుని బుజ్జగిస్తుండగా బయటనుంచి హారన్ ధ్వని వినిపించింది. రితు వెంటనే కిటికీలోంచి తొంగి చూసింది.

"బస్సు వచ్చేసింది మమ్మీ. పద, మోనూ. మమ్మీ నా బ్యాగు అదీ పట్టు కురా..." రితు హడావుడి చేసింది.

"అన్నీ తెస్తున్నాను తల్లీ. నువ్వు పద"

రితు నీళ్లబాటిల్స్ అందుకుంది. నేను టిఫిన్, బ్యాగు పట్టుకుని మోనూని వెంట బెట్టుకుని బయటికొచ్చాను. ఇద్దర్నీ బస్సు ఎక్కించి, సామానంతా టీచర్‌కు అప్పగిం చాను. ఇద్దరూ సీటుపై కూచొని 'బాయ్' చెప్పారు. నేను కూడా చెయ్యి ఊపాను. బస్సు కదిలింది.

ఏడాది తర్వాత కాస్త విశ్రాంతి, ఏకాంతం దొరికింది. ఇల్లంతా చిందర వందరగా ఉంటే సర్దాను. గోడలకి, కప్పుకి పేరుకుపోయిన బూజుల్ని, దుమ్ముని పొడువాటి కట్టె చీపురుతో దులిపాను. ఇల్లంతా శుభ్రంచేసి, స్నానం చేశాను. కప్పులో టీ పోసుకుని ముందు గదిలోకి వచ్చి కూర్చున్నాను.

టీ తాగుతుండగా హఠాత్తుగా గుర్తొ చ్చింది. కొన్ని కవితలు సిద్ధమయ్యాయి. ఒక పబ్లిషర్ వాటిని సంపుటిగా అచ్చు వేస్తానన్నారు. వాటిని వరుసగా కూర్చి పబ్లిషర్‌కు చూపించి, ఇవి పూర్తి యథార్థ, వాస్తవిక విరహ వేదన కవితలని చెప్పాలి. ప్రకృతి ప్రకోపించినప్పుడు ఉద్వేగభరి తంగా జాలువారినవి.

ఇంట్లో గోడలు కూడా బోసిగా ఉన్నాయి. కొన్ని ఆయిల్ పెయింట్స్ కూడా తీసుకురావాలి. ఖాళీగోడలు మన సులో నిస్తేజాన్ని కలిగిస్తాయి. ఒకే రంగు జీవితాన్ని ఉదాసీనంగా మారుస్తుంది.

టీ తాగేసి, కప్పు టీపాయ్ మీద పెడు తూనే నా దృష్టి దినపత్రిక మీద పడింది. ఇవాళ పొద్దుట్నుంచి పేపరే చదవలేదు.

అప్పుడే తలుపు తట్టిన శబ్దం అయ్యింది. అదే సుపరిచిత ధ్వని.. హఠా త్తుగా మదిలో మెదిలింది.. అతనేనేమో..!

పేపర్ టీపాయి మీద పెట్టి చిన్నగా అడుగులేస్తూ, తలుపుదాకా వచ్చాను. మెల్లిగా గడియతీసాను.

తలుపు తెరవగానే, వేగంగా ఒక గాలితా కిడి రివ్వున లో పలికి దూసుకొచ్చి, టీపా య్ మీదున్న దినపత్రిక కాయితాలు రెప రెపలాడాయి. ©